సార్వత్రిక ఎన్నికలు రాగానే నాయకుల పార్టీ ఫిరాయింపులు ఆనవాయితీగా మారాయి. అందుకు పూర్వం నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చోటుచేసుకున్న రాజకీయాలు దర్పణం పడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఇటు కాంగ్రెస్, అటు కమ్యూనిస్టులు ప్రత్యర్థులుగా ఉన్న కాలంలో కూడా నాయకులు పార్టీలు మారారు. 1970లో జిల్లా ఆవిర్భావం తర్వాత అవి అధికమయ్యాయి. అంతకుముందు స్వతంత్ర అభ్యర్థులు సొంత ప్రజాబలంతో గెలుపొందగా ఆతర్వాత కొంతకాలానికి పార్టీల పరోక్ష మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించారు. అనంతరం క్రమంగా పార్టీల ప్రభావిత రాజకీయాలు పెరిగిపోయాయి. అప్పటి నుంచి అవసరానికి అనుగుణంగా నాయకుల ఫిరాయింపు రాజకీయాలూ మరింత ఊపందుకున్నాయి.

నేటి నాయకులూ అదేబాట

కొత్త పార్టీలు రావడం, ఉన్న దానిలో గుర్తింపు లేకపోవడమే ప్రధాన కారణం

అటూ..ఇటూ దూకుళ్లు

జిల్లా ఏర్పడకముందూ.. ఆ తర్వాతా ఫిరాయింపులు



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏర్పాటుకు ముందు కూడా నాయకుల ఫిరాయింపు రాజకీయాలు కొనసాగాయి. అప్పట్లో కర్నూలు జిల్లాలో ఉండి తరువాత ప్రకాశం జిలాలో చేరిన గిద్దలూరు ప్రాంతంలో రాజకీయంగా చక్రం తిప్పిన పిడతల రంగారెడ్డి 1955-1972లో కాంగ్రెస్ తరఫున, 1978లో జనతా పార్టీ తరుఫున పోటీచేసి గెలుపొందారు. 1985లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయన టీడీపీ మద్దతుతో గెలుపొందారు. 1955లో కెఎల్‌పీ పార్టీ తరఫున మార్కాపురం నుంచి గెలుపొందిన కందుల ఓబుల్‌రెడ్డి 1962లో అదేస్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1967లో మార్కాపురం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన చప్పిడి వెంగయ్య తెలుగుదేశం ఆవిర్భావం తరువాత ఆపార్టీలో చేరి 1994లో కంభం నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అప్పట్లో నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గం నుంచి 1955లో కాంగ్రెస్ పక్షాన గెలుపొందిన దివి కొండయ్యచౌదరి 1962లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. 1978లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. అదే నియోజకవర్గం నుంచి మానుగుంట ఆదినారాయణరెడ్డి 1972, 1983లో స్వతం త్ర అభ్యర్థిగా గెలుపొందారు. 1985 ఎన్నికల నా టికి కాంగ్రెస్‌లో చేరి విజయం సాధించారు. అప్పట్లో గుంటూరు జిల్లా పరిధిలో ఉన్న అద్దంకి నియోజకవర్గం నుంచి నాగినేని వెంకయ్య కేఎల్‌పీ తరఫున గెలుపొంది 1967లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. చీరాల నియోజకవర్గంలో 1952లో ప్రగడ కోటయ్య కేఎంపీపీ నుంచి, 1955 ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో చేరి ఆపార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. ఇక్కడ 1982 ఉప ఎన్నికల్లో జనతా అభ్యర్థిగా గెలుపొందిన సజ్జా చంద్రమౌళి 1985 ఎన్నికల్లో టీడీపీ పక్షాన పోటీచేసి విజయం సాధించారు. అలాగే పొదిలి నియోజకవర్గం నుంచి 1962, 67లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన కాటూరి నారాయణస్వామి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా, 1983లో దర్శి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఇలా అప్పట్లోనే అనేకమంది ప్రముఖులు ఆయా ఎన్నికల సమయాల్లో పార్టీ ఫిరాయింపు రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత రాజకీయాల్లో ఉన్న పలువురు నాయకులు, కొందరి కుటుంబాల చరిత్రను తిరగేస్తే ఆయా సందర్భాల్లో నాయకుల ఫిరాయింపుల జోరుగానే సాగిన విషయం తేటతెల్లమవుతుంది.

1983, 85 ఎన్నికల్లో..

ఉమ్మడి ప్రకాశం జిల్లా 1970లో ఏర్పడగా ఆ తర్వాత 1972,78లో జరిగిన ఎన్నికల్లో కొందరు ఫిరాయింపు రాజకీయాలకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయి. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత ఈ పరంపర అధికంగా కొనసాగింది. ఆయా పార్టీల్లో ఉన్నవారితోపాటు పలువురు యువకులు కొత్తగా రాజకీయ రంగ ప్రవేశం చేసి టీడీపీలో చేరారు. 1983లో టీడీపీ పక్షాన పర్చూరు నుంచి గెలుపొందిన దగ్గుబాటి చౌదరి, మార్కాపురం నుంచి గెలుపొందిన వీవీ నారాయణరెడ్డి, గిద్దలూరు నుంచి విజయం సాధించిన ఎం.పీరారెడ్డిలు ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి దింపిన సమయంలో నాదెండ్ల భాస్కర్‌రావు పక్షాన చేరారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో వీరిలో పీరారెడ్డి గిద్దలూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో దగ్గుబాటి చౌదరి, నారాయణరెడ్డిలకు ఏపార్టీ టికెట్లు కూడా ఇవ్వలేదు. 1985 మధ్యంతర ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి కరణం బలరాం టీడీపీలో చేరగా గొట్టిపాటి హనుమంతరావు టీడీపీని వీడి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు. కందుకూరు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఆదినారాయణరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

గొట్టిపాటి కుటుంబం

గొట్టిపాటి కుటుంబంలోని నాయకులు పలు సందర్భాల్లో పార్టీలు మారారు. గొట్టిపాటి హనుమంతరావు 1983లో మార్టూరు నుంచి టీడీపీ పక్షాన గెలుపొంది ఆతర్వాత వెంకటేశ్వరరావు కోసం ఏడాదిలోపు పదవికి రాజీనామా చేశారు. టీడీపీ తరఫున 1984లో జడ్పీ చైర్మన్ బాధ్యతలు చేపట్టి 1985 ఎన్నికల నాటికి ఆపార్టీ పదవికి రాజీనామా చేశారు. 1989లో కాంగ్రెస్ పక్షాన మార్టూరు నుంచి పోటీచేసి ఓడి పోయారు. తిరిగి 1994లో టీడీపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా మార్టూరు నుంచి గెలుపొందారు. ఆ తర్వాత చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేస్తూ మృతి చెందారు. అనంతరం జరిగిన ఉపఎన్నికలో ఆయన వారసుడిగా కుమారుడు నరసయ్య మార్టూరు నుంచి గెలుపొందారు. 2004 ఎన్నికల నాటికి ఆయన సోదరుడు గొట్టిపాటి రవికుమార్ రాజకీయాల్లోకి వచ్చి మార్టూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 2009లో అద్దంకి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన రవికుమార్ 2014 ఎన్నికల్లో వైసీపీలో చేరి ఆపార్టీ తరఫున విజయబావుటా ఎగురవేశారు. 2015లో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరారు. 2019లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొంది ఎమ్మెల్యేగా ఉన్నారు.

కరణం బలరాం

1978లో అద్దంకి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన బలరాం.. 1983లో అదేపార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. చంద్రబాబు సహకారంతో టీడీపీలో చేరి 1985-89 ఎన్నికల్లో మార్టూరు నుంచి ఆపార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. 1994 ఎన్నికల నాటికి టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి మార్టూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. తిరిగి 1998లో టీడీపీలో చేరి ఆపార్టీ తరఫున 1999లో ఒంగోలు ఎంపీగా గెలుపొందారు. 2004లోనూ అద్దంకి నుంచి గెలుపొందిన బలరాం 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన 2019 ఎన్నికల్లో చీరాల నుంచి టీడీపీ తరఫున గెలుపొందారు. ఏడాది తరువాత వైసీపీలో చేరిపోయారు.

మాగుంట శ్రీనివాసులరెడ్డి

వ్యాపార రంగంలో ఉన్న మాగుంట కుటుంబం నుంచి 1991లో ఒంగోలు లోక్‌సభ నుంచి కాంగ్రెస్ తరఫున మాగుంట సుబ్బరామిరెడ్డి గెలుపొందారు. ఆయన 1995లో హత్యకు గురవగా 1996లో ఆయన సతీమణి పార్వతమ్మ, 1998లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎంపీగా గెలుపొందారు. 1999 ఎన్నికల్లో ఓటమి చవిచూసిన శ్రీనివాసులరెడ్డి 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన ఒంగోలు ఎంపీగా గెలుపొందారు. 2014లో టీడీపీలో చేరి పోటీచేసి ఓడిపోయారు. ఆతర్వాత టీడీపీలో ఎమ్మెల్సీగా గెలుపొందిన ఆయన 2019 ఎన్నికల నాటికి వైసీపీలో చేరి ఆ పార్టీ తరఫున ఒంగోలు ఎంపీ అయ్యారు. ప్రస్తుతం ఆ పార్టీ తరఫున ఆయన కుమారుడు చీరాల నుంచి పోటీ చేయబోతున్నారు.

డాక్టర్ గరటయ్య

తొలుత జనతా, ఆతర్వాత లోక్‌దళ్ పార్టీల్లో ఉన్న బాచిన చెంచుగరటయ్య టీడీపీ ఆవిర్భావంతో ఆపార్టీలో చేరి 1983, 1985లో అద్దంకి నుంచి గెలుపొందారు. 1989లో ఓటమి చెందిన తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 1994 ఎన్నికల సమయంలో నామినేషన్‌కు చివరి రోజు టీడీపీలో చేరి ఆపార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. 1999లో తిరిగి టీడీపీ తరఫున గెలుపొందిన ఆయన 2004లో పోటీ చేయలేదు. 2009 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఆతర్వాత వైసీపీ తీర్థంపుచ్చుకున్న ఆయన 2019 ఎన్నికల్లో ఆపార్టీ తరఫున అద్దంకి నుంచి పోటీచేసి ఓడారు. ప్రస్తుతం ఆయనతో పాటు, కుమారుడు చైతన్య టీడీపీ, జనసేన కూటమిలో చేరే అవకాశం ఉంది.

ఇతర పలువురు

జిల్లా రాజకీయాల్లో ప్రస్తుతం చురుగ్గా ఉన్న మరికొందరు నాయకులు కూడా ఆయా సందర్భాల్లో పార్టీ ఫిరాయింపులు చేసిన వారే. ప్రస్తుతం కనిగిరి నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగంలో ఉన్న డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అక్కడ 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. 2014 ఎన్నికల్లో గిద్దలూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా గెలుపొందిన అశోక్‌రెడ్డి కూడా 2015లో టీడీపీలో చేరారు. ఈఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి రాబోతున్నారు. ప్రస్తుతం గిద్దలూరు ఎమ్మెల్యేగా ఉన్న అన్నా రాంబాబు 2009లో పీఆర్‌పీ తరఫున గెలుపొంది ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2014 ఎన్నికల నాటికి సైకిలెక్కిన ఆయన టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల నాటికి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. సంతనూతలపాడు నుంచి 2009లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన బీఎన్‌విజయ్‌కుమార్ తర్వాత టీడీపీలో చేరి ప్రస్తుతం అదేస్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు.

రాష్ట్రంలో తొలి విజయం కనిగిరిదే కావాలి

టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

వైసీపీని వీడి సైకిలెక్కిన

ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాము

పామూరు, ఫిబ్రవరి 20 : రాష్ట్రంలో టీడీపీ తొలి విజయం కనిగిరి నుంచే ప్రారంభం కావాలని ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. కనిగిరి ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ దరిశి రాము వైసీపీని వీడి ఆదివారం ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ఉగ్రకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అక్కడున్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఉగ్ర పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా పువ్వాడి రాధాకృష్ణ కన్వెన్షన్ హాలుకు చేరుకొని సభలో ప్రసంగించారు. టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా తొలిజాబితాలో తన పేరు ఉండడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని నిజం చేసేలా ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆయనకు బహుమతిని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మీరిచ్చే ఆశీర్వాదమే కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి బాటవేస్తుందన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఏఎంసీ వైస్ చైర్మన్ దరిశి రాముకు కండువావేసి ఉగ్ర ఆహ్వానించారు. టీడీపీ పట్టణ కమిటీ చైర్మన్ డీవీ మనోహర్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు జి.దశరథరామయ్య, ఆవుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌కావిటి సుబ్బయ్య, రాష్ట్ర కమిటీ నాయకుడు ఎ.ప్రభాకర్‌చౌదరి, కె.సుభాషిణి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, జిల్లా కమిటీ నాయకులు సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, షేక్ గౌస్‌బాషా, ఇర్రి కోటిరెడ్డి, మన్నం రమణయ్య, డోలా శేషాద్రి, యారవ శ్రీనివాసులు, పువ్వాడి రామారావు, తడికమళ్ల సుబ్బారావు, పువ్వాడి వెంకట్‌చౌదరి, సాయిబాబా దేవస్థానం చైర్మన్ పబ్బర్తి వెంకట సుబ్బయ్య, జి.శ్రీనివాసులు, ఎన్.సాంబయ్య, బి.మార్కు, బి.సత్యం, పోకా నాయుడుబాబు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాముకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఉగ్ర

మోపాడులో 65 కుటుంబాలు చేరిక

మండలంలోని మోపాడు గ్రామంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యవర్గసభ్యుడు వైఎస్ ప్రసాద్‌రెడ్డి అధ్వర్యంలో వైసీపీకి చెందిన సుమారు 65 కుటుంబాల వారు ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ పచ్చ కండువాలు వేసి ఉగ్ర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉగ్ర మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి నవరత్నాల పేరుతో పేదలపై భారాలు మోపారన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.గిడ్డయ్య యాదవ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.హుసేన్‌రావుయాదవ్, దేవరపు మాల్యాద్రి, కొలూరి రహంతుల్లా, తెలగాల ప్రసాద్, దారపనేని సుబ్బారావు, బాబు, ఇల్లూరి కోదండరామిరెడ్డి, బూత్ కమిటీ ఇన్‌చార్జి ఖాజామస్తాన్, కల్లూరి పుల్లయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

ఎనిమిది గంటలకే కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులు

రెండు చోట్ల తనిఖీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

చిన్నారిని లాలించిన మహిళా కానిస్టేబుల్

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 25 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. మొత్తం 21,565 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారి కోసం 69 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు 17,860(82శాతం) మంది హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే ఆయా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకున్నారు. ఒంగోలులో అత్యధికంగా 28 సెంటర్లు ఏర్పాటు చేయగా అక్కడికి పరీక్ష రాసేవారితోపాటు వారితల్లిదండ్రులు తరలిరావడంతో కోలాహలం నెలకొంది. నిర్ణీత సమయానికి అర్ధగంట ముందుగానే అభ్యర్థుల హాల్ టికెట్లను పోలీసులు, ఆయా కాలేజీల నిర్వాహకులు పరిశీలించి లోపలికి అనుమతించారు. సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుతించలేదు. వాటిని బయటే ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రూపు-2 పరీక్ష రాసేందుకు జిల్లాలోని పలుప్రాంతాలతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా అభ్యర్థులు ముందురోజు రాత్రే ఒంగోలు చేరుకున్నారు. కొందరు తల్లులు చంటిబిడ్డలతో సహా వచ్చారు. బయట వారి కుటుంబ సభ్యులకు చిన్నారులను అప్పగించారు. ఒక పరీక్షా కేంద్రం వద్ద ఓ చిన్నారి ఏడుస్తూ ఉండటాన్ని గమించిన అక్కడ విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ ఆ చిన్నారిని పరీక్ష పూర్తయ్యే వరకూ తన వద్దనే ఉంచుకొని లాలించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీహర్షిణీ కళాశాలతోపాటు క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మరోవైపు ఆయా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి బందోబస్తును పరిశీలించడంతోపాటు పలు కేంద్రాలను తనిఖీ చేశారు. మంగమూరు రోడ్డులోనే ఐదారు పరీక్షా కేంద్రాలు ఉండటంతో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత అభ్యర్థులంతా ఒక్కసారిగా బయటకు వచ్చారు. దీంతో మంగమూరు రోడ్డు జంక్షన్‌లో ట్రాఫిక్ నిలిచిపోయింది. జవాబు పత్రాలు ఆదివారం రాత్రి ప్రత్యేక బస్సులో విజయవాడకు తరలించారు.



ఒంగోలులో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ (ఇన్‌సెట్లో) ఓ అభ్యర్థిని బిడ్డను లాలిస్తున్న మహిళా కానిస్టేబుల్

క్రమబద్ధీకరణ కష్టాలు

22ఏలో చేరిన భూముల రిజిస్ట్రేషన్ కోసం

ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేస్తున్న రైతులు

అవసరాన్ని ఆసరా చేసుకొని భారీగా

డిమాండ్ చేస్తున్న అధికారులు

డబ్బులు తీసుకొనీ పని చేయని వైనం



దర్శి తహసీల్దార్ కార్యాలయం

దర్శి, ఫిబ్రవరి 25 : రైతులకు సంపూర్ణ హక్కులు కల్గిన పట్టాభూములను రెవెన్యూ అధికారులు 22ఏలో నమోదు చేసి ఆటలాడుకుంటున్నారు. రైతులు క్రమబద్ధీకరణ కోసం ఏళ్ల తరబడి తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ సబ్ డివిజన్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో పాలుపోక అన్నదాతలు అల్లాడుతున్నారు. రెవెన్యూ రికార్డుల క్రమబద్ధీకరణలో భాగంగా 2018లో అధికారులు దస్త్రాలను సక్రమంగా చూడకుండా అనేకమంది రైతుల పట్టాభూములను 22ఏలో నమోదు చేశారు. అప్పటి అధికారులు ఉద్దేశపూర్వకంగానే అనేక భూములను నిషిద్ధ జాబితాలో చేర్చారు. ఆ తర్వాత 22ఏ జాబితా నుంచి తొలగించి మళ్లీ హక్కులు కల్పించేందుకు అప్పటి నుంచి రైతులతో ఆటలాడుకుంటున్నారు. లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది రైతులు అధికారులు అడిగినంత సొమ్ము చెల్లించినా పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అధికారులు ముడుపులు తీసుకొని పనిచేయకుండా వెళ్లిపోయారు. సంబంధిత రైతులు డబ్బులు పోగొట్టుకొని రికార్డులు క్రమబద్ధీకరణ కాక అల్లాడుతున్నారు. మండలంలో సుమారు 5వేల ఎకరాలకుపైగా పట్టా భూములను 22ఏలో చేర్చారు. విచిత్రంగా ఒక గ్రామంలో రైతుకు ఉన్న భూమిని మరో గ్రామంలో 22ఏ భూమిగా నమోదు చేశారు. పాత రెవెన్యూ రికార్డులలో చూస్తే సంబంధిత రైతుకు 22ఏలో నమోదు చేసిన చోట భూమి రికార్డులో కనిపించదు. అప్పటి అధికారులు కళ్లు మూసుకొని ఇలాంటి అనేక తప్పులు చేశారు. ఆ రికార్డుల క్రమబద్ధీకరణకు సాంకేతికపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అనేక గ్రామాల్లో భూములు క్రమబద్ధీకరణకు నోచుకోవడంలేదు. రెవెన్యూ అధికారులు వాస్తవ పరిస్థితిని గుర్తించి లోతుగా పరిశీలించడం లేదు. పనులు చేస్తామని డబ్బులు తీసుకోవడం, సంవత్సరాల తరబడి తిప్పుకోవడం జరుగుతోంది. ఈ వ్యవహారం అంతా అధికారులకు కల్పవృక్షంగా మారింది. రూ.లక్షలు తీసుకుని సొంత అవసరాలకు ఏళ్ల తరబడి వాడుకుంటూ మభ్యపెడుతున్నారు. ఇటీవల రెండు గ్రామాలకు చెందిన రైతులు తమకు పనిచేయకుండా ఎంత కాలం తిప్పుకుంటారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తున్నట్లు సమాచారం. ఆ రైతులు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలో అనేక మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలన పూర్తి కావస్తున్నా నేటికీ రికార్డులు క్రమబద్ధీకరణకు నోచుకోలేదని వారు వాపోతున్నారు. త్వరలో ఎన్నికలు వస్తున్నందున ఇక ఈ పనులు జరిగే అవకాశం కనిపించడం లేదన్న భావనలో పలువురు రైతులు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

'కొంప'ముంచిన ఆప్కాస్..!

ఇళ్లస్థలాలకు అర్హత కోల్పోయిన

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

మొన్న భరోసా పత్రాలు ఇచ్చారు..

నేడు వీలుకాదన్నారు

పేదలుగా గుర్తించి తమకూ పట్టాలు

ఇవ్వాలంటున్న లబ్ధిదారులు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 25 : త్వరలోనే తమకు ఇంటి స్థలం వస్తుందని అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్)లో పనిచేసే వారంతా ఆశపడ్డారు. రెండేళ్ల క్రితం అందించిన భరోసా పత్రాలతో మురిసిపోయారు. సొంతింటి కలను సాకారం చేసుకోవచ్చని సంబరపడ్డారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాలు అందే సమయంలో ఆరు అంచెల ఆంక్షలు అడ్డంకిగా మారాయి. చాలీచాలని వేతనాలతో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారు నిబంధనల కారణంగా ప్రభుత్వం అందించే జగనన్న ఇళ్ల పథకానికి దూరమయ్యారు.

అర్హత కోల్పోయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఆప్కాస్‌లో పనిచేసే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతుండడంతో ఇప్పటికే వేలాది మంది అమ్మఒడి, రేషన్‌కార్డు, జగనన్న చేయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతర సంక్షేమ పథకాలను కోల్పోయారు. ఇప్పుడు నివేశన స్థలాలకూ దూరమయ్యారు. ఇప్పటికే భరోసా పత్రాలు పొందిన వారి జాబితాలను ప్రత్యేకంగా రూపొందించిన డీఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ పొందుపరిచారు. దీంతో ప్రభుత్వ కార్యాయాల్లో ఆప్కాస్ కింద పనిచేస్తూ సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు తీసుకుంటున్న సుమారు 2500 మంది వరకు అర్హత కోల్పోయారు. వీరిలో ఇతర శాఖల్లో పనిచేస్తున్న కొందరికి పట్టాలు వచ్చాయి. మరికొందరికి అర్హత లేదని నిరాకరించారు. నగర పాలక సంస్థలో ఆప్కాస్ కింద పనిచేస్తున్న వారిలో ఒక్కరికి కూడా ఇంటి పట్టా అందలేదు.

న్యాయం చేయాలి : లబ్ధిదారులు

ఆప్కాస్ ద్వారా ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో సుమారు 1,200 మంది వరకు పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇతర సెక్షన్లలో పనిచేస్తున్నారు. వారితోపాటు ఒంగోలులోని 34 ప్రభుత్వ కార్యాలయాల్లో మరో 3వేలమంది వరకు నిర్వహిస్తున్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, మరోవైపు భద్రత లేని ఉద్యోగాలు, ఇంకోవైపు పెరిగిన ధరలతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఆప్కాస్‌లో ఉన్నందుకు తమకు అన్ని విధాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు. ఆరు అంచెల విధానం నుంచి ఆప్కాస్ కింద పని చేసే ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి ఇళ్ల పట్టాలు అందించాలని కోరుతున్నారు.



తెలుగుదేశం పార్టీ గెలుపునకు
కృషి చేయాలి : దామచర్ల



ఓటర్లతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 25 : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ కోరారు. ఆదివారం నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో షేక్ ఇస్రాద్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ శ్రేణులు కూడా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయడం కోసం, ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి చేసే అవకాశాన్ని తనకు మరోసారి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మేయర్ తీరు మారాలి : జనసేన

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 25 : ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో మేయర్ గంగాడ సుజాత తీరు మారాలని 38వ డివిజన్ జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం జరిగిన పాలకవర్గ సమావేశంలో మేయర్ తీరును ఆయన ప్రశ్నించారు. విపక్ష కార్పొరేటర్ల వాదనలు పట్టించుకోకుండా, అడ్డదారుల్లో అజెండా అంశాలు ఆమోదించడం సరికాదన్నారు. అధికార పార్టీ నాయకులు, కార్పొరేటర్లకు అధికారులు తొత్తులుగా మారారని ఆయన విమర్శించారు. ప్రత్యేకించి జరిగిపోయిన పనులను ర్యాటిఫికేషన్ పేరుతో ఇపుడు అజెండా అంశంలో పొందుపరిచి, ఓ కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకు అటు అధికారులు, ఇటు అధికార పార్టీ నాయకులు కుమ్మక్కయ్యారని విమర్శించారు. అజెండా అంశాలపై జనసేన, టీడీపీ కార్పొరేటర్లు మాట్లాడుతుంటే ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుపడి, సభను గందరగోళానికి గురి చేసి, సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి, ఏకపక్షంగా ఆమోదించడాన్ని జనసేన ఖండిస్తుందని తెలిపారు.

పాటల పోటీల్లో జిల్లాకు బహుమతులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 25: ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో నిర్వహించిన జాతీయ స్థాయి సరిగమ పాటల పోటీలలో జిల్లాకు చెందిన గాయకులు బహుమతులు లభించాయి. మార్కాపురంకు చెందిన గాయిని, ప్రముఖ న్యాయవాది ఎ.ఝాన్సీరాణికి కన్సోలేషన్ బహుమతి లభించగా, ఒంగోలుకు చెందిన జిల్లా న్యాయస్థాన ఉద్యోగిని దావల ఉషారాణి ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారు. న్యాయనిర్ణేతలు భాగి నారాయణ శాస్త్రి, ఎం.రాజాబాబు, ముఖ్యఅతిథులు నాళం నరసమ్మ, ఐ.మురళీకృష్ణ చేతుల మీదుగా నిర్వాహకులు మర్రి కృష్ణారెడ్డి, వాకా కోటిరెడ్డిలు వారికి జ్ఞాపికలను అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బహుమతులను పొందిన వారిని పలువురు సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో అభినందించారు.

బాలోత్సవం విజయవంతంపై హర్షం



సభలో మాట్లాడుతున్న రామరాజు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 25: జిల్లాలో ఇటీవల జరిగిన ప్రకాశం బాలోత్సవం కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం అభినందనీయమని అమరావతి బాలోత్సవ కార్యదర్శి ఎంవీ.రామరాజు పేర్కొన్నారు. ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ప్రకాశం బాలోత్సవంలో పాల్గొన్న కార్యకర్తల అభినందనసభ కోశాధికారి ఎస్.రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 27 ప్రాంతాల్లో బాలోత్సవాలు జరగ్గా ప్రకాశం జిల్లాలో ప్రణాళికాబద్ధంగా తక్కువ రోజుల్లో విజయవంతంగా నిర్వహించారన్నారు. 47విభాగాల్లో 103 స్కూళ్ళ నుంచి 4500 మంది విద్యార్థులు, 250 మంది వలంటీర్లు, 100 మంది ఆర్గనైజర్లు, మరో 80 మంది జడ్జిస్‌తో విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈనెల 9,10వ తేదీల్లో పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రకాశం బాలోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్‌హై, జి.హరిబాబు, ఆర్.సురేష్, భాస్కర్, వినోద్, కేఏఫ్‌బాబు, బి.తిరుపతయ్య, డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, వైఎస్ఎన్.జ్యోతి, కె.జగదీశ్వరి, సంధ్యారాణి, నల్లూరి వెంకటేశ్వర్లు, చిన్నస్వామి, ఆర్.నారాయణ, సీహెచ్.ఉమామహేశ్వరరావు, జీవీ.శేషయ్య, ప్రభాకర్, కె.నరసింహారావు, సీహెచ్.లక్ష్మీనారాయణ, వైవీ.వెంకట్రావు, సాంబశివరావు, చంద్రశేఖర్, మాలకొండయ్య పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్నగాయకులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 25: శ్రీ కళాంజలి కళాపరిషత్ సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఒంగోలులో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, గాయకుడు ఆర్.వేణుమాస్టర్ ఆధ్వర్యంలో ముందుగా కళాకారులు ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పిశెట్టి రత్తయ్య, బొమ్మల వెంకటేశ్వర్లు, అన్నంరాజు రమేష్, ఎస్‌కే.వలి, సుబ్బారావు, డి.శివప్రసాద్, అన్నపూర్ణ, శైలజ తదితరులు సినీ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆర్‌వీ.రమేష్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, కీబోర్డుపై జెర్మియా, ప్యాడ్స్‌పై సురేష్, డ్రమ్స్ మోహన్, కంజరి గుర్రం కృష్ణ, తబలాపై శివప్రసాద్‌లు వాద్య సహకారాన్ని అందజేశారు.

నేడే ఉచిత కంటి వైద్య శిబిరం

టంగుటూరు, ఫిబ్రవరి 25 : రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ వారి ఉచిత కంటి వైద్య శిబిరం ఈనెల 26వ తేదీన టంగుటూరులో జరుగుతుందని ఫౌండేషన్ ప్రతినిధి రావూరి తిరుమల రాధాక్రిష్ణ చెప్పారు. ఆదివారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. వినీల 37వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరం టంగుటూరు చెల్లెమ్మతోటలోని బ్రహ్మంగారి గుడి ఆవరణలో ఉదయం 9గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. జిల్లా అంధత్వ నివారణా సంఘం సహకారంతో జరిగే శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారికి అద్దాలు అమర్చు(ఐఓఎల్) ఆపరేషన్ చేస్తారన్నారు. పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి కూడా వీరే ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. వచ్చే వారు తమ ఆధార్, ఓటరు, ఆరోగ్యశ్రీ కార్డుతో ఏవైనా రెండు ఐడీ ప్రూఫ్ జెరాక్సు కాపీలు తీసుకరావాలని రావూరి కోరారు.

టీడీపీతోనే మత్స్యకారుల అభ్యున్నతి

• ఎమ్మెల్యే స్వామి



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో మత్స్యకారుల అభ్యున్నతి టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చెప్పారు. పాకల పంచాయతీ పరిధి పోతయ్యగారి పట్టపుపాలెంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు వేటకు వెళ్లిగాని, ప్రమాదవశాత్తు గాని మరణిస్తే రూ.5లక్షలు చంద్రన్న భీమా అందజేశామని గుర్తుచేశారు. వైసీపీ వచ్చాక ఆ పథకాన్ని రద్దుచేసిందన్నారు. తమ ప్రభుత్వంలో 50 ఏళ్లకే మత్స్యకారులకు పింఛన్లు అందజేశామని చెప్పారు. అలాగే వేటనిషేధ సమయంలో తొలుత రూ.4వేలు భృతి ఇచ్చి ఆదుకుంది చంద్రబాబేనని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం రకాల రకాల కొర్రీలు పెట్టి భృతిని అందిరికీ అందకుండా చేశారని స్వామి దుయ్యబట్టారు. జీవో నెం.30 తీసుకొచ్చి మత్స్యకారులకు అందే సంక్షేమ పథకాలను రద్దుచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నైకు చెందిన కడలూరు బోట్లు అక్రమంగా తీరంలోకి చొరబడి ఇక్కడ మత్స్యసంపదను దోచుకెళ్తున్నా నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే కడలూరు బోట్లను నియంత్రిస్తామని స్వామి హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాలను వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో సైకిల్‌పై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, గాంధీచౌదరి, బత్తుల రాజగోపాల్‌రెడ్డి, మించల బ్రహ్మయ్య, వేల్పుల వెంకట్రావు, యస్థాని, సనావుల్లా, సుభాన్, జుమ్మ శంకర్ పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యం

• టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న విజయ్‌కుమార్, నాయకులు

చీమకుర్తి, ఫిబ్రవరి 25: రాష్ట్రానికి బంగారు భవిష్యత్ నారా చంద్రబాబునాయుడు సీఎం అయితేనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని చీమకుర్తి మున్సిపల్ పరిధిలోనని రచ్చమిట్ట, గరికమెట్టలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కు మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరించే కరపత్రాలను ఆయన ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. టీడీపీకి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు అందించే పథకాల గురించి వివరించారు. టీడీపీ-జనసేన కూటమిగా ఎన్నికలబరిలో ఉన్నాయని, అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం అభివృద్ధిలో శరవేగంగా ముందుకు వెళ్తుందన్నారు. కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న తనను దీవించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, ఆయినీడి సుబ్బారావు, ముప్పూరి చలమయ్య, కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, తాతినేని శ్రీరామ్, దరిమడుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌కు అభినందనలు

ఒంగోలు(రూరల్): సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన బీఎన్.విజయకుమార్‌కు పలువురు టీడీపీ నాయకులు అభినందించారు. ఆదివారం ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో ఎన్‌జీపాడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు విజయ్‌కుమార్‌ను కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, చేకూరుపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు, మారెళ్ల శ్రీనివాసరావు, నలమలపు అంకిరెడ్డి, బి.శ్రీనివాస్, సౌలు శ్యాంబాబు, పైడి నాగేశ్వరరావు, కామేపల్లి వెంకటసుబ్బయ్య, విజయ్, రాజబాబు, మణికంఠ, కరణం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

వైసీపీ పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం

పథకాలు రద్దు చేయడమే కాకుండా దాడులు • బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ ధ్వజం



ర్యాలీ నిర్వహిస్తున్న దేవానంద్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.దేవానంద్ ఆరోపించారు. దళితులకు ఉపయోగపడే పథకాలను రద్దు చేయడమే కాకుండా రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో ప్రతిరోజు దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఒంగోలు నగరం శ్రీరామ్‌కాలనీలో ఆదివారం ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన దళితుల రచ్చబండ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా దళితులను అడిగి సమస్యలతో పాటు వారు ఎదుర్కొంటున్న అవమానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో దేవానంద్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. దళితులపై హత్యలు, అత్యాచారాలు వేల సంఖ్యలో జరిగినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. దళిత, గిరిజనులకు ఉపయోగడాల్సిన ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర అభివృద్ధి చేసే బీజేపీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, నాయకులు తోగంటి శ్రీనివాస్, శెగ్గం శ్రీనివాస్, బొద్దులూరి ఆంజనేయులు, యోగయ్యయాదవ్, దామోదర్, పేముల మోజే, శివాజీ, కోటేశ్వరి, అజయ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీరామ్‌కాలనీలో ర్యాలీ నిర్వహించారు.

ఎస్ఎన్‌పాడులో మంచినీటి సమస్య పరిష్కరించాలి

టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 25: సంతనూతలపాడులో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కరించాలని టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు మందాడి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అయితే ఓ మండల నాయకుడి తీరుతో గ్రామంలోని సమస్యలు పరిష్కారానికి గురికావడం లేదని ఆరోపించారు. ఆదివారం స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంతనూతలపాడు ప్రజలకు అన్ని అందుబాటులో ఉన్నా అల్లుడునోట్లో శనిలాగా మండల నాయకుడు తయారయ్యాడన్నారు. గ్రామ ప్రజలకోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్తచెరువులో లక్షలు వెచ్చించి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుచేస్తే దానిలో ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులకు గురైతే పట్టించుకోకుండా అలాగే వదిలేశారని ఆరోపించారు. దీని వల్ల ప్రజలకు పరిశుభ్రమైన అందక రోగాల బారిన పడుతున్నా పట్టించుకోని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారన్నారు. గ్రామంలో నీటి లీకేజీ జరుగుతున్నా మరమ్మతులు కూడా చేయడం లేదని మండిపడ్డారు. మండలనాయకుడుదే పెత్తనం సాగుతోందని, ప్రజలందరూ గమనిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీభవనం నిర్మాణం ఇంతవరకు పూర్తిచేయకపోవడం, గ్రామాల్లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం, ప్రశ్నిస్తే మండలనాయకుడి బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రస్తుతం మండలం నియంత పరిపాలన సాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరికొద్దిరోజుల్లో టీడీపీ ప్రభుత్వం రానుందని, మండల నాయకుడి దోచుకుని దాచుకున్న దానిపై విచారణ తప్పనిసరిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.భాస్కరరావు, సీహెచ్.బోసు, సీహెచ్.సుబ్బారావు, ఆర్.సుబ్బారావు, ఎన్.మాధవి, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోరుతూ రాస్తారోకో

• 12మందిపై కేసు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ లక్ష్మణ్

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 25: బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఒంగోలు రిమ్స్ వద్ద ఆదివారం రాత్రి మృతుడి బంధువులు రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు-జరుగుమల్లి మార్గంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొడ్డు శశికుమార్(25) మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈక్రమలో శశికుమార్ మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలిస్తుండగా బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో రాస్తారోకోను మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బిళ్లా వసంతరావు ఆధ్వర్యంలో చేపట్టారు. దీంతో వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ రిమ్స్ వద్దకు చేరుకొని బాధిత కుటుంబంతో పాటు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమానులతో మాట్లాడారు. అనంతరం ఆందోళనకారులు నిరసన విరమించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించడంతో 12మంది ఆందోళనకారులపై కేసు నమోదు చేశారు. అలాగే మాలమహానాడు నేత వసంతరావు, కొండపి నాయకుడు బాలకోటయ్యలను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఉత్సాహంగా
రామనగర్ పాఠశాల వార్షికోత్సవం

చీమకుర్తి, ఫిబ్రవరి 25 : చీమకుర్తి పట్టణంలోని రామనగర్ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఉత్సాహంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డాక్టర్ జవహర్, ఎంఈవో శివాజీ, మారం వెంకారెడ్డి, కౌన్సిలర్ సోమా శేషాద్రి తదితరులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్న దాతలకు హెచ్ఎం అంబటి వీరారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ప్రైవేటు కళాశాలగా మంగమ్మ డిగ్రీ కళాశాల

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 25 : ఒంగోలులోని మంగమ్మ డిగ్రీ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రైవేటు కళాశాలగా అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ఆ కాలేజీ అకడమిక్ అడ్వయిజర్ గోరంట్ల చిన్నరామయ్య, ప్రిన్సిపాల్ రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు వీవీఅండ్ఎం ట్రస్ట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఎయిడెడ్ కళాశాలలుగా నిర్వహించగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం గుర్తింపుతో మంగమ్మ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ అనుమతితో పూర్తి బాధ్యతలు స్వీకరించి తామే సొంతంగా ఈ విద్యా సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు.

సీవీఎన్ క్లబ్ ఎన్నికల అధికారుల నియామకం



రికార్డులను అప్పగిస్తున్న క్లబ్ కార్యదర్శి

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 25: ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము అండ్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక కోసం ఎన్నికల అధికారుల నియామకం జరిగింది. ఆదివారం క్లబ్ ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సీనియర్ సభ్యులు తోట రామస్వామి, బేతంశెట్టి హరిబాబులను ఎన్నికల అధికారులుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి మొగలిపువ్వు సత్యనారాయణ (బాబు) మాట్లాడుతూ కరోనా కారణంగా నూతన కార్యవర్గ ఎన్నిక కొంత ఆలస్యమైందని, తమ హయాంలో క్లబ్ అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా క్లబ్ నిర్వహణ, అభివృద్ధిలో తమ కార్యవర్గానికి సహకరించిన సభ్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్లబ్ రికార్డులను ఆయన ఎన్నికల అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు తాతా శ్రీనివాసులు, కోశాధికారి రామిరెడ్డి నితిన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, బూచి వనమాలి, ఉన్నవ శేషుబాబు, ఏసుపోగు ఏసుదాసు, తిరుమలశెట్టి శ్రీరామమూర్తి, మేనేజర్ భవనం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ఒంటె వాహనం వితరణ



మాధవరావు దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 25: చీమకుర్తి తూర్పుపాలెంలోని శ్రీఅభయాంజనేయ స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు, శ్రీ అభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావు, అంజనీదేవి దంపతులు ఆదివారం ఒంటె వాహనాన్ని బహూకరించారు. స్వామి వారి ఉత్సవాలలో ఉపయోగించటానికి వీలుగా మద్దాలి వెంకటేశ్వర్లు, రాజమ్మ, పవన్‌కుమార్‌ల జ్ఞాపకార్థం వాహనాన్ని అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇలపావులూరి శేషశ్రీధర్, లక్ష్మీప్రసన్నలు వాహనానికి అభిషేకం, అష్టోత్తర పూజ నిర్వహించారు. డాక్టర్ మాధవరావు షష్టి పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎన్నో సంవత్సరాల నుంచి తమ దేవస్థానంలో ప్రధాన అర్చకునిగా పూజలు నిర్వహిస్తున్న మాధవరావు దేవస్థానానికి వాహనాన్ని బహూకరించటం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుద్దంటి అలివేలుమంగమ్మ, పల్లళ వెంకటేశ్వర్లు, పుత్తూరి ఆంజనేయులు, పరాల కోటయ్య, శ్రీను, వరలక్ష్మమ్మ, భువనగిరి వెంకాయమ్మ పాల్గొన్నారు.

బ్రిటీష్‌పాలనను తలపిస్తున్న కేంద్ర ప్రభుత్వ పాలన



ధర్నా నిర్వహిస్తున్న జేఏసీ ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 25 : బ్రిటీష్ పాలనను తలపించే విధంగా కేంద్ర ప్రభుత్వ పాలన ఉందని ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదివారం ఒంగోలు నగరం గాంధీనగర్ వద్ద ఉన్న మూడు బొమ్మల సెంటర్ వద్ద దళిత బహుజన జేఏసీ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. దేశంలో ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, ఆకలిచావులు, మత దాడులు జరుగుతున్నా ఏ ఒక్క పార్లమెంట్ సభ్యుడు మాట్లాడకపోవడం దారుణంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పథకాలు అమలు చేయకపోవడంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు మతపరమైన వివక్షను ప్రోత్సహిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో దళిత బహుజనులు, మైనార్టీలు మతతత్వ నాయకులకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కట్టా వరప్రసాద్, దాసరి అంకన్న, సుబ్బారావు, సంగీతరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 25: ఎన్నికల ప్రక్రియను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించాలని నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి.వీరభద్రాచారి కోరారు. ఒంగోలులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల అక్రమాలను గుర్తించి కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘానికి తనకు ఉన్న విస్తృత అధికారులను వినియోగించి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే నూతన సంస్కరణలు ప్రవేశపెట్టి రాజకీయ పార్టీలు, వ్యక్తుల మూకుమ్మడి స్వార్థ పూరిత చర్యలను అరికట్టాలని చెప్పారు. మేనిఫెస్టోల విడుదలలో ప్రజలను మభ్యపెట్టే తీరు, ఓటర్లను ప్రలోభపెట్టే తీరును గమనించి కట్టడి చేయాలని కోరారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రానున్న ఎన్నికలలో ఓటు హక్కు బాధ్యతలపై చైతన్య కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రకాష్, ప్రసాద్, అమన్, ప్రభాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరవది స్కూలుకు రూ. 4లక్షల విరాళం



సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 25: ఒంగోలు మండలం కరవది పీఆర్‌ఆర్ జడ్పీ హైస్కూల్ పూర్వవిద్యార్థుల సమావేశం ఆదివారం స్వభవం లక్ష్మీకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో వంటగది, సైకిల్‌స్టాండ్, ప్రహరీ నిర్మాణం, గేటు మొదలగు పనులకు రూ.4లక్షల విరాళం పూర్వవిద్యార్థులు ప్రకటించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కాగా స్కూలు ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి25: ఒంగోలు నగరంలో మరమ్మతుల రిత్యా కొన్ని ప్రాంతాలలో సోమవారం కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈ జి.వినయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. అందువల్ల స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి టెంపుల్, నారాయణజూనియర్ కాలేజీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ పుస్తకావిష్కరణ

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 25: పద్యకవి చదలవాడ లక్ష్మీనరసింహారావు రచించిన ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ పుస్తకావిష్కరణ ఆదివారం ఒంగోలులోని బ్రాహ్మణ సేవా సమితి భవనంలో జరిగింది. పద్య సారస్వత పరిషత్ జిల్లా అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో జీవీ.సుబ్బారెడ్డి పుస్తకావిష్కరణ చేయగా ప్రముఖ అవధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ పుస్తక సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, తేళ్ల అరుణ, పొన్నూరి వేంకటశ్రీనివాసులు, సాహిత్యవేత్తలు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

తూమాడు(టంగుటూరు) ఫిబ్రవరి 25 : జరుగుమల్లి మండలం తూమాడులో ఆదివారం మాలె వెంకటక్రిష్ణారెడ్డి పొగాకు బ్యారన్ దగ్ధమైంది. బ్యారన్‌లో కర్ర జారి గొట్టంపై పడడంతో ఈప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలో పొగాకు అంతా కాలిపోయింది. సమాచారమివ్వడంతో టంగుటూరు ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసింది. దీనిపై కేసు నమోదైంది. ఈప్రమాదంలో రూ.5లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని బాధితులు చెబుతున్నారు.

రేపు పాకలలో సీనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక

చినగంజాం, ఫిబ్రవరి 25 : సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టు ఎంపిక కోసం వచ్చే క్రీడాకారుల బరువు 85 కేజీల లోపు ఉండాలని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో ప్రకాశం జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర కబడ్డీ జట్టు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మహారాష్ట్రలో మార్చి 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే సీనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలలో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9848606573, 6301015775 సెల్ నంబర్లను సంప్రదించాలని పుల్లయ్య కోరారు.

శింగరకొండ తిరునాళ్లలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

అద్దంకి, ఫిబ్రవరి 25 : శింగరకొండ వార్షిక తిరునాళ్లలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రూ.50లక్షలతో అవసరమైన అన్ని ముందస్తు చర్యలను విద్యుత్ శాఖ అధికారులు చేపట్టారు. నామ్ రోడ్డు వద్ద ఉన్న 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పాత విద్యుత్ స్తంభాల స్థానంలో ఎత్తైన కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు బిగించే పనులను ఈఈ నల్లూరి మస్తానరావు ఆదివారం ప్రారంభించారు. దేవాలయం సమీపంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈఈ తెలిపారు. డీఈఈ సత్యనారాయణ, ఏఈ శివప్రసాద్, సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండరు లీకేజీతో మంటలు



టిఫిన్ సెంటరులో లేచిన మంటలు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 25: పెద్దదోర్నాలలోని నాయక్ టిఫిన్ సెంటరులో ప్రమాదవ శాత్తు గ్యాస్ సిలిండరు లీకేజీతో అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఆదివారం ఉదయం టిఫిన్ తయారు చేస్తుండగా అనుకోకుండా గ్యాస్ లీకేజీతో మంటలు వ్యాపించాయి. ప్రక్కనే నూనె బాణలికి తాకి మంటలు పెద్దగా లేచాయి. దీంతో అందరూ బయటకు పరుగుతీశారు .అప్రమత్తమయిన హోటల్ నిర్వాహకుడు రామావత్ కృష్ణానాయక్ వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి విలియం ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.20వేలు నగదు, రూ.15 వేల విలువైన వంటసామగ్రి కాలిపోయిందని బాధితుడు తెలిపాడు.

విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకే మద్దతు

● జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి



మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

గిద్దలూరు, ఫిబ్రవరి 25 : ప్రస్తుతం ఉన్న పరిస్థితుల ప్రకారం తమకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకే మద్దతు తెలుపనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అన్నారు. గిద్దలూరులోని అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం స్థానిక విశ్వబ్రాహ్మణుల సేవాసంఘం అధ్యక్షుడిగా ఎం.వీరభద్రాచారి, ఇతర కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులందరూ ఐక్యతతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని అభివృద్ధి దిశగా పయనించాలని కోరారు. త్వరలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా జనాభా దామాషా ప్రకారం విశ్వబ్రాహ్మణులకు టికెట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది విశ్వబ్రాహ్మణులు ఉన్నారని, రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకే మద్దతు తెలుపాలన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజని మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన సాంప్రదాయ చేతివృత్తుల వారికి రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమా వేశంలో విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఎస్.శ్రీనివాసులు. కె.సీతారామాంజనేయులు, పి.బ్రహ్మానందం, కె.చంద్రశేఖరచారి, కె.కోటిలింగాచారి పాల్గొన్నారు.

రక్షణ పరికరాలను వినియోగించుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 25 : మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందజేస్తున్న సముద్ర రక్షణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని పల్లెపాలెం గ్రామ సర్పంచ్ సైకం మణి అన్నారు. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం రామాలయం ఆవరణలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా సముద్ర రక్షణ పరిరకాలను ఆదివారం ఆమె మత్స్యకారులకు పంపిణీ చేశారు. పల్లెపాలెం పంచాయతీ పరిధిలోని 12 మంది బోటు యాజమానులకు ఒక్కొక్కరికి రెండు లైఫ్‌జాకెట్లను 75 శాతం రాయితీతో అందజేసినట్లు గ్రామ ఫిషరీ అసిస్టెంట్ ఎన్.పుల్లారావు తెలిపారు. లైఫ్ జాకెట్లు, జీపీఎస్ హ్యాండ్ సెట్‌లను సముద్రంలో వేటకు వెళ్ళినప్పుడు వినియోగించుకోవాలని సూచించారు. వీటి ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు.

చెవిరెడ్డికి గిద్దలూరు షాక్!

అక్కడ బాలినేని అనుచరుల అసంతృప్తి ● మీరే సరిచేసుకోవాన్న మాజీ మంత్రి ..

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వైసీపీ నుంచి ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా రంగంలోకి రాబోతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి గిద్దలూరు పార్టీలోని విభేదాల షాక్ తీవ్రంగానే తగిలింది. దానిపై ఆదివారమంతా ఆ నియోజకవర్గ వైసీపీ నేతలు బాలినేనితోపాటు ఎమ్మెల్యే అభ్యర్థి నాగార్జునరెడ్డి, చెవిరెడ్డితో పలు దఫాలు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. ప్రధానంగా నియోజకవర్గంలోని బాలినేని అనుచరులు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి వ్యవహార శైలిపై అసంతృప్తిని వెళ్లగక్కారు. దీంతో చెవిరెడ్డి జోక్యం చేసుకోగా, బాలినేని కూడా ఆ సమస్యను మీరే పరిష్కరించుకోండి తనకు సంబంధం లేదని కటువుగా సమాధానం చెప్పినట్లు తెలిసింది. మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలను పరస్పరం మార్పు చేసి రాంబాబును మార్కాపురం, గిద్దలూరుకు నాగార్జునరెడ్డిలను పంపిన విషయం తెలిసిందే. నాగార్జునరెడ్డి గిద్దలూరులోనే కాపురం పెట్టి ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నారు. ఆయన కుటుంబీకులంతా అక్కడే తిష్ఠ వేసి వ్యవహారాలు నడుపుతున్నారు. ఆయన ఇంతవరకు బాలినేనిని కలవలేదని తెలిసింది. గిద్దలూరు నియోజకవర్గంలోని బాలినేని అనుచరుల వద్దకు నాగార్జునరెడ్డి వెళ్లినప్పుడు వారు 'మీరు బాలినేనిని ఎందుకు కలవలేదు' అని అడిగినట్లు తెలిసింది. దీనిపై నాగార్జునరెడ్డి ఇచ్చిన సమాధానంతో వారు సంతృప్తి చెందలేదు. అంతేగాక బాలినేనికి ఫోన్ చేసి నాగార్జునరెడ్డి వ్యవహార శైలిపై వారు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ వెంటనే వారు చెవిరెడ్డికి కూడా ఫోన్ చేశారు.

గతంలోనే బాలినేని విషయంలో సమన్వయం చేయాలని చెవిరెడ్డికి నాగార్జున చెప్పినట్లు తెలిసింది. ఇదే విషయమై తాజాగా చెవిరెడ్డి బాలినేనితో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. ఇద్దరి మధ్య వాడీవాడిగా చర్చ జరిగినట్లు తెలిసింది. ఎవరు ఎవరకు ముందుగా ఫోన్ చేశారో తెలియదు కానీ.. 'ఆ సమస్యను మీరే పరిష్కరించుకోండి. నా అవసరం లేదన్నట్లు మీరు, అలాగే నాగార్జునరెడ్డి వ్యవహరిస్తున్నారు. నా ఒంగోలు నేను చూసుకుంటా.. గిద్దలూరులో మీ తంటాలు మీరే పడండి' అంటూ బాలినేని సీరియస్‌గా చెప్పి ఫోన్ పెట్టేసినట్లు తెలిసింది. దీంతో షాక్‌కు గురైన చెవిరెడ్డి ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు గిద్దలూరులోని అటు ద్వితీయ శ్రేణి నాయకులు, ఇటు నాగార్జునరెడ్డితో మాట్లాడుతున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో పరిస్థితులు కుదుట పడకపోవడంతో నాగార్జునరెడ్డి మరింత ఆవేదనతో 'మీరే సమస్యకు పరిష్కారం చూపాలని' చెవిరెడ్డిపైనే భారం వేసినట్లు తెలిసింది. దీంతో చెవిరెడ్డి ఆరంభంలోనే ఇలా ఉంది. ముస్ముందు ఎన్ని సమస్యలు ఎదురవుతాయోనంటూ ముఖ్య నేతల వద్ద వాపోయినట్లు సమాచారం.

దళితుడంటే అంత చులకనా..?

తనకు కనీస మర్యాద ఇవ్వడం లేదని వైసీపీకి చెందిన కనిగిరి ఏఎంసీ చైర్మన్ ఆవేదన ● సొంత పార్టీ నేతల తీరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న చైర్మన్ సాల్మన్‌రాజు

కనిగిరి, ఫిబ్రవరి 25: 'దళితులను కొంత మంది వైసీపీ నేతలు చులకనగా చూస్తున్నారు. నేను ఏఎంసీ చైర్మన్ కావడం వారికి మింగుడు పడటం లేదు. నాకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. ప్రొటోకాల్ కూడా అమలు చేయకుండా అడ్డుపడుతున్నారు' అని కనిగిరి ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్‌రాజు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి దళితులకు పెద్దపీట వేస్తున్నామని చెప్తుండగా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నదన్నారు. తనను కిందకు గుంజాలని వైసీపీలోని కొంతమంది వ్యక్తులు చూస్తున్నారన్నారు. తన సామాజిక వర్గాన్ని గుర్తించిన ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ తనను ఏఎంసీ చైర్మన్‌గా ఎంపిక చేశారన్నారు. తానెప్పుడూ ఆయనకు విధేయుడిగానే ఉంటానన్నారు. త్వరలోనే వైసీపీలో తనను చులకనగా చూసే నాయకుల పేర్లు బహిర్గతం చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే వైసీపీలో ఎమ్మెల్యే బుర్రా అనుచరవర్గాన్ని పక్కన పెడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో సాల్మన్‌రాజు వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఏఎంసీ చైర్మన్ విలేకరుల సమావేశం నిర్వహిస్తున్నారన్న సమాచారాన్ని వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణకు కొందరు ఇచ్చారు. సాల్మన్‌రాజు రాజీనామా చేస్తున్నారని కూడా వారు తెలిపారు. దీంతో దద్దాల అప్రమత్తమయ్యారు. జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డిని, ఇన్‌చార్జి సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులను ఏఎంసీ చైర్మన్ చాంబర్‌కు వెళ్లాలని పురమాయించారు. దీంతో మీడియా సమావేశం జరుగుతుండగానే వాళ్లంతా అక్కడకు చేరుకున్నారు. జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి కుర్చీలో కూర్చొని ఉన్న ఏఎంసీ చైర్మన్‌ను బలవంతంగా పైకిలేపి ఒక్కసారిగా హత్తుకున్నారు. అనంతరం కొద్దిసేపు అక్కడ హైడ్రామా నడిచింది. ఇంతలో పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ అక్కడకు చేరుకున్నారు. హడావుడిగా చైర్మన్ పక్కన సీటు వేయించుకుని తన అనుచరులతో ఫొటోలు దిగి ఏఎంసీ చైర్మన్‌ను పొగడ్తలతో ముంచెత్తి మెడలో పూలమాల వేశారు. కనిగిరి వైసీపీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది.

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల పరిశీలన

● ఒంగోలులో ఎస్పీ తనిఖీ



ఒంగోలులోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి బయటకు వస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి



తనిఖీలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ భవానీశంకర్, ఎస్సై శ్రీరామ్

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 25: ఒంగోలులోని గ్రూపు-2 పరీక్షా కేంద్రాలను ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలోని పరీక్షా కేంద్రాలు క్విజ్, రైజ్, నాగార్జున, ఏకేవీకే, ఎస్ఎస్ఎన్ కాలేజీలను ఎస్పీ స్వయంగా పరిశీలించి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 49 కేంద్రాలలో గ్రూపు-2 పరీక్షలు జరుగుతున్నాయని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ రాఘవేంద్రరావు, డీసీఆర్‌బీ సీఐ భీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. చీమకుర్తి పట్టణంలోని బీటీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 550మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

749 మంది హాజరు

సింగరాయకొండ : మండలంలో మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, పీఎన్‌సీపీ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూపు-2 స్ర్కీనింగ్ పరీక్షా ప్రశాంతంగా ముగిసింది. మలినేని సుశీలమ్మ మహిళా కళాశాలలో 500 అభ్యర్థులకు గానూ 426 మంది పరీక్షలకు హాజరుకాగా 74 మంది గైర్హాజరయ్యారు. పీఎన్‌సీపీ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో 400 విద్యార్థులకుగానూ 323 మంది పరీక్ష రాశారు. 77 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ భవానీశంకర్, ఎస్సై శ్రీరామ్ పరిశీలించారు.

సీనియర్ నేత మన్నే రవీంద్రను కలిసిన ఎరిక్షన్‌బాబు



రవీంద్ర, ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 25 : ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం రాత్రి సీనియర్ నాయకులు జడ్పీమాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అధిష్ఠానం తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ప్రకటించడంతో ఎరిక్షన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. మీరే లేఖ ఇచ్చి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా, బాధ్యతలు ఇప్పించారని, మీ ఆశీస్సులు ఉండాలని అభ్యర్థి ఎరిక్షన్‌బాబు రవీంద్రకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయాన్ని గౌరవిస్తానని, ఎర్రగొండపాలెంలో టీడీపీ విజయం కోసం కృషి చేస్తానని డాక్టరు మన్నె రవీంద్ర టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు తెలిపారు. రవీంద్రకు, ఎరిక్షన్‌బాబుకు కలిపి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇద్దరు నాయకులు కలసి పోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. డాక్టరు రవీంద్రను కలసిన వారిలో నియోజకవర్గ పరిశీలకులు వేములకొండ శ్రీనివాసరావు, చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాదు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు పాలడుగు వెంకటకోటయ్య, నాయకులు వేగినాటి శ్రీను, జాగర్లమూడిగాలెయ్య, మాదాల శేషయ్య, కొత్త భాస్కర్, తోట ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో ఘనంగా ప్రింటర్స్ డే

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 25: ప్రింటింగ్ పితామహుడు జోహెన్నస్ గూటెన్ బర్గ్ జయంతిని పురస్కరించుకుని ప్రింటర్స్‌డేను ఆదివారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కొణతం నెల్సన్‌రాజు అధ్యక్షత వహించారు. స్థానిక ఊరచెరువు వద్ద గల గూటెన్‌బర్గ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకముందు నగరంలో ప్రింటర్స్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వల్లూరమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రింటింగ్ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన తండ్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, తాను అండగా ఉంటారని తెలిపారు. ఇళ్ల పట్టాలు మంజూరుకు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలకు తమ వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. అధ్యక్షుడు నెల్సన్‌రాజు మాట్లాడుతూ ప్రింటింగ్ రంగంపై ఆధారపడి వెయ్యికి పైగా కార్మికులు ఉన్నారని తెలిపారు. కార్మికుల వివాహ కార్యక్రమాలు, ఇతర శుభ కార్యక్రమాలకు ప్రింటర్స్ భవనం నిర్మాణం అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యక్షులు యామిని కృష్ణ, భగవాన్ పిచ్చయ్య, పలువురు ప్రింటర్స్ బైండర్స్ పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర కలశస్నపన



ప్రత్యేక హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 25 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామికి 108 కలశాలతో అభిషేకం(అష్టోత్తర కలశ స్నపన) వైభవంగా నిర్వహించారు. అనంతరం విశిష్ట హోమాలు చేశారు. శ్రీదేవి, భూదేవి, వరాహ లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేక పూలతో అలంకరించారు. దేవస్థానంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడికు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

విద్యాధికుడిని పోటీలోకి ఉంచుతాం



పార్టీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కొండపి, ఫిబ్రవరి 25 : రిటైర్డు ఐఏఎస్ అధికారి జీఎస్ ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ ఏర్పాటు చేసిన లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి కొండపి అసెంబ్లీ స్థానానికి విద్యాధికుడిని పోటీలోకి దించుతామని ఆ పార్టీ నాయకురాలు విజయశ్రీ చెప్పారు. ఆదివారం కొండపిలో పార్టీ నియోజకవర్గ ప్రతినిధి బుద్ధకోటి అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయ దోపిడీ నుంచి పేదలను రక్షించడానికి దోపిడీ పార్టీల నుంచి నాయకులు బయటకు రావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు శివరాం, చైతన్యప్రసాద్, మస్తాన్‌రావు, నాగభూషణం పాల్గొన్నారు. అనంతరం పార్టీ బ్రోచర్లను విడుదల చేశారు.

చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఆకస్మిక బదిలీ

చీరాలటౌన్, ఫిబ్రవరి 25 : చీరాల డీఎస్పీ ప్రసాదరావును ఆకస్మికంగా బదిలీ చేస్తూ శనివారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో బేతపూడి ప్రసాద్‌ను నియమించారు. ఆయన సోమ లేక మంగళ వారాల్లో విధులు చేపట్టనున్నారు. ఎన్నికల నేపథ్యంలో కొద్ది నెలల క్రితమే ప్రసాదరావు చీరాలకు బదిలీపై వచ్చారు. ఈక్రమంలో సంబంధిత విధులలో నిమగ్నమవుతుండగా ఊహించని విధంగా బదిలీ వేటు పడింది. అయితే ప్రసాదరావు స్థాన చలనం రాజకీయంగానే జరిగిందని పట్టణంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అయితే బేతపూడి ప్రసాద్ గతంలో చీరాల పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి సమయస్ఫూర్తిగా వ్యవహరించి మన్ననలు పొందారు. నియోజకవర్గంపై ఆయనకు అవగాహన ఉంది. దీంతో ఎన్నికల బాధ్యతలు సమర్థవంతంగానే నిర్వహిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

పార్కింగ్ చేసిన ఆటో చోరీ

మార్టూరు, ఫిబ్రవరి 25: మార్టూరు నాల్గో గ్రామ సచివాలయం వద్ద పార్కింగ్ చేసి ఉన్న ఆటోను గుర్తుతెలియనివ్యక్తులు శనివారం వేకువ జామున అపహరించుకుపోయారు. స్థానికంగా సంపత్ నగర్‌లో నివాసం ఉంటున్న గోపి అనే వ్యక్తి తన ఆటోను రోజూ రాత్రి సమయంలో ఈ సచివాలయం వద్ద పార్కింగ్ చేస్తుంటాడు. దాంతో ఈ విషయాన్ని గమనించిన కొంతమంది వ్యక్తులు వేకువ జామున సమయంలో ఆటోను ఎత్తుకు పోయారు. ఉదయాన్నే ఆటో కనిపించకపోవడంతోగోపి మార్టూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు సచివాలయం సమీపంలోని ఒక పెట్రోలు బంకు వద్ద ఉన్న సీసీ పుటేజీని పరిశీలించగా ఒక వ్యక్తి తన ఆటోకు ఈ ఆటోను తాడుతో కట్టుకొని తీసుకువెళ్లినట్లు కనిపించింది. ఆటో విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని గోపి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరునాళ్లలో షాపులకు 5న బహిరంగ వేలం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25: శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా షాపులు పెట్టుకుని వ్యాపారాలు చేసుకునేందుకుగాను బహిరంగ వేలం మార్చి 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు శింగరకొండపాలెంలోని సచివాలయ ఆవరణంలో జరుగుతుందని పంచాయతీ సెక్రటరీ ఎన్. మస్తాన్‌వలి ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తేదీన జరగాల్సిన వేలం అధికారుల ఆదేశాల మేరకు 5వ తేదీకి మార్పుచేశామని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.





ఒంగోలులోని క్విజ్ కాలేజీలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు, పరీక్షకు వెళ్లేందుకు తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది



చంటిబిడ్డతో పరీక్ష రాసేందుకు వచ్చిన తల్లి

అభ్యర్థులకు 'పరీక్ష' !

ఒంగోలులో గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరగాయి. ఆయా కేంద్రాలకు పరీక్షలు రాసేందుకు భారీగా అభ్యర్థులు చేరుకోవడంతో సందడి నెలకొంది. కొంతమంది తమ చిన్నారులతో రావడంతో వారి కుటుంబసభ్యులు ఆరుబయట లాలిస్తూ కన్పించారు. మరికొందరు పరీక్ష సమయానికి పరుగులు తీస్తూ హాజరుగాక, మరొకరు ఆలస్యంగా రావడంతో గేటు బయటే ఉండాల్సి వచ్చింది. పోలీసులు అభ్యర్థులకు మార్గనిర్దేశం చేయగా, భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టారు.

- ఒంగోలు



చివరి నిమిషంలో పరుగు..



పిల్లలను లాలిస్తూ..



సమయం దాటి పోవడంతో..





ఆల్ ది బెస్ట్ చెబుతున్న కుటుంబసభ్యులు



అభ్యర్థుల సెల్‌ఫోన్లు

ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి
- నియోజకవర్గంలో నేతలతో గిద్దలూరులో సమావేశం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 25 : రానున్న సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులను ఉద్దేశించి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆదే శించిన ప్రతి కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయ వంతంగా పూర్తి చేయాలని, మరో 50 రోజుల్లో ఎన్నికలు రానున్న దృష్ట్యా గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేయనున్నట్లు తెలిపారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా, అవాక్కులు, చవాక్కులు పేల్చినా టీడీపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానన్నారు. ఈ నెల 27వ తేది మంగళవారం పట్టణంలోని షాదీఖానాలో నియోజక వర్గస్థాయి ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. ముస్లిం మైనారిటీలు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 2, 3 తేదీలలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, గిద్దలూరు రానున్నారన్నారు. నియోజకవర్గంలోని తెలుగు దేశం, జనసేన కుటుంబసభ్యులతో ఆయన సమావేశ మవుతారన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే టీడీపీ, జనసేనల ఉమ్మడి మానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచక పాలనను, దోపిడిని ప్రజలు తెలుసుకున్నారని, రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం టీడీపీ, జనసేనల ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తక్ అహమ్మద్, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, కాపు నాయకులు దుత్తా బాలీశ్వరయ్య మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలెండరు లీకేజితో మంటలు



టిఫిన్ సెంటరులో ఏర్పడ్డ మంటలు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 25: స్థానిక నాయక్ టిఫిన్ సెంటరులో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలెండరు లీకేజితో అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఆదివారం ఉదయం టిఫిన్ తయారు చేస్తుండగా అనుకోకుండా గ్యాస్ లీకేజితో మంటలు వ్యాపించాయి. ప్రక్కనే నూనె బాణలికి తాకి మంటలు పెద్దగా లేచాయి. దీంతో అందరూ బయటకు పరుగుతీశారు .అప్రమత్తమయిన హోటల్ నిర్వాహకుడు రామావత్ కృష్ణానాయక్ వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి విలియం ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.20వేలు నగదు, రూ.15 వేల విలువైన వంటసామాగ్రి కాలిపోయిందని బాధితుడు తెలిపాడు.

దడ పుట్టించిన ఫ్లెక్సీ



తీగలపై పడ్డ ఫ్లెక్సీ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25: మార్కాపురం పట్టణంలోని కంభం కూడలిలో ఒక భారీ ఫ్లెక్సీ తీగలపై పడింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రాకపోకలకు అంతరాయం కలగడంతో కరెంట్ తీగలు తెగి ఎక్కడ ప్రజల మీద ఎక్కడ పడతాయోనని భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికంగా ఉండే ఒక వ్యక్తి బస్సును ఆపి దానిపై ఎక్కి వేలాడుతున్న ఆ ఫ్లెక్సీని తొలగించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కంభం కూడలిలో కరెంట్ పోల్‌కు ఇరువైపులా రాజకీయ పక్షాల నేతలు ఫ్లెక్సీలు కట్టారు. ఇవి ప్రమాదకరంగా మారాయి. ఎదరెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పట్టణంలో విచ్చలవిడిగా వేసిన ఫ్లెక్సీలను తీసివేయడంలో మున్సిపల్, పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు.



కంభం కూడలిలో కట్టిన ఫ్లెక్సీలు

ఘంటసాలకు ఘనంగా నివాళి



బహుమతులు అందిస్తున్న దాతలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25: త్రివిక్రమ అభ్యుదయ కళా సేవా సంఘం ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతి స్థానిక రీడింగ్‌రూంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి నివాళుల ర్పించారు. వివిధ పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, డాక్టర్ పద్మజలు బహుమతులు అందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పురాణం సుబ్రహ్మణ్యం, చిత్తారి రంగనాయకులు, శైలజ, ఆర్.వెంకటేశ్వర్లు పాటలు పాడారు.

చంద్రబాబును కలిసిన ఎంఎస్‌పీఎస్ నేతలు



చంద్రబాబును కలిసిన జాబిర్ హుస్సేన్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి మార్కాపురం శాఖ అధ్యక్షులు మొగల జాబీర్ హుస్సేన్ బేగ్ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఫారుక్ షిబిలీ ఆధ్వర్యంలో మాజీ సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా వారు మైనార్టీల హక్కులతో కూడిన మెమొరండం అందజేశారు. తమ సంఘం రానున్న ఎన్నికలలో టీడీపీకి పూర్తి మద్దతుగా ఉండాలని తీర్మానం చేసిందన్నారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబునాయుడు, టీడీపీ మైనార్టీ నాయకులకు అండగా ఉంటుందన్నారు.

ప్రాధాన్యం ఇచ్చిన పార్టీలకే మద్దతు

- విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి



మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

గిద్దలూరు, ఫిబ్రవరి 25 : ప్రస్తుతం ఉన్న పరిస్థితుల ప్రకారం తమకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకే మద్దతు తెలుపనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లాశాఖ అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అన్నారు. స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో స్థానిక విశ్వబ్రాహ్మణుల సేవాసంఘం అధ్యక్షుడిగా ఎం.వీరభద్రాచారి, ఇతర కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులందరూ ఐక్యతతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని అభివృద్ధి దిశగా పయనించాలని కోరారు. త్వరలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా జనాభా దామాషా ప్రకారం విశ్వబ్రాహ్మణులకు టికెట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది విశ్వబ్రాహ్మణులు ఉన్నారని, రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలకే మద్దతు తెలుపాలన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజని మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన సాంప్రదాయ చేతివృత్తుల వారికి రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఎస్.శ్రీనివాసులు. కె.సీతారామాంజనేయులు, పి.బ్రహ్మానందం, కె.చంద్రశేఖరచారి, కె.కోటిలింగాచారి పాల్గొన్నారు.

వర్గీకరణ బాధ్యత బీజేపీపై ఉంది

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25: ఎస్సీ వర్గీకరణ బాధ్యత బీజేపీపై ఉందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు ఉసులపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కమిటీల పేరు మీద కాలయాపన చేస్తూ, మాదిగల భవిష్యత్తు అంధకారం చేస్తోందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణ విషయంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఏపీలో ఎస్సీ నియోజకవర్గాల్లో మాలమాదిగలకు సమానంగా సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు షాలేంరాజు, ఎం.పీటర్ మాదిగ, ఎస్.జయరాజు మాదిగ, దారివేముల విజయ్ మాదిగ, మణి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ ఎర్రగొండపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ఆ పార్టీలో పలు కుటుంబాల చేరిక



టీడీపీలో చేరిన కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 25: విజన్ ఉన్న ప్రజా నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని ఐనముక్కల గ్రామానికి చెందిన ఎస్సీకాలనీకి చెందిన 26 కుటుంబాలు గూడూరి ఎరిక్షన్‌బాబు సమక్షంలో ఆదివారం సాయంత్రం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా గూడూరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం రాష్ట్రం ఎంతో లోటు బడ్జెట్‌లో ఉందన్నారు. అయినా, దార్శ నికతతో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా సంక్షేమం, అభివృద్ధిని ఏకధాటిగా ముందుకు తీసుకుపోయారన్నారు. అయితే ఒక్కచాన్స్ అంటూ జగన్ మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గానికి మేలు జరగలేదన్నారు. కనీసం గ్రామాల్లో గుక్కెడు నీళ్లు ఇవ్వలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. సామాన్యుడు బతకలేని విధంగా నిత్యావసర సరుకులు, ఆర్‌టీసీ బస్సుచార్జీలు, కరెంటు చార్జీలు, పెట్రోలు, డీజిలు, ధరలు విపరీతంగా పెంచారన్నారు. ఇప్పటికీ ఇసుక కొనలేని పరిస్థితి ఉందన్నారు. పేదలకు ఉపయోగపడే చంద్రన్నబీమా, పెండ్లికానుక, పండుగ కానుకలు, నిరుద్యోగుల భృతి వంటి బృహత్తర పథకాలు రద్దు చేశారన్నారు. రైతులకు ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, డ్రిప్ పథకం, ప్రకృతి విపత్తుల నష్టపరిహారం, పంటబీమా పథకాలను వైసీపీ రద్దు చేసింద న్నారు. మరికొద్ది రోజుల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని అన్ని పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. అంతేకాదు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని, మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించ నున్నట్లు చెప్పారు. మహిళలకు ఆర్‌టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు అందజేత, నెల నెలా ప్రతి మహిళకు రూ.1500లు, ఏటా రూ.15000లు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు మంజూరు చేసి ఆర్థిక తోడ్పాటునివ్వనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా శ్రమిస్తానని ప్రజలు ఆదరించి సైకిలు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య దేసు నాగేంద్రబాబు, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ ఇస్మాయిల్, భాష, ఎలకపాటి చంచయ్య, సీనియర్ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, ఆర్ సుబ్బరత్నం, టీ చెన్నారెడ్డి, షేక్ మంజూర్ భాష పాల్గొన్నారు.

నరసింహస్వామి అలంకరణలో వేణుగోపాలుడు



విశేష అలంకరణలో స్వామివారు

తర్లుపాడు, ఫిబ్రవరి 25: తర్లుపాడులో వెలిసిన శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆది వారం సింహ వాహనంపై నరసింహ స్వామి అవతారంలో వేణుగోపాలు స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కేవీ రమణాచార్యులు, కందాల భార్గవ రామాచార్యులు, కూనపులి రమణయ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. స్వామి వారికి తర్లు పాడు పురవీధుల్లో మేళతాళాలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లుపోసి కాయాకర్పూరాలు సమర్పిం చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉభయదాలు వాడేల వెంకట దత్తాత్రేయ శ్రీనివాసులు - లక్ష్మీ ప్రసన్న, వాడేల వెంకటరమణ-ఇర్మానయి, వాడేల సుబ్బరామయ్య-సత్యావతి, ప్రకాశ్‌రావు- శాంతిలక్ష్మీ, వెంకట సుబ్బారావు- రాధామాధవి, సుధాకర్‌రావు-సాయి స్వప్నలు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ అను వంశిక ధర్మకర్త జవాజి విజయ భాస్కర్‌రావు, వివిధ వాహనాల ఉభయదాతలు వాడేల సూర్యనారాయణ, సిద్ధం వెంకట శివకుమార్, కశ్శెట్టి జగన్ బాబు, జవాజి సత్యనారాయణ, పార్లపల్లి వెంకట ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

చెవిరెడ్డికి గిద్దలూరు షాక్!

- అక్కడ బాలినేని అనుచరుల అసంతృప్తి
- మీరే సరిచేసుకోండన్న మాజీ మంత్రి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వైసీపీ నుంచి ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా రంగంలోకి రాబోతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి గిద్దలూరు పార్టీలోని విభేదాల షాక్ తీవ్రంగానే తగిలింది. దానిపై ఆదివారమంతా ఆ నియోజకవర్గ వైసీపీ నేతలు బాలినేనితో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి నాగార్జునరెడ్డి, చెవిరెడ్డితో పలు దఫాలు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. ప్రధానంగా నియోజకవర్గంలోని బాలినేని అనుచరులు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి వ్యవహార శైలిపై అసంతృప్తిని వెళ్లగక్కారు. దీంతో చెవిరెడ్డి జోక్యం చేసుకోగా, బాలినేని కూడా ఆ సమస్యను మీరే పరిష్కరించుకోండి తనకు సంబంధం లేదని కటువుగా సమాధానం చెప్పినట్లు తెలిసింది. మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలను పరస్పరం మార్పు చేసి రాంబాబును మార్కాపురం, గిద్దలూరుకు నాగార్జునరెడ్డిలను పంపిన విషయం తెలిసిందే. నాగార్జునరెడ్డి గిద్దలూరులోనే కాపురం పెట్టి ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నారు. ఆయన కుటుంబీకులంతా అక్కడే తిష్ట వేసి వ్యవహారాలు నడుపుతున్నారు. ఆయన ఇంతవరకు బాలినేనిని కలవలేదని తెలిసింది. గిద్దలూరు నియోజకవర్గంలోని బాలినేని అనుచరుల వద్దకు నాగార్జునరెడ్డి వెళ్లినప్పుడు వారు 'మీరు బాలినేనిని ఎందుకు కలవలేదు' అని అడిగినట్లు తెలిసింది. దీనిపై నాగార్జునరెడ్డి ఇచ్చిన సమాధానంతో వారు సంతృప్తి చెందలేదు. అంతేగాక బాలినేనికి ఫోన్ చేసి నాగార్జునరెడ్డి వ్యవహార శైలిపై వారు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ వెంటనే వారు చెవిరెడ్డికి కూడా ఫోన్ చేశారు.

గతంలోనే బాలినేని విషయంలో సమన్వయం చేయాలని చెవిరెడ్డికి నాగార్జున చెప్పినట్లు తెలిసింది. ఇదే విషయమై తాజాగా చెవిరెడ్డి బాలినేనితో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. ఇద్దరి మధ్య వాడీవాడిగా చర్చ జరిగినట్లు తెలిసింది. ఎవరు ఎవరకు ముందుగా ఫోన్ చేశారో తెలియదు కానీ.. 'ఆ సమస్యను మీరే పరిష్కరించుకోండి. నా అవసరం లేదన్నట్లు మీరు, అలాగే నాగార్జునరెడ్డి వ్యవహరిస్తున్నారు. నా ఒంగోలు నేను చూసుకుంటా.. గిద్దలూరులో మీ తంటాలు మీరే పడండి' అంటూ బాలినేని సీరియస్‌గా చెప్పి ఫోన్ పెట్టేసినట్లు తెలిసింది. దీంతో షాక్‌కు గురైన చెవిరెడ్డి ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు గిద్దలూరులోని అటు ద్వితీయ శ్రేణి నాయకులు, ఇటు నాగార్జునరెడ్డితో మాట్లాడుతున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో పరిస్థితులు కుదుట పడకపోవడంతో నాగార్జునరెడ్డి మరింత ఆవేదనతో 'మీరే సమస్యకు పరిష్కారం చూపాలని' చెవిరెడ్డిపైనే భారం వేసినట్లు తెలిసింది. దీంతో చెవిరెడ్డి ఆరంభంలోనే ఇలా ఉంది. మున్ముందు ఎన్ని సమస్యలు ఎదురవుతాయోనంటూ ముఖ్య నేతల వద్ద వాపోతున్నారు.!

సీనియర్ నేత మన్నె రవీంద్రను కలిసిన ఎరిక్షన్‌బాబు



ఇరువురు నేతలను సన్మానిస్తున్న కేడర్

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 25 : ఎర్రగొండ పాలెం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం రాత్రి సీనియర్ నాయకులు జడ్పీమాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అధిష్ఠానం తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ప్రకటించడంతో టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. మీరే లేఖ ఇచ్చి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా, బాధ్యతలు ఇప్పించారని, మీ ఆశీస్సులు ఉండాలని అభ్యర్థి ఎరిక్షన్‌బాబు రవీంద్రకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయాన్ని గౌరవిస్తానని, ఎర్రగొండపాలెంలో టీడీపీ విజయం కోసం కృషి చేస్తానని డాక్టరు మన్నె రవీంద్ర టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు తెలిపారు. డాక్టరు మన్నె రవీంద్రకు, టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబుకు కలిపి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇద్దరు నాయకులు కలసి పోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. డాక్టరు రవీంద్రను కలసిన వారిలో టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, నియోజకవర్గ పరిశీలకులు వేములకొండ శ్రీనివాసరావు, ఎర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పుల్లలచెరువు టీడీపీ అధ్యక్షులు పయ్యావుల ప్రసాదు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు పాలడుగు వెంకటకోటయ్య, టీడీపీ నాయకులు వేగినాటి శ్రీను, జాగర్లమూడిగాలెయ్య, మాదాల శేషయ్య కొత్త భాస్కర్, తోట ఆనంద్ పాల్గొన్నారు.

కేంద్రం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోంది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25: కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం అందిస్తున్న నిధులను వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో దారి మళ్లిస్తోందని, బీజేపీ జిల్లా అధ్య క్షుడు పీవీ శివారెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని దోర్నాల బస్టాండ్‌లో బీజేపీ నిర్వహించిన ప్రజా పోరు యాత్ర ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం కేంద్ర నిదులు తీసుకుంటూ ప్రధాన మంత్రి చిత్రాన్ని ఎక్కడా చూపించక పోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిశంకర్, పీవీ కృష్ణారావు, శివాజీ, ఆంజనేయులు, కోటేశ్వరి, చంద్రశేఖర్, లక్ష్మీ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్ష

కేంద్రాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ రాహుల్‌మీనన్



పరీక్షలు రాసేందుకు హాజరైన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25: కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఆదివారం గ్రూప్-2 పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని 9 కేంద్రాలు ఉద్యోగార్థులకు కేటాయించారు. బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, రెడ్డి, సాధన, గౌతమి జూనియర్ కళాశాలలు, జార్జ్, ఇందిరా, ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్ పర్వీన్‌లు పరీక్షా కేంద్రాలు పరిశీలించారు. డీఎస్పీ బాలసుందరావు ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 9 మంది ఎస్ఐలు, 110 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పట్టణంలోని ఫోటోస్టాట్ కేంద్రాలు, నెట్ సెంటర్‌లు మూసి వేయించారు.



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

అవీ..ఇవీ..

సమస్యల పరిష్కారానికే చలో విజయవాడ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

కంభం, ఫిబ్రవరి 24 : జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కె.ఎర్రయ్య ఉద్యోగ, ఉపాధ్యాయ, పించనర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన జోనల్ సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు సిద్దిక్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అధ్యక్షులు కె.ఎర్రయ్య మాట్లాడుతూ డీఏలు, గత పీఆర్‌సీ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, క్లోజర్స్‌కు చెందిన ఆర్థిక బకాయిలను చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు దాచుకున్న వేల కోట్ల రూపాయలను సంక్షేమ కార్యక్రమాలకు తరలించి వారికి ఇవ్వవలసిన బకాయిలను ఇవ్వకుండా తాత్సారం చేయడం విడ్డూరమన్నారు. రూ.2500 కోట్ల బకాయిలకు కేవలం రూ.500 కోట్లు విడుదల చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి నబీఖాన్, ఎస్టీయూ బేస్తవారపేట ప్రధాన కార్యదర్శి షేక్ ఖాశింవలి, కంభం మండలశాఖ అధ్యక్షులు షేక్ షఫీ, ఎస్టీయూ, జిల్లా మాజీ అధ్యక్షులు ఇబ్రహీం పాల్గొన్నారు.

టెన్నిస్‌లో డాక్టర్ మోహన్‌రెడ్డి ప్రతిభ

గిద్దలూరు, ఫిబ్రవరి 25 : చిలకలూరిపేటలో జరుగుతున్న ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంటులో 55 ఏళ్ల డబుల్స్ విభాగంలో గిద్దలూరుకు చెందిన డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి జట్టు సెమిఫైనల్స్‌కు చేరింది. వివిధ జిల్లాల నుంచి ఈ టోర్నమెంటులో 50 జట్లు పాల్గొన్నాయి. గిద్దలూరుకు చెందిన డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ శంకర్‌రెడ్డితో కలిసి ఒంగోలుకు చెందిన డాక్టర్ ప్రసన్న, నాగేశ్వరరావు జట్టుపై 6-4 స్కోరు తేడాతో విజయం సాధించి సెమి ఫైనల్స్‌కు చేరుకున్నారు.

శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

త్రిపురాంతకం, ఫిబ్రవరి 25: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో మార్చి 8 నుండి 10 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై రెండో సమీక్షా సమావేశాన్ని ఈ నెల 27న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తహసీల్దారు రామకృష్ణ శివప్రసాద్ తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించనున్నారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు మొదటి సమీక్షలో చర్చించిన అంశాల నివేదికలతో తప్పనిసరిగా పాల్గొనాలని తహసీల్దారు తెలిపారు.

స్టీల్‌బాక్స్‌ల అందజేత



బాక్సులు అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, ఫిబ్రవరి 25 : గిద్దలూరులో ఇటీవల జరిగిన రథోత్సవ కార్యక్రమంలో కోలాట ప్రదర్శన చేసి అందరినీ అలరించిన 45 మంది చిన్నారులకు పాతాళ నాగేశ్వరస్వామి దేవ స్థానం మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు స్టీల్ బాక్స్‌లను అందచేశారు. ముండ్లపాడుకు చెందిన ఈ చిన్నారులు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది.

నేడు విశ్రాంత ఉద్యోగుల సంఘ వార్షికోత్సవం

కంభం, ఫిబ్రవరి 24 : కంభం మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ప్రసాద్, పి.పాండు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు విశ్వరూపాచారి, జిల్లా కార్యదర్శి సుబ్బారావు, తదితరులు పాల్గొంటారన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



మార్కాపురం వన్‌టౌన్, జనవరి 25: మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వ హించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పూల మాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో విళక్కి పూజ



పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 25: స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ప్రాంగణంలోని చెన్నమల్లేశ్వర దేవాలయంలో శివస్వాములు విళక్కి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మణిశర్మ, కేశవస్వామి పర్యవేక్షణలో వేదపండితులు శ్రీ భ్రమరాంబ మల్లికార్జునులకు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం గౌరీశంకరుల ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి గ్రామోత్సవం చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాపోరు



ప్రజాపోరులో ప్రసంగిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, ఫిబ్రవరి 25 : మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి, ప్రయోజనాల గురించి ఆ పార్టీ నాయకులు వివరించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మరోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బ్రహ్మేశ్వరప్రసాద్, కో-కన్వీనర్ గుమ్మారాముడు, జిల్లా ఉపాధ్యక్షులు బి.వి. రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, బీసీ సంఘాల కన్వీనర్ కె.సుబ్బారాయుడు, రూరల్ మండల అధ్యక్షులు కె.తిరుపాల్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షులు ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.





దర్శి-కురిచేడు రోడ్డు వీధిలో పచ్చగా రంగుమారి ఉన్న మురుగు నీరు .. గృహాల మధ్య కుంటలా నిల్వ ఉన్న మురుగు .. బస్టాండ్ ఆవరణలో మురుగు నీటిలో పొర్లాడుతున్న పందులు

దారుణం.. దర్శి పట్టణం..!

- ఎక్కడ చూసినా మురుగు కుంటలే
- యథేచ్ఛగా పందుల సంచారం
- తీవ్రమైన దోమల బెడద
- రోగాలబారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

దర్శి, ఫిబ్రవరి 25 : ఎక్కడ చూసినా మురుగునీరు, మురుగు నీటి కుంటలతో దర్శి పట్టణం దారుణంగా మారింది. అనేక ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండి కుంటలను తలపిస్తున్నాయి. రోజులతరబడి మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆ నీటిలో పందులు పొర్లుతుండడంతో మరింత ఇబ్బందిగా మారుతోంది. ఈగలు, దోమల బెడద ఎక్కువై స్థానికులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడంతో చెత్తకుప్పలు కూడా రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయి. దీంతో దోమల బెడద తీవ్రమైంది. ఇటీవల కాలంలో ఫాగింగ్ చేసిన దాఖలాలు కూడా లేవు. ఈ నేపథ్యంలో ప్రజలు రోగాలబారిన పడి అల్లాడుతున్నారు. దర్శి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. నగర పంచాయతీ ఏర్పాటై నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు సిబ్బంది నియామకం జరగలేదు. గతంలో ఉన్న సిబ్బంది, కార్మికులతోనే పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కమిషనర్‌తో పాటు ముగ్గురు అధికారులు డిప్యుటేషన్‌పై తాత్కాలికంగా పనిచేస్తున్నారు. దీంతో నగర పంచాయతీలో కార్యక్రమాలు ముందుకు సాగడంలేదు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పరిస్థితిని గుర్తించి పూర్తి స్థాయి సిబ్బందిని వెంటనే నియమించాలని పారిశుధ్య, అభివృద్ధి కార్యక్రమాలు మెరుగుపడేలా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మీడియాపై దాడులు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న కొండారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 25: మీడియాపై అధికార పార్టీ చేస్తున్న దాడులు అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం సీపీఎం పట్టణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డికి నచ్చని పత్రికలపై బహిరంగంగా మాట్లాడడం ప్రారంభించాకే కింది స్థాయి నాయకులు, వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నా యన్నారు. పత్రికలు అనుసరిస్తున్న విధానాలు నచ్చకపోతే యాజమా న్యాలతో మాట్లాడి పరిష్కరించుకోకుండా పనిచేస్తున్న మీడియా సిబ్బందిపై దాడులకు పాల్పడటం అన్యాయమన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం తగదన్నారు. మీడియాపై దాడులు ఆపాలని, మీడియా ప్రతినిధులకు రక్షణ చర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు జీ శ్రీనివాసులు, పీసీకేశవ రావు, ఏడుకొండలు, నరేంద్ర పా ల్గొన్నారు.

జగన్‌రెడ్డిది అరాచక పాలన

- గద్దె దింపి.. ఇంటికి పంపండి
- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

కనిగిరి, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్‌ను గద్దెదింపి ఇంటికి సాగనంపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవనంలో ఆదివారం జరిగిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సా ర్వత్రిక ఎన్నికల్లో సీపీఐ పార్టీ పోటీకి సిద్ధమన్నారు. ప్రధాని మోదీకి భయపడి ప్రత్యేక హోదా అడగకుండా జగన్‌రెడ్డి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని విస్మరించిన జగన్ ఓటమి భయంతో కొట్టామిట్టాడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆదాయ వనరులైన గంగవరం, కృష్ణపట్నం పోర్టులతో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమను అదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించకపోగా, తమ భుజాలపై బీజేపీని మోయడం సిగ్గుచేటన్నారు. కార్మిక, కర్షక నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వైసీపీని ఓడిస్తామన్నారు. కాంగ్రెస్, వామపక్షాల పొత్తులో భాగంగా ఇండియా కూటమి తరఫున సీపీఐ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రాబోయే ఎన్నికల్లో గద్దె దింపేందుకు సీపీఐ, ఇండియా కూటమికి మద్దతు తెలుపుతుందన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించేందుకు సెక్యులర్ పార్టీలన్నీ ఏకమై ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఏడు జాబితాల్లో ఇన్‌చార్జిలను ప్రకటించిన వైసీపీ వాటిలో మార్పులు ఉంటాయని వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ కేడర్‌ను గందరగోళంలోకి నెట్టిందన్నారు. అందులో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా అడ్రస్ గల్లంతయిందని ఎద్దేవా చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పాలకులకు ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు వై రవీంద్రబాబు, యాసిన్, మౌలాలి, గుజ్జుల బాలిరెడ్డి, పీ మోహన్, జీపీ రామారావు పాల్గొన్నారు.

దళితుడంటే అంత చులకనా..?

- తనకు కనీస మర్యాద ఇవ్వడం లేదని వైసీపీకి చెందిన కనిగిరి ఏఎంసీ చైర్మన్ ఆవేదన
- సొంత పార్టీ నేతల తీరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న చైర్మన్ సాల్మన్‌రాజు

కనిగిరి, ఫిబ్రవరి 25 : 'దళితులను కొంత మంది వైసీపీ నేతలు చులకనగా చూస్తున్నారు. నేను ఏఎంసీ చైర్మన్ కావడం వారికి మింగుడు పడటం లేదు. నాకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. ప్రొటోకాల్ కూడా అమలు చేయకుండా అడ్డుపడుతున్నారు' అని ప్రకాశం జిల్లా కనిగిరి ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్‌రాజు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి దళితులకు పెద్దపీట వేస్తున్నామని చెప్తుండగా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నదన్నారు. తనను కిందకు గుంజాలని వైసీపీలోని కొంతమంది వ్యక్తులు చూస్తున్నారన్నారు. తన సామాజిక వర్గాన్ని గుర్తించిన ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ తనను ఏఎంసీ చైర్మన్‌గా ఎంపిక చేశారన్నారు. తానెప్పుడూ ఆయనకు విధేయుడిగానే ఉంటానన్నారు. త్వరలోనే వైసీపీలో తనను చులకనగా చూసే నాయకుల పేర్లు బహిర్గతం చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే వైసీపీలో ఎమ్మెల్యే బుర్రా అనుచరవర్గాన్ని పక్కన పెడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో సాల్మన్‌రాజు వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఏఎంసీ చైర్మన్ విలేకరుల సమావేశం నిర్వహిస్తున్నారన్న సమాచారాన్ని వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణకు కొందరు ఇచ్చారు. సాల్మన్‌రాజు రాజీనామా చేస్తున్నారని కూడా వారు తెలిపారు. దీంతో దద్దాల అప్రమత్తమయ్యారు. జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డిని, ఇన్‌చార్జి సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులను ఏఎంసీ చైర్మన్ చాంబర్‌కు వెళ్లాలని పురమాయించారు. దీంతో మీడియా సమావేశం జరుగుతుండగానే వాళ్లంతా అక్కడకు చేరుకున్నారు. జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి కుర్చీలో కూర్చొని ఉన్న ఏఎంసీ చైర్మన్‌ను బలవంతంగా పైకిలేపి ఒక్కసారిగా హత్తుకున్నారు. అనంతరం కొద్దిసేపు అక్కడ హైడ్రామా నడిచింది. ఇంతలో పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ అక్కడకు చేరుకున్నారు. హడావుడిగా చైర్మన్ పక్కన సీటు వేయించుకుని తన అనుచరులతో ఫొటోలు దిగి ఏఎంసీ చైర్మన్‌ను పొగడ్తలతో ముంచెత్తి మెడలో పూలమాల వేశారు. కనిగిరి వైసీపీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సభ్యుడు రవీంద్రనాథ్

సేవ కోసమే స్వచ్ఛంద సంస్థలు

దర్శి, ఫిబ్రవరి 25 : సమాజంలోని పేద ప్రజలకు సేవలందించి వారి అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయని శాసన మండలి సభ్యుడు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ వంకా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పీజీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం లయన్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ సుమారు వంద సంవత్సరాల క్రితం ఏర్పడి ప్రజలకు ఎన్నో రకాల సేవలందిస్తుందన్నారు. మధురై కంటి ఆసుపత్రి లయన్స్ క్లబ్ సహకారంతో నడుస్తుందన్నారు. ప్రతి వ్యక్తి సంపాదించిన సొమ్ములో కొంత భాగాన్ని సమాజ సేవకు వినియోగించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. దర్శి లయన్స్ వారి సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా తమ్మవరపు ఫణిబాబు, కార్యదర్శిగా పానుగంటి సత్యనారాయణ గుప్తా, ట్రెజరర్‌గా గుడిపాటి అశోక్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీ కారం చేశారు. నూతన కార్యవర్గంతో జిల్లా గవర్నర్ మేళం కృపానందం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్ వైస్ జిల్లా గవర్నర్లు పరుచూరి గోపీచంద్, చందోలు హరిప్రసాదరావు, మాజీ గవర్నర్లు నామినేని మోహన్‌రావు, పీ విజయ కుమార్‌రెడ్డి, వెలగా శరత్‌బాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎర్రాప్రగడ పుస్తకావిష్కరణ

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 25: పద్యకవి చదలవాడ లక్ష్మీనరసింహారావు రచించిన ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ పుస్తకావిష్కరణ ఆదివారం ఒంగోలులోని బ్రాహ్మణ సేవా సమితి భవనంలో జరిగింది. పద్య సారస్వత పరిషత్ జిల్లా అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో జీవీ.సుబ్బారెడ్డి పుస్తకావిష్కరణ చేయగా ప్రముఖ అవధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ పుస్తక సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, తేళ్ల అరుణ, పొన్నూరి వేంకటశ్రీనివాసులు, వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



పగిలిన తలుపులతో ఉన్న పశు వైద్యశాల

సమస్యల వలయంలో పామూరు పశు వైద్యశాల

నిర్మించిన పుష్కర కాలానికే విరిగిన తలుపులు, కుంగిన ఫ్లోరింగ్



డాక్టర్ గదిలో కుంగిన ఫ్లోరిన్

పామూరు, ఫిబ్రవరి 25 : మండలంలోని ఏకైక పశు వైద్యశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 25 గ్రామ పంచాయతీల్లో 72 ఆవాస గ్రామాలున్నాయి. ఇక్కడ వ్యవసాయం తర్వాత పాడిపైనే రైతులు, ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. దాతల సహకారంతో స్థలం కొనుగోలు చేసి నాబార్డ్, ఆర్ఐడీఎఫ్, రూ.10 లక్షల 61 వేల అంచనాలతో నిర్మించి, 2012 నవంబర్ 8న పశు వైద్యశాల ప్రారంభించారు. గ డిచిన కొన్ని సంవత్సరా కాలం నుంచి వైద్యశాలలో నిర్మించిన ఫ్లోరింగ్ అం తా కృంగిపోవడం ప్రారంభమైంది, దాంతో వైద్యశాల సిబ్బంది విధులు నిర్వహించాలన్న అసౌకర్యంగా తయారైంది. వైద్యశాలలో డాక్టర్‌తో పాటు, డిప్యూటేషన్‌పై లైవ్‌స్టాక్ అసిస్టెంట్, కాంపౌండర్, అటెండర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఫ్లోరింగ్ కోసం కింద పరిచిన గ్రానైట్ రాళ్లు కిందికు కుంగడంతో ఇసుక అంతా బయటకు వ స్తుంది. కాగా వైద్యశాల మందులు, నిల్వ ఉంచే గదుల ద్వారాలు, తలుపులకు నాశిరకమైన కలపను ఉపయోగించడంతో, చెదులు పట్టి తలుపులు దెబ్బతిని ఊడిపోయి, పగిలిపోయాయి. వైద్యశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. వైద్యశాల మరమ్మతులకు, ప్రహరీ గోడ నిర్మాణానికి పలు మార్లు మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించాలని అధికారులు కోరినా ప్రజా ప్రతినిధులు స్పందించలేదు. ఇప్పటికైనా పశు సంవర్ధక శాఖ జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి నిధులు కేటాచించాలని పశుపోషకులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు టీడీపీ నేత సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వీరపనేని

దొనకొండ, ఫిబ్రవరి 25 : మండలంలోని బాదాపురం, పడమటి వెంకటాపురం గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి ఆదివారం ఆర్థిక సాయాన్ని అందించారు. బాదాపురం గ్రామంలో ఇటీవల కరెంట్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న బండెల కోటయ్య కుమారుడు చరణ్, వెంకటాపురం గ్రామానికి చెందిన చెట్లూరి నాసరయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. వీరిద్దరి కుటుంబాలను టీడీపీ నాయకుడు వెంకన్నచౌదరి పరామర్శించి అధైర్యపడొద్దు అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పి కుటుంబ ఖర్చుల నిమిత్తం ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు చెప్పున ఆర్థిక సహాయం అందించారు. మండలంలో ఇటీవల బాధిత కుటుంబాలను పరామర్శించి సహకరిస్తున్నూ అదేవిధంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న టీడీపీ నాయకుడు వెంకన్నచౌదరిని ప్రజలు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోటా కోటేశ్వర రావు, వైకే చౌదరి, సింగమనేని హనుమంతు, బోయపాటి సుబ్బయ్య, విప్పర్ల శేషు, పులిమి శివ, తెల్లమేకల నాగరాజు, పోటు కోటేశ్వరరావు, పులిమి చైతన్య, బండెల మరియదాసు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏపీటీఎఫ్ నాయకుడు మృతి



దర్శి, ఫిబ్రవరి 25 : దర్శి నియోజకవర్గ ఏపీటీఎఫ్ నాయకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నందు వెం కటయ్య(64) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటు తో మృతిచెందారు. ఆయన విహారయాత్రలో ఉం డగా గుండెపోటు వచ్చింది. బిహార్ రాష్ట్రంలోని గ యా పుణ్యక్షేత్రం వద్ద ఆకస్మికంగా గుండెపోటు రావడం తో అక్కడికక్కడే మృతిచెందారు. ఆయన మృతిపట్ల నియోజకవర్గ, మండల ఏపీటీఎఫ్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైభవంగా అష్టోత్తర కలశ స్నపన

వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక హోమాలు



ప్రత్యేక హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 25 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామికి 108 కలశాలతో అభిషేకం(అష్టోత్తర కలశ స్నపన) వైభవంగా నిర్వహించారు. అనంతరం విశిష్ట హోమాలు చేశారు. శ్రీదేవి, భూదేవి, వరాహ లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేక పూలతో అలంకరించారు. దేవస్థానంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడికు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పామర్తి మాధవ రావు, ఈవో కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అంతా ఆర్భాటమే

- కేంద్రాల్లో బ్యాంకింగ్ సేవలపై వైసీపీ గొప్పలు
- అందుబాటులోకి రాని సేవలు



వెలిగండ్ల, ఫిబ్రవరి 25 : రైతు భరోసా కేంద్రాల్లో సేవలు ఆర్భాటంగానే మిగిలాయి. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నీ ఆర్బీకేల్లోనే సాగుతాయని, ఇది దేశానికే ఆదర్శమంటూ జగన్‌రెడ్డి, ఆపార్టీ నాయ కులు చెప్తున్న మాటలు నీటి మూటలయ్యాయి. ఆర్బీకేల ద్వారా 22 రకాల సేవలు అందించాలని ప్రభుత్వం నిర్దేశించడం తప్ప క్షేత్ర స్థాయిలో ఆచరించడం లేదు. రైతు సేవ ఒట్టిదే అన్నట్లు ఉంది రైతులకు బ్యాంకు సేవలు సులభతరం చేయడంతోపాటు రుణాల మంజూరు తదితర సేవలు రైతు భరోసా కేంద్రాలే వేదిక కానున్నాయంటూ కొద్ది నెలలుగా ప్రభుత్వం చెప్తున్నా ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రైతులు బ్యాంకులకు వెళ్లే అవసరం లేకుండానే బ్యాంకు ప్రతినిధుల ద్వారా ఆర్బీకేల్లో సేవలు అందిస్తామని చెప్పారు. రైతులకు ఆన్‌లైన్ సేవల పైనా అవగాహన కల్పించాల్సి ఉంది. బ్యాంకు ప్రతినిధులు ఆర్బీకేల్లో రోజుకు కనీసం రెండు గంటలు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. వీరికి బ్యాంకులే అవసరమైన సాంకేతిక సామగ్రిని సమకూర్చాలి. బీసీల ద్వారా రైతులు రూ.10 వేల వరకు నగదు జమ చేయచ్చు రూ.20వేల వరకు తీసుకోవచ్చు. నగదు బదిలీ రూ.10 వేల వరకు పరిమితం చేశారు. ఆర్బీకేల్లో బ్యాంకు సేవలకు మార్గదర్శకాలు జిల్లా బ్యాంకర్ల నుంచి వ్యవసాయ శాఖ, స్థానిక బ్యాంకర్లకు అందినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. బ్యాంకు సేవలు కాగితాలకే పరిమితమయ్యాయని రైతులు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నా రు. ఇప్పటికైనా ఆర్బీకేల్లో అందిస్తామన్న అన్ని సేవలను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.



హోటల్ తాళాలు పగులగొట్టిన దుండగులు

దుకాణాల్లో చోరీ

పామూరు, ఫిబ్రవరి 25 : పామూరులో ఇటీవల దొంగతనాలు ఎక్కువయ్యాయి. అర్థరాత్రివేళ దుండగులు దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. తాళాలు పగుల గొట్టి షాపులో ఉన్న సిగరెట్ ప్యాకెట్లు, నగదును అపహరించుకుపోయిన ఘటన శనివారం జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా పద్మకు చెందిన హోటల్, షేక్ సందాని బాషాకు చెందిన బడ్డీ బంకులో దుండగులు సిగరెట్ ప్యాకెట్లు, నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మే రకు పోలీసులు వచ్చి పరిశీలించారు. ఆదే ప్రాంతంలో గతంలో కూడా చోరీలు జరిగాయని, పోలీసు గస్తీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.





ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

పేదలకు అత్యుత్తమ వైద్యం

- కార్పొరేటు ఆస్పత్రులకన్నా మిన్నగా ఎయిమ్స్
- వర్చువల్‌గా మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

మంగళగిరి, ఫిబ్రవరి 25: ఎయిమ్స్‌లో పేదలకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందించేలా రూపొందించామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మంగళగిరిలో రూ 1618.23 కోట్ల వ్యయంతో నిర్మించిన అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) ఆస్పత్రిని ఆయన వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించారు. రాజ్‌కోట్ నుంచి ఆయన రిమోట్ కంట్రోల్‌తో ఆరంభించి ఎయిమ్స్‌ని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. గతంలో ఢిల్లీకి మాత్రమే పరిమితమైన ఎయిమ్స్‌ను నేడు దేశంలోని 22 ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. దేశీయ వైద్యరంగంలో అత్యున్నతమైన వైద్యసేవలు అన్ని ప్రాంతాల వారికి సులువుగా అందుతాయన్నారు. ఈ ఆస్పత్రులను ప్రైవేటు రంగంలోని కార్పొరేటు ఆస్పత్రులకన్నా మిన్నగా రూపొందించామన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద క్రిటికల్ కేర్ హెల్త్‌బ్లాకులను గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో మంగళగిరి ఎయిమ్స్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డబ్బు కన్నా ఆరోగ్యమనేది ప్రతి మనిషికి చాలా ముఖ్యమన్నారు. వైద్యం అందరికీ అందాలన్న లక్ష్యంతో ఎయిమ్స్ అనేక రకాల కార్యక్రమాలను చేపడుతుందని గవర్నర్ వివరించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్‌పవార్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద దేశంలో ఇప్పటికే 15 కోట్ల మందికి వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేంద్ర మంత్రి భారతీ పవార్

41 విభాగాలు.. 13 సూపర్ స్పెషాలిటీ విభాగాలు

మంగళగిరి ఎయిమ్స్‌లో మొత్తం 41 వైద్యవిభాగాలతోపాటు మరో 13 సూపర్ స్పెషాలిటీ విభాగాలను అన్ని హంగులతో ఏర్పాటు చేశామని డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్ తెలిపారు. 183 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 960 పడకల ఆస్పత్రిగా కేంద్రం నిర్మించిందన్నారు. ఈ ఆస్పత్రికి అనుబంధంగా 125 సీట్లతో కూడిన వైద్యకళాశాల, మరో నర్సింగ్ కళాశాల పనిచేస్తుందన్నారు. ప్రాంగణంలో ఎకడమిక్ కాంప్లెక్స్, ఓపీడీ బ్లాక్, ఐపీడీ బ్లాక్, అత్యవసర సేవల విభాగం, రెసిడెన్షియల్ బ్లాక్, హాస్టల్ బ్లాక్, గెస్ట్‌హౌస్, లైబ్రరీ, ఎడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ధర్మశాల భవనం, ఆయుష్ బ్లాక్, అధునాతన సౌకర్యాలతో ఆడిటోరియం తదితరాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనులు పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్‌పవార్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎంపీ బీవీ సత్యవతి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, జీవీఎల్ నరసింహరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎయిమ్స్ అధ్యక్షుడు టీఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు.. వికసిత రైల్వేస్టేషన్

- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి
- నేడు వీడియో లింకు ద్వారా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్(ఏబీఎస్ఎస్) కింద గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్ల రూపురేఖలను కేంద్ర ప్రభుత్వం సమూలంగా మారుస్తోన్నది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతోన్నది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా ఏబీఎస్ఎస్ కింద చేపట్టిన రైల్వేస్టేషన్ల నవీకరణ పనులకు శంకుస్థాపన/ప్రారంభోత్సవాలను సోమవారం వీడియో లింకు ద్వారా చేపట్టనున్నారు. గుంటూరు రైల్వేస్టేషన్‌తో పాటు డివిజన్‌లోని మరో 20 చోట్ల ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. గుంటూరు రైల్వేస్టేషన్‌ను అత్యంత సుందరంగా అలంకరించారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. ఎన్ఎస్‌జీ-3 కేటిగిరీలో ఉన్న గుంటూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే శాఖ రూ.40.67 కోట్లు కేటాయించింది. మూడు లిఫ్టులు, ఒక ఎస్కులేటర్, 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ బ్రిడ్జి, సర్క్యులేటింగ్ ఏరియా అభివృద్ధి, డిస్ప్లే సిస్టమ్స్, దివ్యాంగులకు సౌకర్యాల కల్పనతో అధునాతనంగా తీర్చిదిద్దారు.

పలు ఆర్‌యూబీల ప్రారంభోత్సవం

ప్రయాణికులు/రోడ్డువినియోగదారుల భద్రత దృష్ట్యా డివిజన్ పరిధిలోని పలు చోట్ల కాపలాదారు లేని లెవల్ క్రాసింగ్ గేట్లను రైల్వే శాఖ తొలగించి వాటి స్థానంలోఆర్‌యూబీలను రూ.38.28 కోట్లతో రైల్వే శాఖ నిర్మించింది. వినుకొండలో రూ. 5.01 కోట్లు, మునుమాక గేటు రూ. 2.49 కోట్లు, వేములూరిపాడు గేటు రూ. 5.01 కోట్లు, కొప్పురావూరులో రూ.5.90 కోట్లు, కంతేరు గేటు రూ.5.90 కోట్లు, దాచేపల్లి గేటు రూ. 2.49 కోట్లు, నార్కెట్‌పల్లి గేటు రూ.2.48 కోట్లు, బుదారం గేటు రూ.2.38 కోట్లు, కేసరాజుపల్లి గేటు రూ.2.47 కోట్లతో నిర్మాణం చేపట్టారు. వీటిని ప్రధాని మోదీ వీడియో లింకు ద్వారా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి రైల్వే అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

నడికుడిలో శంకుస్థాపన

దాచేపల్లి: రైల్వే స్టేషన్లను ఆధునికీకరించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా నడికూడి జంక్షన్‌లో వర్చువల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. నడికూడి 86వ రైల్వే గేటు వద్ద నిర్మించిన అండర్ పాస్ నిర్మాణం, స్టేషన్ ఆవరణలో చేయాల్సిన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. నడికూడి జంక్షన్‌లో 11.3 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు రైల్వేశాఖ నిధులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వేమూలూరిపాడు గేటు వద్ద నిర్మించిన ఆర్‌యూబీ


ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష

- కేంద్రాలను సందర్శించిన జేసీ, ఆర్డీవో


చెరుకుపల్లి: పరీక్షలకు హాజరైన అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్, చెరుకుపల్లి, ఫిబ్రవరి 25: గ్రూపు-2 స్క్రీనింగ్ పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టమైన భద్రత మధ్యన జరిగింది. జిల్లాలో 25 కేంద్రాలలో 7,671 మంది అభ్యర్థులకు 6282 మంది హాజరయ్యారు. 11 రూట్లలో ఆయా కేంద్రాలను జేసీ శ్రీధర్, ఆర్డీవో గ్రంధం రవీందర్, డీవీఈవో పి.యర్రయ్య తనిఖీ చేశారు. చెరుకుపల్లి పరిధిలోని కావూరు ప్రభుత్వ కళాశాల, గుళ్లపల్లిలోని ఎన్ఆర్ఐ, పొన్నపల్లిలోని గీతమ్ శివాని కళాశాల, కనగాలలోని హెచ్ఎంకేఎస్ బీఈడీ కళాశాల్లోని కేంద్రాలను తనిఖీ చేసినట్లు రూట్ అధికారులు బి.సురేష్, విలియమ్‌లు తెలిపారు. ఏపీపీఎస్సీ నిబంధనల మేరకు నిర్ణీత సమయం వరకు మాత్రమే అభ్యర్థులను అనుమతించారు. జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను మూయించేశారు. కొంతమంది అభ్యర్థులు గ్రేస్ పీరియడ్‌లో ఉరుకులు పరుగులు మీద కేంద్రాలకి వచ్చారు. పరీక్ష ముగిసిన వెంటనే సామగ్రి మొత్తాన్ని స్ట్రాంగ్‌రూంకు ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య తరలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల వ్యవసాయ కళాశాలలో గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు


పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్ నగర్‌లో ఎంతోకాలంగా ధ్వంసమై ఉన్న సీసీరోడ్డు

పంచాయతీలకు పంగనామాలు

- పత్తా లేని 15వ ఆర్థిక సంఘం నిధులు
- కేంద్రం విడుదల.. రాష్ట్ర ప్రభుత్వం స్వాహా
- నిధులు లేక కునారిల్లుతున్న పంచాయతీలు
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న సర్పంచ్‌లు
- ఆదాయాలు తీసుకుని.. భారాలు పంచాయతీలపై
- నిధులు, విధులు లేని దయనీయ దుస్థితిలో సర్పంచ్‌లు

గ్రామసీమలు దేశానికి పట్టుకొమ్మలు.. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలు నిస్తేజంగా మారా యి.. నిధులు, విధులు లేక నిర్వీర్యమై పోతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాలాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అనే చందంగా ఉంది. పంచాయతీల్లో నిధులు లేవు.. పాలకులకు విధులు లేవు.. పంచాయతీలు రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నిస్తేజంగా మారు తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయకపోగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను కూడా సొంతానికి వాడే సుకుంటోంది. ఇక సచివాలయ వ్యవస్థ పంచాయతీ పాలకులను ఉత్సవ విగ్రహాలుగా మారుస్తున్నాయి. నిధు లు, విధులు కోసం సర్పంచ్‌లు పోరు బాట సాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడంలేదు. చిన్నచిన్న పనులు చేయించాలన్నా కూడా నిధులు లేవని సర్పంచ్‌లు వాపో తున్నారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర అత్యవసర పనులకు కూడా పంచాయతీ ఖాతాల్లో నిధు లు లేవు. గడచిన మూడేళ్ల పదవీ కాలం లో సర్పంచ్‌లుగా ఊరికి ఏమీ చేయలేక, చేయడానికి నిధులు లేక చేష్టలు డిగి చూస్తున్నారు. పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందంటే ఆశ్చర్యం కాదు.

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఫిబ్రవరి 25: ఊరికి మేలు చేయాలన్న ఆశతో ఎన్నికల్లో సర్పంచులుగా గెలిచిన వాళ్ళు నిధులు, విధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక స్వపరిపాలన సంస్థలు వైసీపీ ప్రభుత్వం హయాంలో పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. జగన్ పుణ్యమా అని సర్పంచ్ కన్నా వార్డు వలంటీరుకే జనాధరణ మెండుగా ఉందంటే ఆశ్చర్యంకాదు. నిధుల లేమితో చేసేదిలేక ఎన్నుకున్న ప్రజలకు సమాధానం చెప్పలేక సర్పంచ్‌లు అల్లాడిపోతున్నారు. గ్రామ పంచాయతీలకు మూడేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం సరైన సమయంలోనే రాష్ట్రానికి విడుదల చేసింది. పంచాయతీల ఖాతాల్లో జమ కావాల్సిన నిధులను కరెంటు బిల్లుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ఆ నిధులు తిరిగి విడుదల చేస్తామని చెప్పినా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. ఇంటి పన్నులు ద్వారా వచ్చే ఆదాయం మాత్రమే కొన్ని పంచాయతీలకు ఆధారంగా ఉంది. నామమాత్రపు ఆదాయంతో గ్రామాల్లో మంచి, చెడ్డల నిర్వహణ మోయలేని భారంగా ఉంటోంది. ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు అప్పులు చేస్తున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు. పంచాయతీలు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులకు వడ్డీలు, చక్రవడ్డీలు వేసి రూ.కోట్లలో బకాయిలు చూపిస్తున్నారు. ఒకప్పుడు ఊరిలో ఏది జరిగినా సర్పంచులు మీద వేసుకుని ఖర్చు భరించేవారు ఇప్పుడు సర్పంచ్‌లు రోజురోజుకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పంచాయతీల్లో అవసరమైన స్టేషనరీ కూడా పంచాయతీ సర్పంచ్‌ల సొంత నిధుల నుంచి ఖర్చు పెట్టాల్సి వస్తుంది. వీధిలైట్లు బాగు చేయించడానికి కూడా నిధులు లేవని పలువురు సర్పంచులు వాపోతున్నారు. నిధులు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా అడుగంటిపోయింది. చెత్తఎత్తే వారికి జీతాలు ఇవ్వకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోతోంది. కాల్వలను శుభ్రం చేసేవారే లేకుండా పోయారు. పారిశుధ్యం క్షీణించి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పలు గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. పంచాయతీల్లో బ్లీచింగ్, సున్నం చల్లిన దాఖలాలు లేవు. ఎవరైనా అధికారులు, వీఐపీలు వస్తున్న సందర్భంలో తప్పితే బ్లీచింగ్, సున్నం చల్లడం లేదు. పంచాయతీల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు గతంలో గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. వైసీపీ పాలనలో వారిని క్లాప్‌మిత్రలుగా మార్చారు. గత ప్రభుత్వ హయాంలో వీరికి స్వచ్ఛభారత్ కార్పొరేషన్ నిధుల ద్వారా వేతనాలు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధులు కాస్త దారిమళ్లించి పంచాయతీ నిధులు నుంచే వేతనాలు ఇచ్చే ఏర్పాటు చేశారు. 15వ ఆర్థిక సంఘ నిధులు నేటి వరకు జమకాకపోవటంతో నెలలు కొద్ది వీరికి వేతనాలు చెల్లించలేకపోతున్నారు. కొంతమంది సర్పంచ్‌లు సొంత నిధులు వెచ్చిస్తున్నారు. ఇక తాగునీటి పథకాల మరమ్మతులు, నిర్వహణ అయితే చాలా పంచాయతీల్లో లేకుండా పోయింది. గ్రామాల్లో రక్షిత మంచి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ప్రజలకు రక్షిత మంచి నీటిని క్లోరినేషన్ చేసి అందించాల్సి ఉండగా దాని గురించి పట్టించుకునే వారే లేరు. గతంలో సర్పంచ్‌లు సొంత నిధులతో ఆయా పనులు చేసి ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత తీసుకునే వారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో గతంలో పెట్టిన ఖర్చులకు దిక్కు లేకుండా పోవడంతో పంచాయతీల్లో పనులను సర్పంచ్‌లు పట్టించుకోవడంలేదు. గ్రామాల్లో కొత్తగా రోడ్లు వేయకపోగా ఉన్న వాటికి మరమ్మతులు చేయలేకపోతున్నారు. మేజర్ గ్రామపంచాయతీల్లో కొంతమేర ఆదాయ వనరులు ఉండటం వల్ల అక్కడ కొంత మెరుగ్గా ఉంది. ఆదాయ వనరులు లేని మైనర్‌పంచాయతీల సర్పంచ్‌లు పడుతున్న ఇబ్బందులు చెప్పనలికాదు.


దుర్గిలో డంపింగ్ యార్డులా దర్శనమిస్తున్న వీధి


రాజుపాలెంలో కాలువల్లో పెరిగిన పిచ్చి చెట్లు


అధ్వాన్నంగా వున్న గుత్తికొండ పరిధిలోని మురికికాలువ

చైర్మన్ సరే.. నిధులు

ఇక పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయాలి. ఐదో ఆర్థిక సంఘానికి చైర్మన్‌గా ప్రొఫెసర్ రత్నకుమారిని నియమించారు. కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఐదో ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల కాలేదు. దీనిపై సర్పంచులు నిరంతరం పోరాటం చేస్తున్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారు అయినా ప్రభు త్వం రూపాయి కూడా విదల్చలేదు.


బాపట్ల : ఇటీవల వర్షాలకు ధ్వంసమైన భర్తీపూడి రోడ్డు

ఎవరిపై కేసు పెట్టాలి

పంచాయతీల నిధుల్లో తేడాలు ఉంటే ఒకప్పుడు సర్పంచుల మీద రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెట్టి వారి చెక్‌పవర్‌ను రద్దు చేసేది. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే సర్పంచ్‌లకు, పంచాయతీ పాలకవర్గాలకు తెలియకుండా, వారి ఆమోదం లేకుండా నిధులను వాడేసుకుంటుంది. అంటే ఒకవిధంగా పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం స్వాహా చేస్తున్నట్లే. అంటే ఇప్పుడు కేసులు ఎవరి మీద పెట్టాలని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోగా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించింది. పంచాయతీల ఖాతాల్లో జమ కావాల్సిన నిధులను కరెంటు బిల్లుల పేరుతో వాడేసుకుంది. వాస్తవానికి పంచాయతీలు కరెంట్ బిల్లు చెల్లించాలన్నా దానికి పాలకవర్గ ఆమోదం ఉండాలి. ఆ తర్వాత మాత్రమే కరెంటు బిల్లును చెల్లించాలి. అయితే ఇవేవీ లేకుండానే పంచాయతీల నిధులను కరెంటు బిల్లు కింద జమ వేసుకున్నట్లు రాష్ట్ర స్థాయి అధికారులు చూపించారు.

గుదిబండలు ఎన్నో

రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని తాను తీసుకుంటూ పంచాయతీలపై నిర్వహణ భారాన్ని నెట్టివేస్తోంది. పంచాయతీలలో ఏర్పాటు చేసిన గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం జీతాలు చెల్లించాలి. మూడేళ్లుగా ప్రభుత్వం వారికి జీతాలు ఇవ్వడంలేదు. దీంతో పంచాయతీ నిధుల నుంచి వారికి జీతాలు చెల్లిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ కూడా పంచాయతీలకు మోయలేని బరువుగా మారింది. సచివాలయాల్లో వివిధ సర్టిఫికెట్లు జారీ ద్వారా వచ్చిన నిధులను ప్రభుత్వం తన ఖాతాలో జమ వేసుకుంటుండగా, స్టేషనరీ బరువును మాత్రం పంచాయతీలపై నెడుతుంది. రోజురోజుకు కొండలా పెరిగిపోతున్న కరెంటు బిల్లులు పంచాయతీలకు గుదిబండలుగా మారాయి. పేరుగొప్ప ఊరుదిబ్బ అనుచందంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా సచివాలయాలను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించింది. అయితే దానికి తగ్గ రీతిలో నిధులు సమకూర్చకపోవటం వల్ల అవి పంచాయతీలకు గుదిబండలుగా మారాయి.

నిధులు జమ చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పంపిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే గ్రామపంచాయతీ అకౌంట్లో జమ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ ఐదో ఆర్థిక సంఘం నిధులను కూ డా పంచాయతీలకు ఇచ్చి ఆదుకోవాలి. లేని పక్షంలో పంచాయతీలు కునారిల్లి పోయే పరిస్థితి ఉంది. సచివాలయాల మీద వచ్చే ఆదాయాలను కూడా పంచాయతీలకు పంచాలి. సచివాలయాలను సర్పంచుల ఆధీనంలోనే పనిచేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి.

- డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్

నిర్వీర్యమైన గ్రామపాలన



గతంలో ఏ ప్రభుత్వాలలో లేని విధంగా వైసీపీ పాలనలో గ్రామపాలన నిర్వీర్యమైంది. అసలు సర్పంచ్‌ల అధికారాలు ఏమిటో కూడా తెలియని పరిస్థితి. కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా పక్కదారి పట్టిస్తున్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి లేదు. వచ్చే అరకొర నిధులు విద్యుత్ బకాయిలకు, చిన్న చిన్న పనులకే సరిపోతున్నాయి. గ్రామాభివృద్ధికి సరిపోయినంత నిధులు విడుదల చేయడం లేదు.

- పాందూరి నరసింహారావు, సర్పంచ్, కొత్తగణేశునిపాడు, పిడుగురాళ్ల

అప్పుల పాలయ్యాం



సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీకి నిధులు రాలేదు. మైనర్ పంచాయతీకావడంతో జనరల్‌ఫండ్స్ అంతంతమాత్రమే. గ్రామంలో సమస్యలు పరిష్కరించడానికి లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టాం. దా తల సహకారంతో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేసినా చెరువు, ఓవర్‌హెడ్‌ట్యాంక్ మరమ్మతులకు నిధులు లేవు. దీనివల్ల నిర్వహణ ఖర్చు భారంగా మారింది.


- బి.హనుమాన్‌జి, సర్పంచ్, గుడిపూడి, బాపట్ల మండలం

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఆత్మహత్యలు



పంచాయతీల సర్పంచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ విగ్ర హాలుగా మార్చింది. ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం పంపిన రూ.629 కోట్లు రాష్ట్రం దారి మళ్లించి పంచాయతీల్లో అభివృద్ధిని అడ్డుకుంది. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయ కుండా సర్పంచ్‌ల ఆత్మహత్యలకు, అప్పులకు కారణమయ్యారు. గ్రామ స్వరాజ్యం కోసం రాజ్యాంగం కల్పించిన 29 హక్కులను పరిరక్షించాలి.

- పెదబాబు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అర్గనైజింగ్ సెక్రటరి, సర్పంచ్, గుండాలపాడు, తాడికొండ.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- ఎనిమిది గంటలకే కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులు
- పలుచోట్ల తనిఖీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్
- చిన్నారిని లాలించిన మహిళా కానిస్టేబుల్



చిన్నారిని లాలిస్తున్న కానిస్టేబుల్

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 25 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. మొత్తం 21,565 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారి కోసం 69 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు 17,860 (82శాతం) మంది హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే ఆయా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకున్నారు. ఒంగోలులో అత్యధికంగా 28 సెంటర్లు ఏర్పాటు చేయగా అక్కడికి పరీక్ష రాసేవారితోపాటు వారితల్లిదండ్రులు తరలి రావడంతో కోలాహలం నెలకొంది. నిర్ణీత సమయానికి అర్ధగంట ముందుగానే అభ్యర్థుల హాల్ టిక్కెట్లను పోలీసులు, ఆయా కాలేజీల నిర్వాహకులు పరిశీలించి లోపలికి అనుమతించారు. సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుతించలేదు. వాటిని బయటే ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రూపు-2 పరీక్ష రాసేందుకు జిల్లాలోని పలుప్రాంతాలతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా అభ్యర్థులు ముందురోజు రాత్రే ఒం గోలు చేరుకున్నారు. కొందరు తల్లులు చంటిబిడ్డలతో సహా వచ్చారు. బయట వారి కుటుంబ సభ్యులకు చిన్నారులను అప్పగించారు. ఒక పరీక్షా కేంద్రం వ ద్ద ఓ చిన్నారి ఏడుస్తూ ఉండటాన్ని గమించిన అక్కడ విధుల్లో ఉన్న మ హిళా కానిస్టేబుల్ ఆ చిన్నారిని పరీక్ష పూర్తయ్యే వరకూ తన వద్దనే ఉంచుకొ ని లాలించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీహర్షిణి కళాశాలతో పాటు క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మరోవైపు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి బందోబస్తును పరిశీలించడంతోపాటు పలు కేంద్రాలను తనిఖీ చేశారు. నగరంలోని మంగమూరు రోడ్డులోనే ఐదారు పరీక్షా కేంద్రాలు ఉండటంతో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత అభ్యర్థులంతా ఒక్కసారిగా బయటకు వచ్చారు. దీంతో మంగమూరు రోడ్డు జంక్షన్‌లో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. జవాబు పత్రాలు ఆదివారం రాత్రి ప్రత్యేక బస్సులో విజయవాడకు తరలించారు.

'కొంప'ముంచిన ఆప్కాస్..!

- ఇళ్లస్థలాలకు అర్హత కోల్పోయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు
- మొన్న భరోసా పత్రాలు ఇచ్చారు.. నేడు వీలుకాదన్నారు
- పేదలుగా గుర్తించి పట్టాలు ఇవ్వాలంటున్న లబ్ధిదారులు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 25 : త్వరలోనే తమకు ఇంటి స్థలం వస్తుందని అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్)లో పనిచేసే వారంతా ఆశపడ్డారు. రెండేళ్ల క్రితం అందించిన భరోసా పత్రాలతో మురిసిపోయారు. సొంతింటి కలను సాకారం చేసుకోవచ్చని సంబరపడ్డారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాలు అందే సమయంలో ఆరు అంచెల ఆంక్షలు అడ్డంకిగా మారాయి. చాలీచాలని వేతనాలతో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారు నిబంధనల కారణంగా ప్రభుత్వం అందించే జగనన్న ఇళ్ల పథకానికి దూరమయ్యారు.

అర్హత కోల్పోయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఆప్కాస్‌లో పనిచేసే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతుండడంతో ఇప్పటికే వేలాది మంది అమ్మఒడి, రేషన్‌కార్డు, జగనన్న చేయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతర సంక్షేమ పథకాలను కోల్పోయారు. ఇప్పుడు నివేశన స్థలాలకూ దూరమయ్యారు. ఇప్పటికే భరోసా పత్రాలు పొందిన వారి జాబితాలను ప్రత్యేకంగా రూపొందించిన డీఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ పొందుపరిచారు. దీంతో ప్రభుత్వ కార్యాయాల్లో ఆప్కాస్ కింద పనిచేస్తూ సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు తీసుకుంటున్న సుమారు 2500 మంది వరకు అర్హత కోల్పోయారు. వీరిలో ఇతర శాఖల్లో పనిచేస్తున్న కొందరికి పట్టాలు వచ్చాయి. మరి కొందరికి అర్హత లేదని నిరాకరించారు. నగర పాలక సంస్థలో ఆప్కాస్ కింద పనిచేస్తున్న వారిలో ఒక్కరికి కూడా ఇంటి పట్టా అందలేదు.

నిబంధనలు సవరించి న్యాయం చేయాలి : లబ్ధిదారులు

ఆప్కాస్ ద్వారా ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో సుమారు 1,200 మంది వరకు పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇతర సెక్షన్లలో పనిచేస్తున్నారు. వారితోపాటు ఒంగోలులోని 34 ప్రభుత్వ కార్యాలయాల్లో మరో 3వేలమంది వరకు పనిచేస్తున్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, మరోవైపు భద్రత లేని ఉద్యోగాలు, ఇంకోవైపు పెరిగిన ధరలతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అప్కాస్‌లో ఉన్నందుకు తమకు అన్ని విధాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు. ఆరు అంచెల విధానం నుంచి ఆప్కాస్ కింద పనిచేసే ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి ఇళ్ల పట్టాలు అందించాలని కోరుతున్నారు.

జగన్‌రెడ్డిది అరాచక పాలన

- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

కనిగిరి, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న జగన్‌ను గద్దెదింపి ఇంటికి సాగనంపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవనంలో ఆదివారం జరిగిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సా ర్వత్రిక ఎన్నికల్లో సీపీఐ పార్టీ పోటీకి సిద మన్నారు. ప్రధాని మోదీకి భయపడి ప్రత్యేక హోదా అడగకుండా జగన్‌రెడ్డి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. వెనుకబడి న జిల్లాల అభివృద్ధిని విస్మరించిన జగన్ ఓట మి భయంతో కొట్టామిట్టాడుతున్నారన్నారు. రా ష్ట్రంలో ఆదాయ వనరులైన గంగవరం, కృష్ణప ట్నం పోర్టులతో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమ ను అదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫిరాయింపుల ఆనవాయితీ

- జిల్లా ఏర్పడకముందూ.. ఆ తర్వాతా అదే వరుస
- నేటి నాయకులూ అదేబాట
- కొత్త పార్టీలు రావడం, ఉన్న దానిలో గుర్తింపు లేకపోవడమే ప్రధాన కారణం

సార్వత్రిక ఎన్నికలు రాగానే నాయకుల పార్టీల ఫిరాయింపులు ఆనవాయితీగా మారాయి. అందుకు పూర్వం నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చోటుచేసు కున్న రాజకీయాలు దర్పణం పడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఇటు కాంగ్రెస్, అటు కమ్యూనిస్టులు ప్రత్యర్థులుగా ఉన్న కాలంలో కూడా నాయకులు పార్టీలు మారారు. 1970లో జిల్లా ఆవిర్భావం తర్వాత అవి అధికమయ్యాయి. అంతకుముందు స్వతంత్ర అభ్యర్థులు సొంత ప్రజాబలంతో గెలుపొందగా ఆతర్వాత కొంతకాలానికి పార్టీల పరోక్ష మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించారు. 2000 దశకం వచ్చేసరికి పార్టీల ప్రభావిత రాజకీయాలు పెరిగిపోయాయి. అప్పటి నుంచి అవసరానికి అనుగుణంగా నాయకుల ఫిరాయింపు రాజకీయాలూ మరింత ఊపందుకున్నాయి.



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏర్పాటుకు ముందు కూడా నాయకుల ఫిరాయింపు రాజకీయాలు కొనసాగాయి. అప్పట్లో కర్నూలు జిల్లాలో ఉండి తరువాత ప్రకాశం జిల్లాకు వచ్చిన గిద్దలూరు ప్రాంతంలో రాజకీయంగా చక్రం తిప్పిన పిడతల రంగారెడ్డి 1955-1972లో కాంగ్రెస్ తరఫున, 1978లో జనతా పార్టీ తరుపున పోటీచేసి గెలుపొందారు. 1985లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయన టీడీపీ మద్దతులో గెలుపొందారు. 1955లో కెఎల్‌పీ పార్టీ తరఫున మార్కాపురం నుంచి గెలుపొందిన కందుల ఓబుల్‌రెడ్డి 1962లో అదేస్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1967లో మార్కాపురం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన చప్పిడి వెంగయ్య తెలుగుదేశం ఆవిర్భావం తరువాత ఆపార్టీలో చేరి 1994లో కంభం నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అప్పట్లో నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గం నుంచి 1955లో కాంగ్రెస్ పక్షాన గెలుపొందిన దివి కొండయ్యచౌదరి 1962లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. 1978లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. అదే నియోజకవర్గం నుంచి మానుగుంట ఆదినారాయణరెడ్డి 1972, 1983 స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. 1985 ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో చేరి విజయం సాధించారు. అప్పట్లో గుంటూరు జిల్లా పరిధిలో ఉన్న అద్దంకి నియోజకవర్గం నుంచి నాగినేని వెంకయ్య కేఎల్‌పీ తరఫున గెలుపొంది 1967లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. చీరాల నియోజకవర్గంలో 1952లో ప్రగడ కోటయ్య కేఎంపీపీ నుంచి, 1955 ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో చేరి ఆపార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. ఇక్కడ 1982 ఉప ఎన్నికల్లో జనతా అభ్యర్థిగా గెలుపొందిన సజ్జా చంద్రమౌళి 1985 ఎన్నికల్లో టీడీపీ పక్షాన పోటీచేసి విజయం సాధించారు. అలాగే పొదిలి నియోజకవర్గం నుంచి 1962,67లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన కాటూరి నారాయణస్వామి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా, 1983లో దర్శి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఇలా అప్పట్లోనే అనేకమంది ప్రముఖులు ఆయా ఎన్నికల సమయాల్లో పార్టీ ఫిరాయింపు రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

1983, 85 ఎన్నికల్లో..

ఉమ్మడి ప్రకాశం జిల్లా 1970లో ఏర్పడగా ఆ తర్వాత 1972,78లో జరిగిన ఎన్నికల్లో కొందరు ఫిరాయింపు రాజకీయాలకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయి. అయితే 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత ఈ పరంపర అధికంగా కొనసాగింది. ఆయా పార్టీల్లో ఉన్నవారితోపాటు పలువురు యువకులు కొత్తగా రాజకీయ రంగ ప్రవేశం చేసి టీడీపీలో చేరారు. 1983లో టీడీపీ పక్షాన పర్చూరు నుంచి గెలుపొందిన దగ్గుబాటి చౌదరి, మార్కాపురం నుంచి గెలుపొందిన వీవీ నారాయణరెడ్డి, గిద్దలూరు నుంచి విజయం సాధించిన ఎం.పీరారెడ్డిలు ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి దింపిన సమయంలో నాదెండ్ల భాస్కర్‌రావు పక్షాన చేరారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో వీరిలో పీరారెడ్డి గిద్దలూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో దగ్గుబాటి చౌదరి, నారాయణరెడ్డిలకు ఏపార్టీ టికెట్లు కూడా ఇవ్వలేదు. 1985 మధ్యంతర ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి కరణం బలరాం టీడీపీలో చేరగా గొట్టిపాటి హనుమంతరావు టీడీపీని వీడి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు. కందుకూరు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఆదినారాయణరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఇక ప్రస్తుత రాజకీయాల్లో ఉన్న కొందరు నాయకులు, కొందరు కుటుంబాల చరిత్రను తిరగేస్తే ఆయా సందర్భాల్లో నాయకుల ఫిరాయింపుల జోరుగానే సాగిన విషయం తేటతెల్లమవుతుంది.

గొట్టిపాటి కుటుంబం

గొట్టిపాటి కుటుంబంలోని నాయకులు పలు సందర్భాల్లో పార్టీలు మారారు. గొట్టిపాటి హనుమంతరావు 1983లో మార్టూరు నుంచి టీడీపీ పక్షాన గెలుపొంది ఆతర్వాత వెంకటేశ్వరరావు కోసం ఏడాదిలోపు రాజీనామా చేశారు. టీడీపీ తరఫున 1984లో జడ్పీ చైర్మన్ బాధ్యతలు చేపట్టి 1985 ఎన్నికల నాటికి ఆపార్టీ పదవికి రాజీనామా చేశారు. 1989లో కాంగ్రెస్ పక్షాన మార్టూరు నుంచి పోటీచేసి ఓడిపోయారు. తిరిగి 1994లో టీడీపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా మార్టూరు నుంచి గెలుపొందారు. ఆ తర్వాత చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేస్తూ మృతి చెందారు. అనంతం జరిగిన ఉప ఎన్నికలో ఆయన వారసుడిగా కుమారుడు నరసయ్య మార్టూరు నుంచి గెలుపొందారు. 2004 ఎన్నికల నాటికి ఆయన సోదరుడు గొట్టిపాటి రవికుమార్ రాజకీయాల్లోకి వచ్చి మార్టూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 2009లో అద్దంకి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన రవికుమార్ 2014 ఎన్నికల్లో వైసీపీలో చేరి ఆపార్టీ తరఫున విజయబావుటా ఎగురవేశారు. 2015లో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరారు. 2019లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొంది ఎమ్మెల్యేగా ఉన్నారు.

కరణం బలరాం

1978లో అద్దంకి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన బలరాం.. 1983లో అదేపార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. చంద్రబాబు సహకారంతో టీడీపీలో చేరి 1985-89 ఎన్నికల్లో మార్టూరు నుంచి ఆపార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1994 ఎన్నికల నాటికి టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి మార్టూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. తిరిగి 1998లో టీడీపీలో చేరి ఆపార్టీ తరఫున 1999లో ఒంగోలు ఎంపీగా గెలుపొందారు. 2004లోనూ అద్దంకి నుంచి గెలుపొందిన బలరాం 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తర్వాత టీడీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన 2019 ఎన్నికల్లో చీరాల నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఏడాది తరువాత వైసీపీలో చేరిపోయారు. ప్రస్తుతం ఆ పార్టీ తరఫున ఆయన కుమారుడు చీరాల నుంచి పోటీ చేయబోతున్నారు.

మాగుంట శ్రీనివాసులరెడ్డి

వ్యాపార రంగంలో ఉన్న మాగుంట కుటుంబం నుంచి 1991లో ఒంగోలు లోక్‌సభ నుంచి కాంగ్రెస్ తరఫున మాగుంట సుబ్బరామిరెడ్డి గెలుపొందారు. ఆయన 1995లో హత్యకు గురవ్వగా, 1996లో ఆయ సతీమణి పార్వతమ్మ, 1998లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎంపీగా గెలుపొందారు. 1999 ఎన్నికల్లో ఓటమి చవిచూసిన శ్రీనివాసులరెడ్డి 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన ఒంగోలు ఎంపీగా గెలుపొందారు. 2014లో టీడీపీలో చేరి పోటీచేసి ఓడిప్పోయారు. ఆతర్వాత టీడీపీలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన ఆయన 2019 ఎన్నికల నాటికి వైసీపీలో చేరి ఆ పార్టీ తరఫున ఎంపీ అయ్యారు. ప్రస్తుతం ఆయన కుమారుడు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది.

డాక్టర్ గరటయ్య

తొలుత జనతా, ఆతర్వాత లోక్‌దళ్ పార్టీల్లో ఉన్న బాచిన చెంచుగరటయ్య టీడీపీ ఆవిర్భావంతో ఆపార్టీలో చేరి 1983, 1985లో అద్దంకి నుంచి గెలుపొందారు. 1989లో ఓటమి చెందిన తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 1994 ఎన్నికల సమయంలో చివరి రోజు ఒక్కక్షణంలో టీడీపీలో చేరి ఆపార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. 1999లో తిరిగి టీడీపీ తరఫున గెలుపొందిన ఆయన 2004లో పోటీ చేయలేదు. 2009 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఆతర్వాత వైసీపీ తీర్థంపుచ్చుకున్న ఆయన 2019 ఎన్నికల్లో ఆపార్టీ తరఫున అద్దంకి నుంచి పోటీచేసి ఓటమిచెందారు. ప్రస్తుతం ఆయనతోపాటు, కుమారుడు చైతన్య టీడీపీ, జనసేన కూటమిలో చేరే అవకాశం ఉంది.

ఇతర పలువురు

జిల్లా రాజకీయాల్లో ప్రస్తుతం చురుగ్గా ఉన్న మరికొందరు నాయకులు కూడా ఆయా సందర్భాల్లో పార్టీ ఫిరాయింపులు చేసిన వారే. ప్రస్తుతం కనిగిరి నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగంలో ఉన్న డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అక్కడ 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ పలుకుబడి తగ్గిన తర్వాత 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. 2014 ఎన్నికల్లో గిద్దలూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా గెలుపొందిన ఆశోక్‌రెడ్డి కూడా 2015లో టీడీపీలో చేరారు. ఈఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి రాబోతున్నారు. ప్రసుత్తం గిద్దలూరు ఎమ్మెల్యేగా ఉన్న అన్నా రాంబాబు 2009లో పీఆర్‌పీ తరఫున గెలుపొంది ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2014 ఎన్నికల నాటికి సైకిలెక్కిన ఆయన టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల నాటికి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. సంతనూతలపాడు నుంచి 2009లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన బీఎన్‌విజయ్‌కుమార్ తర్వాత టీడీపీలో చేరి ప్రస్తుతం అదేస్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు.

క్రమబద్ధీకరణ కష్టాలు

- 22ఏలో చేరిన భూముల రిజిస్ట్రేషన్ కోసం
- ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేస్తున్న రైతులు
- అవసరాన్ని ఆసరా చేసుకొని
- భారీగా డిమాండ్ చేస్తున్న అధికారులు
- డబ్బులు తీసుకొని పని చేయని వైనం



దర్శి, ఫిబ్రవరి 25 : రైతులకు సంపూర్ణ హక్కులు కల్గిన పట్టాభూములను రెవెన్యూ అధికారులు 22ఏలో నమోదు చేసి ఆటలాడుకుంటున్నారు. రైతులు క్రమబద్ధీకరణ కోసం ఏళ్ల తరబడి తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ సబ్ డివిజన్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో పాలుపోక అన్నదాతలు అల్లాడుతున్నారు. రెవెన్యూ రికార్డుల క్రమబద్ధీకరణలో భాగంగా 2018లో అధికారులు దస్త్రాలను సక్రమంగా చూడకుండా అనేకమంది రైతుల పట్టా భూములను 22ఏలో నమోదు చేశారు. అప్పటి అధికారులు ఉద్దేశపూర్వకంగానే అనేక భూములను నిషిద్ధ జాబితాలో చేర్చారు. ఆ తర్వాత 22ఏ జాబితా నుంచి తొలగించి మళ్లీ హక్కులు కల్పించేందుకు అప్పటి నుంచి రైతులతో ఆటలాడుకుంటున్నారు. లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది రైతులు అధికారులు అడిగినంత సొమ్ము చెల్లించినా పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అధికారులు ముడుపులు తీసుకొని పనిచేయకుండా వెళ్లిపోయారు. సంబంధిత రైతులు డబ్బులు పోగొట్టుకొని రికార్డులు క్రమబద్ధీకరణ కాక అల్లాడుతున్నారు. మండలంలో సుమారు 5వేల ఎకరాల కుపైగా పట్టా భూములను 22ఏలో చేర్చారు. విచిత్రంగా ఒక గ్రామంలో రైతుకు ఉన్న భూమిని మరో గ్రామంలో 22ఏ భూమిగా నమోదు చేశారు. పాత రెవెన్యూ రికార్డులలో చూస్తే సంబంధిత రైతుకు 22ఏలో నమోదు చేసిన చోట భూమి రికార్డులో కనిపించదు. అప్పటి అధికారులు కళ్లు మూసుకొని ఇలాంటి అనేక తప్పులు చేశారు. ఆ రికార్డుల క్రమబద్ధీకరణకు సాంకేతికపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అనేక గ్రామాల్లో భూ ములు క్రమబద్ధీకరణకు నోచుకోవడంలేదు. రెవెన్యూ అధికారులు వాస్తవ పరిస్థితిని గుర్తించి లోతుగా పరిశీలించడం లేదు. పనులు చేస్తామని డబ్బులు తీసుకోవడం సంవత్సరాల తరబడి తిప్పుకోవడం జరుగుతోంది. ఈ వ్యవహారం అంతా అధికారులకు కల్పవృక్షంగా మారింది. లక్షలాది రూపాయలు సొంత అవసరాలకు ఏళ్ల తరబడి వాడుకుంటూ మభ్యపెడుతున్నారు. ఇటీవల రెండు గ్రామాలకు చెందిన రైతులు తమకు పనిచేయకుండా ఎంతకాలం తిప్పుకుంటారని అధికారును నిలదీయడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తున్నట్లు సమాచారం. ఆ రైతులు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలో అనేక మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలన పూర్తికావస్తున్నా నేటికీ రికార్డులు క్రమబద్ధీకరణకు నోచుకోలేదని వారు వాపోతున్నారు. ఎన్నికలు వస్తున్నందున ఇక ఈ పనులు జరిగే అవకాశం కనిపించడం లేదన్న భావనలో పలువురు రైతులు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం : షరీఫ్

పర్చూరు, ఫిబ్రవరి 25: ముస్లిం మైనారిటీల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని శాసన మండలి మాజీ చైర్మన్ ఎం.ఎ. షరీఫ్ అన్నారు. ఘర్ ఘర్‌కా నారా.. చంద్రబాబు హమారా కార్యక్రమంలో భాగంగా స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ఆదివారం పర్చూరు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండప ప్రాంగణంలో జరిగిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముస్లింలకు సముచిన స్థానంతో పాటు గౌరవం కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వమే అన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. నేడు వైసీపీ పాలనలో ముస్లింలపై దాడులు, దౌర్జన్యాలు పరకాష్టకు చేరాయన్నారు. ముస్లింల ఓట్లతో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆనక సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, మైనారిటీ కార్పొరేషన్‌లకు నిధులను అంకెలకే పరిమితం చేసిందని దుయ్యబట్టారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ముస్లిం కార్పొరేషన్ ద్వారా రుణాలను సబ్సిడీపై అందించి ఎంతో మందికి ఆర్థిక చేయూతనందించిందని అయన గుర్తు చేశారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా నవరత్నాల పేరుతో నయవంచనకు గురిచేస్తున్నదని విమర్శించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్, గుంటూరు తూర్పు ఇన్‌చార్జి ఎండీ నసీర్ అహ్మద్, రాష్ట్ర మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్.అబ్దుల్ రజాక్, షేక్.జమాలుద్దీన్, షేక్.షంషుద్దీన్, ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలి విజయం కనిగిరిదే కావాలి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- వైసీపీని వీడి సైకిలెక్కిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాము



ర్యాలీ అనంతరం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాముకు పార్టీ కండువావేసి ఆహ్వానిస్తున్న ఉగ్ర

పామూరు, ఫిబ్రవరి 20 : రాష్ట్రంలో టీడీపీ తొలి విజయం కనిగిరి నుంచే ప్రారంభం కావాలని ఆపార్టీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. కనిగిరి ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ దరిశి రాము వైసీపీని వీడి ఆదివారం ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ఉగ్రకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అక్కడున్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఉగ్ర పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా పువ్వాడి రాధాకృష్ణ కన్వెన్షన్ హాలుకు చేరుకొని సభలో ప్రసంగించారు. టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా తొలిజాబితాలో తన పేరు ఉండడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని నిజం చేసేలా ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆయనకు బహుమతిని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మీరిచ్చే ఆశీర్వాదమే కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి బాట వేస్తుందన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఏఎంసీ వైస్ చైర్మన్ దరిశి రాముకు కండువావేసి ఉగ్ర ఆహ్వానించారు. టీడీపీ పట్టణ కమిటీ చైర్మన్ డీవీ మనోహర్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు జి.దశరథరామయ్య, ఆవుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌కావిటి సుబ్బయ్య, రాష్ట్ర కమిటీ నాయకుడు ఎ.ప్రభాకర్‌చౌదరి, కె.సుభాషిణి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, జిల్లా కమిటీ నాయకులు సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, షేక్ గౌస్ బాషా, ఇర్రి కోటిరెడ్డి, మన్నం రమణయ్య, డోలా శేషాద్రి, యారవ శ్రీనివాసులు, పువ్వాడి రామారావు, తడికమళ్ల సుబ్బారావు, పువ్వాడి వెంకట్‌చౌదరి, సాయిబాబా దేవస్థానం చైర్మన్ పబ్బర్తి వెంకట సుబ్బయ్య, జి.శ్రీనివాసులు, ఎన్.సాంబయ్య, బి.మార్కు, బి.సత్యం, పోకా నాయుడుబాబు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మోపాడులో 65 కుటుంబాలు చేరిక

మండలంలోని మోపాడు గ్రామంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యవర్గసభ్యుడు వైఎస్ ప్రసాద్‌రెడ్డి అధ్వర్యంలో వైసీపీకి చెందిన సుమారు 65 కుటుంబాల వారు ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ పచ్చ కండువాలు వేసి ఉగ్ర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉగ్ర మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి నవరత్నాల పేరుతో పేదలపై భారాలు మోపారన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.గిడ్డయ్యయాదవ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.హసేన్‌రావుయాదవ్, దేవరపు మాల్యాద్రి, కొలూరి రహంతుల్లా, తెలగాల ప్రసాద్, దారపనేని సుబ్బారావు, బాబు, ఇల్లూరి కోదండరామిరెడ్డి, బూత్ కమిటీ ఇన్‌చార్జి ఖాజా మస్తాన్, కల్లూరి పుల్లయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ శ్రీధర్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

● అద్దంకిలో 5 కేంద్రాలలో నిర్వహణ
● 242 మంది గైర్హాజరు
● కేంద్రాలను పరిశీలించిన జేసీ శ్రీధర్

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25: అద్దంకిలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పలు మండలాల తహసీల్దార్‌లు ఆయా కేంద్రాలకు పర్యవేక్షకులుగా వ్యహరించారు. ఈ క్రమంలో అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల 200 మంది అభ్యర్థులకు గాను 156 మంది, శ్రీ ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాలలలో 240 మందికి 178, ఎన్‌టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో 250 మందికి 186 మంది , ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 144 మందికి 178 మంది, అలాగే కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 168 మందికిగాను 128 మంది హాజరయ్యారు. మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలలో 242 మంది అభ్యర్థులు గైర్హాజరు అ య్యారు. ఈ క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరీక్ష కేంద్రాలను బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శామ కూరి శ్రీధర్ తనిఖీ చేశారు.

మార్టూరులో..

మార్టూరు : ఏపీపీఎస్‌ఈ గ్రూప్- 2 స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షలు ఆదివారం మార్టూరులోని శ్రీ హర్షిణి విద్యా సంస్థల కార్యాలయంలో ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రంలో 600 మంది అభ్యర్థులకు పరీక్ష రాసే అవకాశం కల్పించగా వారిలో 405 మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ పరీక్షా కేంద్రాన్ని విజిట్ చేశారు. కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా గడ్డం ఆంజనేయులు, లైజన్ అధికారిగా మండల తహసీల్దారు సంధ్యశ్రీ వ్యవహరించారు.


బల్లికురవలో ప్రతిష్ఠకు ముస్తాబు చేసిన వర సిద్ధి వినాయక స్వామి దేవాలయం

28 న బల్లికురవలో వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ఠ

● నేటి నుంచి పూజలు ప్రారంభం

బల్లికురవ. ఫిబ్రవరి 25 : గ్రామస్థుల సమష్టి కృషితో బల్లికురవ గ్రామంలో నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి దేవాలయ ప్రతిష్ఠ ఈ నెల 28 వ తేదీన ఉదయం 10.16 గంటలకు జరగనుంది. సుమారు రూ.35 లక్షల విరాళాలతో దేవాలయాన్ని నిర్మించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిపేందుకు నిర్వాహక కమిటీ సిద్ధం చేసింది. ప్రతిష్ఠాచార్యులు కొప్పరం సుబ్బయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు వేద పండితులచే జరగనున్నాయి. ప్రతిష్ఠలో భాగంగా పెద్ద ఎత్తున అన్నదానం జరగనుంది.


మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు అందజేస్తున్న గ్రామ సర్పంచ్ సైకం మణి

రక్షణ పరికరాలను వినియోగించుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 25 : మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందజేస్తున్న సముద్ర రక్షణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని పల్లెపాలెం గ్రామ సర్పంచ్ సైకం మణి అన్నారు. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం గ్రామంలోని రామాలయం ఆవరణలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా సముద్ర రక్షణ పరికరాలను ఆదివారం ఆమె మత్స్యకారులకు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా పల్లెపాలెం పంచాయతీ పరిధిలోని 12 మంది బోటు యాజమానులకు ఒక్కొక్కరికి రెండు లైఫ్‌జాకెట్లను 75 శాతం రాయితీతో అందజేసినట్లు గ్రామ ఫిషరీ అసిస్టెంట్ ఎన్.పుల్లారావు తెలిపారు. సముద్ర రక్షణ పరికరాలైన లైఫ్ జాకెట్లు, జీపీఎస్ హ్యాండ్ సెట్‌లను సముద్రంలో వేటకు వెళ్ళినప్పుడు మత్స్యకారులు వినియోగించుకోవాలని సూచించారు. వీటి ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సాగరమిత్రులు పి.తేజస్విని, జి.లావణ్య, సొసైటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

అరాచక పాలన.. అక్రమ కేసులు

● ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శ
● పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరిక

సంతమాగులూరు, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. మండలంలోని పుట్టావారిపాలెం అతిథి గృహంలో ఆదివారం సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు, కొమ్మాలపాడు, సజ్జాపురం, కొప్పరం, ఏల్చూరు, పుట్టావారిపాలెం, సంతమాగులూరు గ్రామాలకు చెందిన యూనిట్, బూత్, పేజీ నేస్తం సభ్యులు, గ్రామపార్టీ అధ్యక్షులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, భావితరాల ఉజ్వల భవిష్యత్తు బంగారుమయం కావాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళల అభివృద్ధికి చేపట్టనున్న మహాశక్తి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గడిచిన నాలుగేళ్ళలో రాష్ట్రంలో నిలిచి పోయిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అధ్వానంగా మారిన రహదారులు, నిలిచి పోయిన సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలను పునః ప్రారంభించడం జరుగుతుందనే విషయాన్ని ప్రజలకు తెలిపాలన్నారు. అర్హులైన రైతులందరికీ రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం జరుగుతుందన్నారు. సంతమాగులూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు.


ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరుతున్న సంతమాగులూరు మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు


ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వల్లాపల్లి ఎస్సీ కాలనీ వాసులు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

● ఎమ్మెల్యే రవికుమార్ పిలుపు
● టీడీపీలో చేరిన వల్లాపల్లి ఎస్సీ కాలనీ వాసులు

బల్లికురవ. ఫిబ్రవరి 25 : రానున్న రెండు మాసాల పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు సైనికుల వలే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సంతమాగులూరు పుట్టవారిపాలెం అడ్డరోడ్డు వద్ద గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్లికురవ మండలం వల్లాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మందా యాకోబు, మురికిపూడి యాకోబు,మందా డేవిడ్, దర్శి బాబురావు, బుల్లియ్య, మనోహర్, పందిరి కృపారావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, చినపోలయ్య, కోట బాబు తదితరులు వైసీపీని వీడి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిరుపేదలపై పెనుబారం మోపిందన్నారు. నిత్యావసర ధరలు పెరగటంతో వారు జీవనం సాగించటం కష్టతరంగా మారిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సామాన్యులకు నెలకు కుటుంబ ఖర్చు రూ.10 వేలు కాగా ఇప్పుడు రూ.25 వేలు అవుతుందన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని అయన పిలుపు నిచ్చారు. పార్టీ నేతలు అందరూ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. అలానే ఆంధ్రప్రదేశ్ తిరిగి పూర్వ వైభవం సాధించాలన్నా, పరిశ్రమలు రావాలన్నా, తిరిగి ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, చింతల రామారావు, బొంతు యేబు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


తెలుగుదేశం పార్టీలో చేరిన వైసీపీ నాయకులు

ఇంకొల్లు,ఫిబ్రవరి 24: ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కీసర లింగారెడ్డి,వలేటి శ్రీనివాసులు ఆదివారం స్థానిక నాయకులు పాలేరు రామకృష్ణ, డాక్టరు శ్యాం సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు,ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని వారికి సూచించారు.

పేదలకోసమే సంక్షేమ పథకాలు

మేదరమెట్ల , ఫిబ్రవరి 25: తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు పేదల కోసమే సంక్షేమ పథకాలు ప్రకటించారని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ అ న్నారు. ఆదివారం కొరిశపాడుకు ఎస్సీ కాలనీకి చెందిన చెందిన తేళ్ళ శ్రీనివాసరావు, తేళ్ల యోహాను, రెబ్బవరపు నిల్సన్, తేళ్ల నాగేశ్వరరావు, రెబ్బరవపు వెంకటేశ్వర్లు, తేళ్ల చెంచయ్య, పంది నాగయ్య, రెబ్బరవపు ప్రసాద్, దుడ్డు వీరయ్య తదితరులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్‌టీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందన్నారు. ముఖ్యంగా ఎస్సీ విద్యార్థులకు అంబేడ్కర్ విదేశీ విద్యా పథకాన్ని ప్రకటించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడెం భవాని ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోళ్లమూడి సురేంద్రరెడ్డి, దొడ్డ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతు తెలుపుతున్న కొరిశపాడు ఎస్సీ కాలనీ వాసులు

పలువురు నేతల సంఘీభావం

అద్దంకి, ఫిబ్రవరి 25: అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను ఆదివారం పలువురు నేతలు కలిసి సంఘీభావం తెలిపారు. అద్దంకి పట్టణంలోని 13 వ వార్డు కు చెందిన దొండపాటి వెంకటరావు, రాజా, మురికిపూడి వినోద్, జాన్సన్, కుంచాల అంకమ్మరావు, ఆలకుంట రామారావు, బోడే వెంకటేశ్వర్లు తదితరులు ఎమ్మెల్యే రవికుమార్‌ను చిలకలూరిపేటలో కలిసి సంఘీభావం తెలిపారు. అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన భీమిశెట్టి శ్రీనివాసరావు, మహేష్, సుబ్బారావు, ఇండ్ల ఏడుకొండలు, పరిటాల రాఘవ, మద్ద సుబ్బారావు, పసుపులేటి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మురళి, రామాంజనేయులు, చక్కా నాగయ్య, సతీష్, రవి, రాజు, యేసు, శివమణి తదితరులు రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

తిరునాళ్లలో షాపులకు 5 న బహిరంగ వేలం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25: శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా షాపులు పెట్టుకుని వ్యాపారాలు చేసుకునేందుకుగాను బహిరంగ వేలం మార్చి 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు శింగరకొండపాలెంలోని సచివాలయ ఆవరణంలో జరుగుతుందని పంచాయతీ సెక్రటరీ ఎన్. మస్తాన్‌వలి ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తేదీన జరగాల్సిన వేలం అధికారుల ఆదేశాల మేరకు 5వ తేదీకి మార్పుచేశామని,ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

వైసీపీ పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి, నేతలు

పర్చూరు, ఫిబ్రవరి 25: సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టివేశారని, తెలుగుదేశం బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టీడీపీ గుంటూరు ఇన్‌చార్జి నసీర్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా మస్తాన్ అహ్మద్ అన్నారు. ఆదివారం పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండప ప్రాంగణంలో జరిగిన పర్చూరు నియోజకవర్గస్థాయి ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ముస్లింలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింల సంక్షేమాన్ని విస్మరించారని, తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాలను రద్దుచేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీ వర్గాలను చిత్రహింసలకు గురిచేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ముస్లింల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను వారు గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 300లకు పైగా షాదీఖానాలను ఏర్పాటు, మసీదుల మరమ్మతులు, పునర్నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగాయని వివరించారు. ముస్లింలకు సముచిత స్థానం, గౌవరం కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే అన్నారు. తొలుత ఎన్టీఆర్ కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ రజాక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాపట్ల పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్. జమాలుద్దీన్, పర్చూరు మండల పార్టీ అధ్యక్షులు షేక్. షంషుద్దీన్, కారంచేడు, చిన గంజాం మండలాల ప్రధాన కార్యదర్శులు ఖాసీం, పఠాన్ సమీర్, ఆజాద్, పార్లమెంట్ నాయకులు హుస్సేన్, రఫీ, అబ్దుల్ మునీర్, షరీఫ్, మస్తాన్, షేక్. హుస్సేన్, షేక్.రసూల్, గౌస్, బాబరు, మస్తాన్, షేక్. యాసిన్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏలూరి, ముస్లిం మైనార్టీ నేతలు


ఆత్మీయ సమావేశానికి హాజరైన ముస్లిం మహిళలు

ఆత్మీయ సభకు భారీగా తరలి వచ్చిన ముస్లిం మైనార్టీలు

● టీడీపీలో నూతనోత్సాహం

పర్చూరు, ఫిబ్రవరి 25: టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి ముస్లిం మైనార్టీల ఆత్మీయ సభకు విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున మహిళలు తరలి రావటంతో ప్రాంగణం జనసందోహాన్ని తలపించింది. దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఆయా గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకొని మరీ సభకు తరలి రావడం విశేషం. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఘర్ ఘర్ కా నారా.. చంద్రబాబు హమారా కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు జరిగిన అన్యాయాన్ని నేతలు వివరించారు.

ఆత్మీయ సమావేశానికి భారీగా తరలి వెళ్లిన ముస్లిం నేతలు

చినగంజాం, ఫిబ్రవరి 25 : పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కల్యాణమండపంలో జరిగే ఘర్ ఘర్కా నారా చంద్రబాబు హమారా ముస్లిం మైనార్టీ ఆత్మీయ సమావేశానికి మండల పరిధిలోని ముస్లిం నేతలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద నుంచి ఆదివారం చినగంజాం, కడవకుదురు గ్రామాల నుంచి ముస్లిం నేతలు భారీ సంఖ్యలో పర్చూరు వెళ్లారు. టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ అబ్దుల్‌కలాంఅజాద్, షేక్.జిలాని, షేక్.ఖాదర్ బాష, సలాం, ఖాజావలి, హుస్సేన్‌బాష, అన్వర్‌బాష, షేక్.బాజీ, మాబుసుభాని, మగ్బుల్ తదితర నాయకుల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పలు వాహనాల్లో ఆత్మీయ సమావేశానికి తరలివెళ్లారు.

ఇంకొల్లు నుంచి..

ఇంకొల్లు : పర్చూరులో ఆదివారం జరిగిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనానికి ఇంకొల్లు మండలంలోని ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో వాహనాల్లో తరలి వెళ్లారు. స్థానిక టీడీపీ నాయకులు బాబర్‌బాషా, రఫీ, మీరావలి, మాబుల్లా, వంస్తాన్,వకౌలాలి, ఖాజావలి, సుబాని, రబ్బానీ, మహిళలు తరలి వెళ్లారు.


పర్చూరు ఆత్మీయ సమావేశానికి వాహనాలతో తరలివెళుతున్న చినగంజాం ప్రాంత ముస్లిం మైనార్టీలు

పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్


పర్యాటకులతో మాట్లాడుతున్న ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 25 : వాడరేవు సముద్రతీరంలో స్నానాలు ఆచరించేందుకు వచ్చే పర్యాటకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం సముద్రతీరానికి వచ్చిన పర్యాటకులతో ఎస్సై మాట్లాడారు. మద్యం సేవించి స్నానాలు ఆచరించి ప్రమాదాలు కొనితెచ్చుకోరాదని హెచ్చరించారు. అలాగే లోతుకు వెళ్లకూడదని వివరించారు. వెంట తెచ్చుకున్న విలువైన వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. అలాగే వాహనాలను తీరంలోకి తీసుకురాకూడదని హెచ్చరించారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఎన్సీసీ ఎ సర్టిఫికెట్‌కు రాత పరీక్ష


పరీక్షకు హాజరైన ఎన్సీసీ క్యాడెట్లు

ఇంకొల్లు,ఫిబ్రవరి 24: రెండు సంవత్సరాలు శిక్షణ పొందిన ఎన్సీసీ క్యాడెట్స్ ఎ సర్టిఫికెట్ పొందేందుకు ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన రాతపరీక్షకు పర్చూరు డివిజన్ లో 7 ఉన్నతపాఠశాలల నుంచి 231 మంది హాజరైనట్లు ఎన్సీసీ అధికారి అలవలపాటి శ్రీమన్నారాయణ తెలిపారు. ఉదయం రాత పరీక్ష, మధ్యాహ్నం డ్రిల్‌టెస్ తదితర అంశాలపై పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వాహకులుగా అధికారులు జి.శ్రీనివాసరావు,సాంబశివరావు, సుబేదార్ సత్యేందరసింగ్, దీపక్, ముర్మూమ్ వ్యవహరించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు, టీడీపీ నాయకులు

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 25: ప్రాణహిత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో కారంచేడు టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అన్నీ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో రోగులు తరలి వచ్చారు. వారికి ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో యార్లగడ్డ రాఘవయ్య, మాజీ ఎంపీటీసీ దగ్గుపాటి చౌదరి, పోతిని సుబ్బారావు, చాగంటి కోటేశ్వరరావు, మందలపాటి సుబ్బారాయుడు పాల్గొన్నారు.

చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఆకస్మిక బదిలీ


బదిలీ అయిన ప్రసాదరావు

చీరాలటౌన్, ఫిబ్రవరి 25 : చీరాల డీఎస్పీ ప్రసాదరావును ఆకస్మికంగా బదిలీ చేస్తూ శనివారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో బేతపూడి ప్రసాద్‌ను నియమించారు. ఆయన సోమ లేక మంగళ వారాల్లో విధులు చేపట్టనున్నారు. ఎన్నికల నేపథ్యంలో కొద్ది నెలల క్రితమే ప్రసాదరావు చీరాలకు బదిలీపై వచ్చారు. ఈక్రమంలో సంబంధిత విధులలో నిమగ్నమవుతుండగా ఊహించని విధంగా బదిలీ వేటు పడింది. అయితే ప్రసాదరావు స్థాన చలనం రాజకీయంగానే జరిగిందని పట్టణంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అయితే బేతపూడి ప్రసాద్ గతంలో చీరాల పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి సమయస్ఫూర్తిగా వ్యవహరించి మన్ననలు పొందారు. అలాగే నియోజకవర్గంపై ఆయనకు అణువణువు అవగాహన ఉంది. దీంతో ఎన్నికల బాధ్యతలు సమర్థవంతంగానే నిర్వహిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

పార్కింగ్ చేసిన ఆటో చోరీ

మార్టూరు, ఫిబ్రవరి 25: మార్టూరు నాల్గో గ్రామ సచివాలయం వద్ద పార్కింగ్ చేసి ఉన్న ఆటోను గుర్తుతెలియనివ్యక్తులు శనివారం వేకువ జామున అపహరించుకుపోయారు. స్థానికంగా సంపత్ నగర్‌లో నివాసం ఉంటున్న గోపి అనే వ్యక్తి తన ఆటోను రోజూ రాత్రి సమయంలో ఈ సచివాలయం వద్ద పార్కింగ్ చేస్తుంటాడు. దాంతో ఈ విషయాన్ని గమనించిన కొంతమంది వ్యక్తులు వేకువ జామున సమయంలో ఆటోను ఎత్తుకు పోయారు. ఉదయాన్నే ఆటో కనిపించకపోవడంతో గోపి మార్టూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు సచివాలయం సమీపంలోని ఒక పెట్రోలు బంకు వద్ద ఉన్న సీసీ పుటేజీని పరిశీలించగా ఒక వ్యక్తి తన ఆటోకు ఈ ఆటోను తాడుతో కట్టుకొని తీసుకువెళ్లినట్లు కనిపించింది.ఆటో విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని గోపి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మార్టూరు, ఫిబ్రవరి 25: 40 ఏళ్ల క్రితం ఆపాఠశాలలో కలిసి మెలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆదివారం కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమై వారి అనుభవాలను నెమరువేసుకున్నారు. మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్లో 1984-85 లో 10 వతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం హైస్కూల్లో సమావేశమయ్యారు. వారు స్కూల్లో చదువుకునే రోజుల్లో వేయించిన ఇండియా మ్యాప్‌నకు మళ్లీ రంగులు వేయించారు. అనంతరం గురువు ఆవుల హనుమంతరావును వారు శాలువా కప్పి సత్కరించారు. తరువాత స్కూల్ అభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల రాజ్‌పాల్, తాటి రాంబాబు, సాధినేని శ్రీనివాసరావు, గోరంట్ల లింగయ్య భాను ప్రతాప్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

శింగరకొండ తిరునాళ్లలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



అదనపు విద్యుత్ లైన్ ల ఏర్పాటును పరిశీలిస్తున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, ఫిబ్రవరి 25 : శింగరకొండ వార్షిక తిరునాళ్లలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రూ. 50 లక్షలతో అవసరమైన అన్ని ముందస్తు చర్యలను విద్యుత్ శాఖ అధికారులు చేపట్టారు. నామ్ రోడ్డు వద్ద ఉన్న 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పాత విద్యుత్ స్తంభాల స్థానంలో ఎత్తైన కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు బిగించే పనులను ఈఈ నల్లూరి మస్తానరావు ఆదివారం ప్రారంభించారు. దేవాలయం సమీపంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఈఈ తెలిపారు. డీఈఈ సత్యనారాయణ, ఏఈ శివ ప్రసాద్, సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు పాకలలో సీనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక

చినగంజాం, ఫిబ్రవరి 25 : సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టు ఎంపిక కోసం వచ్చే క్రీడాకారుల బరువు 85 కేజీల లోపు ఉండాలని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో ప్రకాశం జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర కబడ్డీ జట్టు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మహారాష్ట్రలో మార్చి 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే సీనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలలో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9848606573, 6301015775 సెల్ నంబర్లను సంప్రదించాలని పుల్లయ్య కోరారు.

సోమశిలలో 18.072 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 25: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 18.072 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు పేర్కొన్నారు.



తారు లేచిపోయి మట్టి రోడ్డులా మారిన ఆత్మకూరు-సోమశిల రోడ్డు

కాగ్ ఆక్షేపించినా
డోంట్‌కేర్ !

- 8 ఏళ్ల క్రితం రూ.25 కోట్లతో ఆత్మకూరు-సోమశిల రోడ్డు పనులు
- నాణ్యతపై ఫిర్యాదుల వెల్లువ.. విచారించిన సీఈ
- పనుల తిరస్కరణ.. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన రూ.8 కోట్ల రికవరీకి ఆదేశం
- ఏడేళ్లు గడుస్తున్నా పట్టించుకోని యంత్రాంగం
- ఫైల్‌ను తొక్కిపెట్టి, బీజీని రెన్యువల్ చేస్తున్న వైనం
- మళ్లీ టెండర్ పిలిచేందుకు సన్నాహాలు

ప్రజాధనం అంటే ఆర్‌అండ్‌బీ అధికారులకు లెక్కే లేకుండా పోయింది. రోడ్డును నాణ్యత లేకుండా వేస్తున్నారని, ఇది పనికిరాదని, కాంట్రాక్టర్ నుంచి నగదు రికవరీ చేయాలని చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి ఆదేశించి ఏడేళ్లవుతున్నా ఇంతవరకు ఆ విషయాన్నే పట్టించుకోవడం లేదు. పైగా ఏటా బ్యాంక్ గ్యారెంటీ(బీజీ)లు రెన్యువల్ చేస్తూ కాంట్రాక్టర్‌కు ఇబ్బంది లేకుండా కాపాడుతున్నారు. అదే సమయంలో వర్కు క్లోజ్ చేయకుండానే పలుమార్లు టెండర్లు పిలిచి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. గతేడాది కాగ్ ఆక్షేపించినా లెక్కచేయని అధికారులు బీజీ రెన్యువల్ చేయడంతోపాటు తాజాగా మరోమారు ఆత్మకూరు-సోమశిల రోడ్డు నిర్వహణకు టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నాణ్యత లేకుండా వర్కు చేసిన కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేసి ఆ నగదుతో మళ్లీ రోడ్డును బాగు చేయాల్సిన అధికారులు, ఆ బాధ్యత మరిచి మళ్లీ ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ ఖజానాకు తీవ్ర నష్టం చేస్తున్నారు.

నెల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు-సోమశిల రోడ్డు అభివృద్ధికి ఎనిమిదేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. 17 కి.మీ నుంచి 40 కి.మీ వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు సుమారు రూ.25 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఓ కాంట్రాక్టర్ ఈ వర్కును 16 శాతం లెస్‌కు దక్కించుకున్నారు. 2015లో రోడ్డు నిర్మాణ పనులు జరగ్గా కొందరు స్థానికులు నాణ్యత లోపంగా పనులు జరుగుతున్నాయని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత రాష్ట్ర అధికారులకు కూడా ఫిర్యాదులు అందడంతో అప్పటి క్వాలిటీ కంట్రోల్ సీఈనే విచారించి పనుల్లో నాణ్యత లేదని నిర్ధారించి, వర్కునే రిజెక్ట్ చేశారు. అప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించిన సుమారు రూ.8 కోట్ల బిల్లులను రికవరీ చేయాల్సిందిగా సీఈ ఆదేశించారు. ఇదే సమయంలో నాణ్యతను పరిశీలించని సంబంధిత అధికారులపైనా చర్యలకు సిఫార్సు చేశారు. ఇప్పటికి ఏడేళ్లు గడుస్తున్నా ఆ ఫైల్ బయటకు రాకుండా తొక్కిపెట్టారు. ఈ విషయానికి సంబంధించిన వివరాలు కోరినా ఆర్‌అండ్‌బీ అధికారులు దాటవేత ధోరణిలో వ్యవహరిస్తుండటం గమనార్హం.

● కాగ్ ఆక్షేపణ

గతేడాది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అధికారులు ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో ఆడిటింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఆత్మకూరు-సోమశిల రోడ్డు రిజెక్ట్ వర్కును కూడా ఆడిటింగ్ చేశారు. దీనిపై సదరు అధికారులు విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంట్రాక్టర్ నుంచి ఎందుకు రికవరీ చేయలేదు? వర్కును ఎందుకు క్లోజ్ చేయలేదు? క్లోజ్ చేయకుండానే మళ్లీ టెండర్లు ఎలా పిలిచారు? వంటి అనేక ప్రశ్నలు వేయగా అధికారుల నుంచి సమాధానాలు లేవు. ఈ వ్యవహారంపై ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి వివరణ కూడా తీసుకున్నట్లు తెలిసింది. దాదాపు రూ.8 కోట్ల ప్రజాధనానికి సంబంధించిన విషయం అయినప్పటికీ అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. ప్రస్తుతం బిల్లులు రాకపోవడంతో కనీస మరమ్మతులు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇటువంటి సమయంలోనైనా సదరు కాంట్రాక్టర్ నుంచి బిల్లులు రికవరీ చేస్తే దారుణంగా తయారైన ఆత్మకూరు-సోమశిల రోడ్డుకు కనీసం ప్యాచ్‌లు అయినా వేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

● తప్పు మీద తప్పు

సాధారణంగా ఒక వర్కుకు టెండర్ వేసేటప్పుడు బీజీ అందజేయాల్సి ఉంటుంది. సదరు కాంట్రాక్టర్ వర్కును పూర్తి చేసి నిర్వహణ పీరియడ్ కూడా ముగిశాక సదరు బీజీను అధికారులు తిరిగి ఇచ్చేస్తారు. సాధారణంగా నిర్వహణ పీరియడ్ రెండేళ్లు ఉంటుంది. అప్పటితో ఆ వర్కు ముగిసినట్లవుతుంది. ఆ తర్వాత గానీ ఆ రోడ్డును మళ్లీ అభివృద్ధి చేయడం గానీ లేక నిర్వహణ చేయడానికి గానీ టెండర్లు పిలవడం సాధ్యపడదు. కానీ ఆత్మకూరు-సోమశిల రోడ్డు వర్కు విషయంలో ఇప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు నాణ్యత లోపంగా పనులు చేసిన కాంట్రాక్టర్ బీజీను ప్రతి ఏటా రెన్యువల్ చేస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ కూడా సుమారు రూ.55 లక్షల బీజీలను ఠంచనుగా రెన్యువల్ చేసి ఇస్తున్నారు. ఈ వ్యవహారంలో పైనుంచి కింది స్థాయి వరకు భారీగానే చేతులు తడిచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది కాగ్ ఆక్షేపణ చేసిన తర్వాత కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు మళ్లీ బీజీ రెన్యువల్ చేయడం గమనార్హం. మరో విచిత్రమేమిటంటే ఈ వర్కును క్లోజ్ చేయకుండానే ఆత్మకూరు-సోమశిల రోడ్డుకు ఈ ఏడేళ్ల కాలంలో పలుమార్లు టెండర్లు పిలిచారు. ఇప్పుడు మళ్లీ ఆ రోడ్డు దారుణంగా మారిపోయింది. దీంతో మరోమారు మెయింటెనెన్స్ కింద సుమారు రూ.50 లక్షలతో టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా అధికారులు తప్పు మీద తప్పులు చేసుకుంటూ వెళుతున్నారు. ఇప్పటికే మెయింటెనెన్స్ కోసం సుమారు రూ.10 కోట్లతో గత నెలలో టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ కూడా రాకపోవడం గమనార్హం. వర్కు క్లోజ్ కాకుండా మరో వర్కుకు అనుమతులు ఎలా ఇస్తారని ఆర్‌అండ్ చీఫ్ ఇంజనీర్ నయీముల్లాను వివరణ కోరగా వర్కు క్లోజ్ కాని విషయం తనకు తెలియదని చెప్పారు. కనుక్కుంటానని ఆయన సమాధానమిచ్చారు.



నెల్లూరు : అరుణాచలంవీధిలోని పాఠశాలను పరిశీలించి ఏర్పాట్లను తెలుసుకుంటున్న ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష

- 20,133 మంది అభ్యర్థుల హాజరు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 25: ఏపీపీఎస్సీ గ్రూపు-2 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలోని 80 కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష జరిగింది. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి హాల్‌టికెట్‌తో పాటు గుర్తింపు కార్డును చూపిన తరువాతే పరీక్ష హాల్లోకి అనుమతించారు. 23,908 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 20,133 మంది పరీక్షకు హాజరయ్యారు. 3,775 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 84.21గా ఉంది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం 0861-2331261 నంబరుతో కలెక్టరేట్‌లో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రూట్ అధికారులు, సిటింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష జరిగేలా చూశారు.

● ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలన

నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసిన ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ ఆదివారం పరిశీలించారు. నగరంలోని పప్పులవీధి మున్సిపల్ హైస్కూల్, తడికల బజార్‌లోని ఆర్ఎస్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్, అరుణాచలంవీధిలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, నవాబుపేటలోని బీవీఎస్ బాలికల హైస్కూల్‌లను ఆయన పరిశీలించారు. పరీక్షల ఏర్పాట్లపై అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టడంతో ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్షలు ముగిశాయన్నారు.



నెల్లూరు : మద్రాసు బస్టాండ్ సమీపంలోని వీఆర్ ఐపీఎస్ సెంటర్ వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బస్సుల కోసం నిరీక్షణ ● **తప్పని చిల్లర కష్టాలు**



పరీక్షకు వెళ్లేందుకు రద్దీగా ఉన్న బస్సు ఎక్కుతున్న అభ్యర్థులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : గ్రూపు-2 పరీక్ష రాసేందుకు ఆదివారం ఉదయం వారి వారి ఇళ్ల నుంచి అభ్యర్థులు బయలుదేరారు. పరీక్ష కేంద్రాలు దూరంగా ఉండటంతో వేలాదిమంది అభ్యర్థులు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. సాధారణ ప్రయాణికులతో పాటు పరీక్షరాసే అభ్యర్థులు కూడా ఆర్టీసీ బస్టాండ్లకు చేరుకోవడంతో బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడింది. బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రయాణ కష్టాలు తప్పలేదు. విజయవాడ, తిరుపతి ప్రాంతాల వైపు వెళ్లే బస్సుల్లో సింగల్ డ్రైవర్ మాత్రమే ఉండటం, అభ్యర్థులు ఆ బస్సులు ఎక్కడంతో టికెట్లు ఇవ్వడం కష్టంగా మారింది. చాలా సమయం టికెట్లు ఇచ్చేందుకే పట్టడంతో అభ్యర్థులు పరీక్షకు సమయం దాటిపోతున్నదని ఆందోళన చెందుతూ డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. అలాగే చిల్లర కష్టాలు కూడా వారికి చుక్కలు చూపించాయి. బస్సుల్లోని డ్రైవర్లు, చిల్లర కావాలనడం, ఆన్‌లైన్‌లో పేమెంట్‌లు చేస్తామంటే సిగ్నల్స్ పనిచేయడం లేదనడం, చిల్లర తెచ్చుకోవాలని తెలియదా, చిల్లరు మళ్లీ ఇస్తాం.. టికెట్టు వెనుక రాస్తాం... అంటూ అభ్యర్థులను డ్రైవర్లు విసుక్కోవడం కనిపించింది. దీంతో వారు బాగా ఇబ్బందులు పడ్డారు.

● పటిష్ట బందోబస్తు

గ్రూపు-2 పరీక్ష కేంద్రాల పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ సిహెచ్ సౌజన్య నెల్లూరు నగరంలోని సర్వోదయ, నారాయణ, వీఆర్ ఐపీఎస్, ఆల్‌హుదా పాలిటెక్నిక్ తదితర కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

వైసీపీ అభ్యర్థిత్వంపై సస్పెన్స్

- ఇన్‌చార్జిని ప్రకటించి పది రోజులైనా ముఖం చూపని వైనం
- పోటీకి అరవింద విముఖత ? ● కందుకూరులో మారుతున్న సమీకరణలు



అరవింద

కందుకూరు, ఫిబ్రవరి 25: కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ఆదిశంకర విద్యాసంస్థల అధినేత వంకి పెంచలయ్య కుమార్తె కఠారి అరవిందను నియమించి పదిరోజులైంది. అయినా ఇంతవరకు ఆమె కందుకూరులో అడుగుపెట్టలేదు. ఆమె పోటీకి విముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసుకుని ఇక్కడ సీనియర్ నేత, సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డి సహకారం లేకుండా నెగ్గుకురావటం అసాధ్యమన్న అభిప్రాయానికి ఆమె వచ్చినట్లు సమాచారం. తనకు ఆసక్తి ఉన్నప్పటికీ అరవిందను అత్తింటివారు ఎట్టిపరిస్థితుల్లో పోటీచేయటానికి లేదని దృఢమైన నిర్ణయంతో ఉన్నారని, దీంతో పునరాలోచనలో పడ్డామని, జగన్ తనకు అవకాశం ఇస్తే పోటీకి సిద్ధంగా ఉన్నానని వంకి పెంచలయ్య సన్నిహితులతో అన్నట్లు తెలిసింది. పెంచలయ్య మాటలను బట్టి ఇక అరవింద కందుకూరు ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోటానికి సుముఖంగా లేరన్న విషయం స్పష్టమవుతోంది. పెంచలయ్యకు అవకాశం ఇచ్చే ఆలోచన జగన్‌కు ఉంటే ముందే ఆయనకే ఇన్‌చార్జి ఇచ్చేవాడని, ఆయనకు ఇచ్చే ఉద్దేశం లేనందునే అర విందకు అవకాశం ఇచ్చాడని కూడా విశ్లేషకులు అంటున్నారు.

నాలుగు రోజులుగా పెంచలయ్య, అరవిందలు కందుకూరు వస్తున్నారని ప్రచారం జరుగుతూ ఉంది. శనివారం ఉదయం వారు కందుకూరు వచ్చి ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకుని ఆతర్వాత ఎమ్మెల్సీ మాధవరావును కలుస్తారని, అనంతరం మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని కార్యక్రమాలు ప్రారంభిస్తారని వైసీపీలోని కొందరు ముఖ్యనేతలు ప్రచారం చేశారు. అయితే ఇవేమీ జరగ్గపోగా శనివారం సాయంత్రం నెల్లూరులో విజయసాయిరెడ్డి నిర్వహించిన కీలక సమావేశా నికి కూడా అరవింద హాజరుకాలేదు. సమావేశం ప్రారంభమయ్యాక చాలా సేపటికి పెంచలయ్య వెళ్లి మొక్కుబడిగా కూర్చుని వచ్చారు. అయితే ఈ సమావేశానికి సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డి కూడా డుమ్మా కొట్టారు. ఇకపోతే ఆదివారం కూడా పెంచలయ్య వస్తున్నాడని కొందరు ప్రచారం చేశారు. అయితే కొద్దిసేపటికే అనివార్య కారణాలతో కార్య క్రమం వాయిదా పడిందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అరవిందకు ఫోన్ చేయగా, ఆమె ఫోన్ తీయనందున అసహనం వ్యక్తం చేస్తూ హైదరా బాద్ వెళ్లినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే మహీధరరెడ్డి కూడా వ్యక్తిగత పనుల కారణంగా నాలుగురోజులు స్థానికంగా ఉండటంలేదని విశ్వసనీయ సమాచారం. ఈ పరిస్థితుల్లో అసలు వైసీపీకి అభ్యర్థి ఎవరు ? అనేది కేడర్‌ను గందరగోళంలో పడేసింది.

అదిగో వస్తున్నాం...
ఇదిగో వస్తున్నాం...

● టీడీపీ అభ్యర్థి ఎంపికపై ప్రభావం

ఈ పరిస్థితులన్నీ టీడీపీ అభ్యర్థి ఎంపికపైన తీవ్ర ప్రభావం చూపే సూచనలు కనిపిస్తున్నాయి. సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డి అడుగులు ఎటువైపు అన్నవిషయాన్ని టీడీపీ ఆసక్తిగా గమనిస్తున్నది. ఆయన విషయంలో స్పష్టత వచ్చాకే ఇక్కడ అభ్యర్థిని టీడీపీ ఎంపిక చేస్తుందని భావిస్తున్నారు. ఇక ఆయనే టీడీపీలో చేరే అవకాశం ఉందని, అది జరిగితే ఆయనే అభ్యర్థి అవుతాడన్న వార్తలు కూడా బలంగానే వినిపిస్తున్నాయి. తనపేరు తొలిజాబి తాలో కాకున్నా మలి,తుది జాబితాలోనైనా ఉంటుం దని భావిస్తూ ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టికెట్ రేసులో ఉన్న యువనేత ఇంటూరి రాజేష్ కూడా అధిష్ఠానం వద్ద తన ప్రయత్నాలు ముమ్మరం చేశా రు. మరోవైపు టికెట్ రేసులో ఉన్న కోటపాటి జనార్దన్ కూడా ఆదివారం కందుకూరుకి వచ్చి సన్నిహితులతో సమావేశమయ్యారు. టికెట్ తనకే వస్తుందన్న ఆశాభావంతో ఉన్నానని, పదిరోజు లనాటి పరిస్థితులతో పోలిస్తే అవకా శాలు మెండుగా ఉన్నాయని, పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని అనుచరులను కోరినట్లు తెలిసింది.



సంగం మండలం తరుణవాయి జడ్పీ పాఠశాలలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన అల్పాహారం తింటున్న టెన్త్ విద్యార్థులు

అందని అల్పాహారం

- అర్ధాకలితో చదువులు
- 'పది' విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని ప్రభుత్వం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 25: 'విద్యార్థి వృద్ధికి పెద్దపీట వేస్తున్నాం.. పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పరీక్షల సమయంలో పౌష్టికాహారం అందిస్తున్నాం' అని గొప్పలు చెప్పుకునే ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఈ ఏడాది పదోతరగతి విద్యార్థులు అరకొర ఆహారంతోనే చదువులు కొనసాగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క పూట మాత్రమే ఇంటి నుంచి తెచ్చుకునే ఆహారం తినడం మినహా వారికి ప్రభుత్వం ఎలాంటి పౌష్టికాహారం అందించడంలేదు. దీంతో అర్ధాకలితో, అలసిన శరీరాలతో తమ పిల్లలు పది పరీక్షలకు సన్నద్ధమవుతుండడం బాధాకరమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పౌష్టికాహారం ఊసేలేదు...

తీవ్ర ఒత్తిళ్ల నేపథ్యంలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించడంపై దృష్టి సారించే విద్యార్థులకు సరైన పౌష్టికాహారాన్ని సమయానికి అందించాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వ పాఠశాలపై ఉంది. గత ప్రభుత్వాలు చొరవ తీసుకుని విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించేవి. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఆదిశగా చర్యలు తీసుకోలేదు. ఉదయం 8 గంటలకే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సాయంత్రం 6 గంటల వరకు అక్కడే ఉంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం గంట ముందుగానే ఇళ్ల వద్ద బయలుదేరి, సాయంత్రం పాఠశాలల వదిలిన గంట తరువాత ఇళ్లకు చేరుకుంటారు. అప్పటివరకు ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న మధ్యాహ్న భోజనం మినహా విద్యార్థులకు ఎలాంటి పౌష్టికాహారం అందడం లేదు. ప్రభుత్వం మాత్రం ఉదయం విద్యార్థులకు రాగిజావ ఇవ్వడంతో పాటు మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చెపుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అత్యధిక పాఠశాలల్లో రాగిజావ ఇవ్వకపోగా, ఎక్కువమంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినకుండా ఇళ్లవద్ద నుంచి తెచ్చుకున్న ఆహారాన్నే తింటున్నారు. దీంతో పేదవిద్యార్థులు ఆకలితోనే తమ చదువులు కొనసాగుతున్నారు.

● వేలాదిమంది ఇబ్బందులు

జిల్లాలోని జడ్పీ, ప్రభుత్వ, మున్సిపాలిటీ, కేజీబీవీ పాఠశాలలు కలిపి మొత్తం 285 పాఠశాలల్లో ఈ ఏడాది 13,746 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మరో 22రోజుల్లో (మార్చి 18 నుంచి) పరీక్షలు నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక తరగతులతో పాటు పురోగామి కార్యక్రమాన్ని కూడా ఆలస్యంగా ప్రారంభించారు. దీంతో విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులు, రోజువారీ పరీక్షలు, సిలబస్ రివిజన్ తదితర కార్యక్రమాల్లో నిమగ్న మవుతున్నారు. ఆ సమయంలో వీరు తమ ఆహారాన్ని కూడా పూర్తిగా తినలేని పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అత్యధికశాతం పేద విద్యార్థులే కావడంతో వీరికి ఉదయం, సాయంత్రం అల్పాహారం తెచ్చుకునే స్థోమత ఉండదు. ఉదయం పాఠశాలకు వస్తే మధ్యాహ్న భోజనం వారికి నచ్చితే కొంతమంది అక్కడే తింటుండగా, అత్యధిక పాఠశాలల్లోని విద్యార్థులు మాత్రం ఇంటి వద్ద నుంచి తెచ్చుకునే భోజనాన్ని తింటున్నారు. సాయంత్రం వరకు పాఠశాలల్లోనే ఉండి తిరిగి రాత్రికి ఇళ్లకు చేరుకుంటారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల ప్రకారం సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు నిర్వహించా లని చెప్పినా అత్యధిక పాఠశాలల్లో సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో అయితే సంబంధిత హెచ్ఎంలు, ఉపాధ్యాయులే తమ సొంత నిధులు వెచ్చించి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది కానీ, పేద విద్యార్థుల ఆకలిని మాత్రం పట్టించు కోలేదని, పౌష్టికా హారానికి ఎలాంటి నిధులు విడుదల చేయలేదని ఉపాధ్యాయులు అంటున్నారు.



నెల్లూరు బీవీనగర్ కేఎన్ఆర్ పాఠశాలలో స్టడీ అవర్‌లో టెన్త్ విద్యార్థులు

పట్టించుకోని ప్రభుత్వం

గత ప్రభుత్వాలు పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు జడ్పీ నిధులను ప్రత్యేకంగా కేటాయించేవి. అయితే ఈ ప్రభుత్వం మాత్రం కొన్నేళ్లుగా విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మాత్రం జడ్పీ సమావేశంలో మంత్రితో పాటు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు అందరి సమక్షంలో టెన్త్ విద్యార్థుల ఉన్నతికి తామెంతో కృషి చేస్తున్నామని, ఫలితాల్లో అగ్రస్థానంలో జిల్లాను నిలబెడతామని, ప్రతిరోజూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారి ఉజ్వల భవితకు బాటలు వేస్తామని ప్రకటించారు. అయితే ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి విద్యార్థులకు అల్పాహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొన్నిచోట్ల అందచేస్తున్నాం...

ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. సంబంధిత హెచ్ఎంలు, ఉపాధ్యాయులు దాతల సహకారంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇది అమలవుతుండగా, మిగిలిన పాఠశాలల్లో కూడా ఆ దిశగా చర్యలు చేపట్టమని సిబ్బందికి సూచించాం. ఈ విషయమై సంబంధిత డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

- పీవీజే రామారావు, డీఈవో



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్, డీఎంహెచ్‌వో పెంచలయ్య తదితరులు

జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్

- నిర్మాణానికి రూ.16.63 కోట్లు
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- రోగులు సద్వినియోగం చేసుకోవాలి : జడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 25 : నెల్లూరు నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) ప్రాంగణంలో నిర్మించనున్న క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి ప్రధాని ఈ భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తూ జీజీహెచ్‌లో ఏర్పాటు చేయనున్న క్రిటికల్ కేర్ భవనాన్ని త్వరగా పూర్తిచేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జ్ కలెక్టర్ వికాస్ మర్మత్ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్, వికసిత భారత్‌లో భాగంగా అనేకచోట్ల వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులతో ఈ బ్లాక్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ 50 పడకలతో కూడిన ఆధునిక క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం వల్ల ఆధునిక వైద్యపరికరాలతోపాటు వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారన్నారు. పేదలు దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే మంచి వైద్యం అందుతుందని చెప్పారు. రూ. 16.63 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. వైద్య పరికరాలకు రూ. 7.12 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు వదలకపోతే ధర్నా చేస్తాం: బీజేపీ

చేజర్ల, ఫిబ్రవరి 25: ఇరవైరోజులుగా సోమశిల దక్షిణ కాలువ ద్వారా పొదలకూరు మండలంలోని చెరువులకు నీటిని వదులుతున్నారు. అయితే చేజర్ల మండలంలోని గొల్లపల్లి, పాడేరు చెరువులు మాత్రం ఒక్కరోజు కూడా నీటిని వదలడంలేదని.. అడిగితే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఆదివారం బీజేపీ సీనియర్ నాయకులు బత్తల కిష్టయ్య, కుంకు బాలయ్యలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేజర్ల మండలంలోని గొల్లపల్లి, పాడేరు చెరువులు కింద సుమారు రెండు వందల ఎకరాలకు పైగా వరి పంట సాగు చేస్తున్నారు. అయితే పంట చేతికి రావటానికి ఇంకా రెండు నెలలు సమయం ఉన్నది. దక్షిణ కాలువ నుంచి ఆయా గ్రామాల చెరువులకు ఒక్కరోజు నీరు వదలాలని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు రైతులతో కలసి చేజర్ల తహసీల్దారుకు వినతిపత్రం అందజేశామన్నారు. అధికారులు మాత్రం కాలయాపన చేస్తున్నారో తప్ప నీటిని వదడం లేదు. దీనికి తోడు 24ఎల్ షట్టర్ వద్ద లీకేజీ అవుతున నీటిని కూడా రానీయకుండా ఇసుక బస్తాలు వేయించినట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



షట్టర్ వద్ద అడ్డుకట్ట వేసిన బస్తాలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

24ఎల్ షట్టర్ పరిశీలన

ఆదివారం ఉదయం బీజేపీ మండల నాయకులు స్థానిక రైతులతో కలసి 24ఎల్ షట్టర్ వద్ద అడ్డుకట్ట వేసిన బస్తాలను పరిశీలించారు. పొదలకూరు మండలం వారే రైతులా... చేజర్ల మండలంలో ఉన్నవారు రైతులు కాదా.. అసలు ప్రజలు చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు రైతుల సమస్యలు పట్టవా అని వారు ప్రశ్నించారు. సోమవారం సాయంత్రంలోగా నీరు వదలకపోతే జిల్లా నాయకులు, రైతులతో కలసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, వెంకట్రామ నాయుడు, లాలి వెంకటయ్య పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి గడువు పెంపు

చేజర్ల, ఫిబ్రవరి 25: ఆదురుపల్లిలోని అంబేడ్కర్ బాలయోగి గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 28వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ బి.శైలజకుమారి తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 4వ తరగతి పూర్తి చేసినవారు, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 10వ తరగతి పూర్తి చేసిన వారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఆన్‌లైన్ లేదా నేరుగా తమ పాఠశాలలో దరఖాస్తు ఇవ్వచ్చని సూచించారు.



ప్రిన్సిపాల్ శైలజకుమారి

విద్యాభివృద్ధికి కృషి

- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

సంగం, ఫిబ్రవరి 25: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు విద్యాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కృషి చేస్తు న్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఐదో తరగతి విద్యార్థులకు ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపస్ సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రతి ఏటా విద్యార్థులకు ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రోత్సహిస్తుందన్నారు. అందులో ముందున్న నెల్లూరు, సంగం ఆపస్ శాఖలను అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

బీజేపీ బలోపేతానికి కృషి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 25: గ్రామస్థాయి నుంచి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ నాయకులు ముడమాల రమేష్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై గ్రామగ్రామాన ప్రజలకు అవగాహన కల్పించి వారి చైతన్యం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం దారుణమన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని ప్రాంతీయ పార్టీల్లో నెలకొన్న వర్గపోరు బీజేపీకి కలుస్తొందన్నారు.

పోతురాజు శిలలకు జీర్ణోర్ధరణ పూజలు

సంగం, ఫిబ్రవరి 25: తరుణవాయి నడిబొడ్డున ఉన్న పోతురాజు, సీతాలదేవి శిలలకు ఆదివారం జీర్ణోర్ధణ పూజలు వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా శిలలకు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం చేశారు. అనంతరం పోతురాజు, సీతాలదేవి శిలలను ఎద్దల బండిపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వాటిని రామాలయంలో భద్రపరిచారు. నూతన మండపం నిర్మించిన అనంతరం తిరిగి ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పూజలు చేస్తున్న వేద పండితులు

శాస్త్రోక్తంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

సీతారామపురం , ఫిబ్రవరి 25: స్థానిక పడమటివీధిలోని శివాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా పరమశివుడు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పండితుల ఆధ్వర్యంలో పలువురు దంపతులు కంకణదారులై కల్యాణంలో పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో షబే బరాత్

అనంతసాగరం, ఫిబ్రవరి 25: అత్యంత పవిత్రమైన షబే బరాత్ వేడుకలను ముస్లిం సోదరులు ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించి జాగరం చేస్తూ నఫిల్ నమాజు చేశారు. షబే బరాత్ ప్రాముఖ్యతను వక్తలు వివరించారు.

ఉదయగిరి: సబ్ బరాత్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, ఉదయగిరి, బిజ్జంపల్లి గ్రామాల్లో ముస్లిం సోదరులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్‌లు ఖురాన్ బోధనలను వివరించారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన మసీదు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 25: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో విజయసంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్లు ఓబులరెడ్డి, వాసుదేవరెడ్డి, షేక్ అలీఅహ్మద్, ఉప సర్పంచ్ ముర్తుజా పాల్గొన్నారు.

రైల్వే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోదాం

బిట్రగుంట, ఫిబ్రవరి 25: బిట్రగుంట, కావలి రైల్వే స్టేషన్ల మధ్య నూతనంగా నిర్మించిన బ్రిడ్జి-152ను సోమవారం ప్రారంభించేందుకు వస్తున్న రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి పలు రైల్వే సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు అందరూ కలసి రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ కోరారు. బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు సంబంధించిన సమస్యలు, బిట్రగుంటలోని ఎల్సీ గేట్-144తో స్థానికులు పడుతున్న అవస్థలను విన్నవించుకుందామన్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, అభిమానులు, స్థానిక వ్యాపారులు తరలిరావాలని ఆయన కోరారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

కందుకూరు, ఫిబ్రవరి 25: మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని రాళ్లవీధిలో ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా వడ్లమూడి శేఖర్, ఉపాధ్యక్షులుగా మధుర మధు, మాధవరం వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా కొమ్మెర్ల విజయ్‌లను ఎన్నుకున్నారు. సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు వెంకటేశ్వర్లు, కృష్ణ, హరిబాబు, వీరనారాయణ, బ్రహ్మయ్య, పాపయ్య, చిన్న, రమేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై ప్రభుత్వ మొండి వైఖరి తగదు

బిట్రగుంట, ఫిబ్రవరి 25: ఉద్యోగుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి తగదని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి ఎంపీపీ పాఠశాల్లో మండల బీటీఏ అధ్యక్షుడు ఆవుల కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతు కష్టపడి పనిచేసే ఉపాధ్యాయులకు రావాల్సిన పీఎఫ్, డీఏ, ఏపీజీఎల్ఐ బకాయిలను ఇంతవరకు చెల్లించలేదన్నారు. తక్షణం బకాయిలను విడుదల చేసి 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని పునరుద్ధరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉద్యోగులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గంగాధర్, జిల్లా కార్యదర్శులు టీ.రవి, సీహెచ్ సుదర్శన్, జీ.సత్యం, కే.కృష్ణప్రసాద్, సురేష్‌బాబు, కుడారి మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య

గ్రామాల్లో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

లింగసముద్రం, ఫిబ్రవరి 25: మండలంలోని కొన్ని గ్రామాల్లో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. దీంతో పలువురు గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెం సమీపంలోని ఓ కాలనీలో, పెదపవనిలో గంజాయి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వీరు గంజాయి తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి రూ.100 నుంచి రూ.200లకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. లింగసముద్రం, మొగిలిచెర్ల, శాయిపేట గ్రామాలకు చెందిన వారు ప్రతిరోజూ జంపాలవారిపాలెం వచ్చి గంజాయి తీసుకెళుతున్నట్లు తెలిసింది. పెదపవనిలో పాడుబడిన హైస్కూల్ భవనాల వద్ద కొందరు యువకులు నిత్యం గంజాయి పీలుస్తూ జోగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అల్లూరు, ఫిబ్రవరి 25 : విద్యుత్ సరఫరాను నియంత్రించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. మండల కేంద్రమైన అల్లూరులో అక్కడక్కడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు తగ్గిపోయి ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయి. అల్లూరు వాటర్ ప్లాంట్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తగ్గిపోయి ఉండడంతో అక్కడ నిత్యం పశు సంచారం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా వేణుగోపాలస్వామి దేవాలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. అదేవిధంగా ఆర్‌డీఆర్ కాలనీలో పాఠశాలకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ప్రమాదానికి గురవుతారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీటిని మరమ్మత్తులు చేపట్టి ప్రమాదం లేకుండా చూడాలని తల్లిదండ్రులు, రైతులు కోరుతున్నారు.





వాటర్ ప్లాంట్ వద్ద, వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

పాఠశాలకు ప్రింటర్ వితరణ

సంగం, ఫిబ్రవరి 25: తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆదివారం గ్రామ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు ప్రింటర్, పదవ తరగతి విద్యార్థులకు పాడ్స్, పెన్నులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు కోరిక మేరకు వీటిని అందచేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో చల్లా ప్రభాకర్ యాదవ్, డేగా విజయ్‌కుమార్ యాదవ్, వినయ్ కుమార్, మద్దెల సందీప్ ఉన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

గురుకులంలో ప్రవేశానికి 28 వరకు గడువు పొడిగింపు

బిట్రగుంట, ఫిబ్రవరి 25: బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పద్మజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : కావ్య

కావలి, ఫిబ్రవరి 25: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గ్రహించిన యువత టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని టీడీపీ కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. 23వ వార్డు ఇన్‌చార్జి వర్థినేని వెంకటేశ్వర్లు నాయుడు, అంబటి క్రిషోర్, గోసు రవి, షేక్ షమీర్‌ల ఆధ్వర్యంలో పలువురు యువత ఆదివారం బైక్ ర్యాలీగా పట్టణంలోని ముసునూరులోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కావ్య పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే 27వ వార్డు నుంచి ఆ వార్డు ఇన్‌చార్జి హరిక్రిష్ణ ఆధ్వర్యంలో పలువురు మత్స్యకారులు టీడీపీలో చేరగా వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా బీజేపీ పట్టణ మాజీ ఉపాధ్యక్షుడు పొన్నగంటి మురళి టీడీపీలో చేరారు. ఆయనకు క్రిష్ణారెడ్డి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా కావలి రూరల్ మండలం సిరిపురంకు చెందిన ముస్లింలు వైసీపీని వీడి షేక్ సుల్తాన్ ఆధ్వర్యంలో ముసునూరులోని టీడీపీ కార్యాలయానికి వచ్చి పార్టీలో చేరారు. వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కావలి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజకుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన యువతతో కావ్య క్రిష్ణారెడ్డి

విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు : విశ్వబ్రాహ్మణ సంఘంకు చెందిన పలువురు నాయకులు కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆసంఘం పట్టణ అధ్యక్షుడు గువ్వాడి ఓంకారాచారి, ప్రధాన కార్యదర్శి వీ.నరసింహారావు, కోశాధికారి బీ.శివాచారి, ఎన్. శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డులో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'

కందుకూరు, ఫిబ్రవరి 25 : పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని ఐఎస్ రావునగర్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల తో కలిసి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇకనైనా మేల్కొని జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడకుంటే మన బిడ్డల భవిష్యత్తుకు మనమే అన్యాయం చేసుకున్నవాళ్లమవుతామన్నారు. కందుకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందని, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని విమర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతానికి చెందిన పలువురు వైసీపీని వీడి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముప్పవరపు వేణు, కొమరరమణయ్య, ఓరుగంటి రామ్మూర్తి, ముప్పవరపు కృష్ణ, గూండా వెంకటరావు, వీర రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

జనసేనకు మరికొన్ని సీట్లు కేటాయించాలి

కావలి, ఫిబ్రవరి 25: టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా మలివిడత జాబితాలో కూడా జనసేనకు గౌరవపదంగా చంద్రబాబు నాయుడు మరికొన్ని అసెంబ్లీ సీట్లు కేటాయించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య కోరారు. తొలివిడతలో జనసేనకు 24 ఎమ్మెల్యే, 3 ఎంపీ సీట్లని చెప్పడంతో జనసైనికులు అసంతృప్తితో ఉన్నారన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై, కర్నూల్‌లో ఈనాడు కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పోకల చంటి, లక్ష్మణ్, రామకృష్ణ, బచ్చు ప్రసాద్ రావు, ఆనాల బ్రహ్మయ్య, పోలయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్లకు అభినందన

కొండాపురం, ఫిబ్రవరి 25: ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎంపికైన కాకర్ల సురేష్‌కు టీడీపీ మండల నాయకులు ఆదివారం వింజమూరులోని కాకర్ల క్యాంపు కార్యాలయానికి వెళ్లి అభినందనలు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో అభ్యర్థిగా ప్రకటించారని, ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కాకర్ల నాయకులను, కార్యకర్తలను కోరారు. కాకర్లను కలసిన వారిలో భీమవరప్పాడు, నేకునాంపేట, యర్రబాలెం, గుడవళ్లూరు తదితర గ్రామాలకు చెందిన వారితో పాటు టీడీపీ మండల మాజీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు, నాయకలుఉ పీ.చంద్రబాబునాయుడు, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, కొమ్మి ప్రభాకర్, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, గుది పేరయ్య, అల్లిక మధు, జీ.మాధవరావు తదితరులు ఉన్నారు.



కాకర్లకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

శ్రీవారికి పుష్పయాగం



కావలిటౌన్, ఫిబ్రవరి 25: ముసునూరు ట్రంకురోడ్డులో మందాటి చెరువు వద్ద వెలసివున్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి ఆదివారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఉదయం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తోమల సేవ, ప్రత్యేక అర్చనలు, హోమం పూజల అనంతరం అష్టోత్తర కలశస్నపనం పారమార్థిక శాంతిహోమం నిర్వహించారు. ముసునూరు బాలాజీనగర్, ఆటోనగర్ వాస్తవ్యులచే రాత్రి శ్రీవారికి అర్చక బృందం నిర్వహించిన పుష్పయాగం కార్యక్రమాల్లో పెద్దఎత్తున భక్తజనం పాల్గొని తిలకించారు.